కిషన్‌చందర్ రచనలు-1
రూ॥ 200/-
పేజీలు: 220


నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★


## కుప్పకూలిన బ్రిడ్జి



05


సంపుటి 08, సంచిక: 220 | గురువారం | 10-07-2025 | ఖమ్మం

Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00




గోవాలోని ఆజాద్ మైదాన్‌లో అంగన్‌వాడీల నిరసన

# సార్వత్రిక సమ్మె సక్సెస్

## మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా గర్జించిన కార్మికలోకం

- నో టు ఫోర్ లేబర్ కోడ్స్, స్వామినాథన్ కమిషన్ సిఫారసు అమలు, ఖాళీ పోస్టుల భర్తీ, ఒపిఎస్ పునరుద్ధరణ చేయాలంటూ నినదించిన శ్రామికులు, రైతులు
- పలు రాష్ట్రాల్లో బంద్, రైల్ రోకో, రాస్తా రోకో, ఆర్‌టిసి, ఆటో, ట్యాక్సీల సమ్మెతో అనేక చోట్ల స్తంభించిన ప్రజా రవాణా
- బ్యాంకింగ్ రంగంపై తీవ్ర ప్రభావం
- నిలిచిన రూ.20లక్షల కోట్ల చెక్కుల క్లియరెన్స్
- ఢిల్లీ జంతర్‌మంతర్ సభలో ప్రసంగించిన కార్మిక సంఘాల జాతీయ నేతలు
- పట్నాలో సమ్మె సంఘీభావ ర్యాలీలో డి.రాజా, ఎంఎ బేబి
- బెంగాల్‌లో ఘర్షణలు, సమ్మెలో అదానీకి చెందిన సిమెంట్ కంపెనీల కార్మికులు
- ఈశాన్య రాష్ట్రాల్లోనూ సమ్మెకు అపూర్వ ఆదరణ
- గనుల్లో నిలిచిన బొగ్గు, ముడిఖనిజాల వెలికితీత

### సమ్మెలో పాల్గొన్న పాతిక కోట్లకు పైగా కార్మికులు

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా బుధవారం జరిగిన సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా పది కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర్య సంఘాల సమాఖ్యలు ఇచ్చిన పిలుపునకు అన్ని రాష్ట్రాలలో కార్మికులు, రైతులు, ప్రజలు నుంచి మంచి స్పందన లభించింది. ''నో టు ఫోర్ లేబర్ కోడ్స్'', ''కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి'', ''స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి'';''ప్రభుత్వ రంగంలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి'', ''పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి'' అంటూ పెద్ద ఎత్తున నినదిస్తూ సమ్మెను హోరెత్తించారు. పలు చోట్ల బంద్ జరపగా, అనేక చోట్ల రాస్తారోకోలు, రైల్ రోకో కార్యక్రమాలను నిర్వహించారు. బంద్‌తో పారిశ్రామిక వాడలు స్థంబించిపోయాయి.

బ్యాంక్, ఇన్సూరెన్స్, పోస్టల్, టెలికాం, అణు విద్యుత్, సిమెంట్, విద్యుత్, ప్రభుత్వ ఉద్యోగులు కూడా సమ్మెకు మద్దతుగా నిలవడంతో ఆయా రంగాలలో సేవలపై తీవ్ర ప్రభావం పడింది. జూట్ మిల్లులు, టీ తోటల కార్మికులు, పోర్టు, డాక్ సిబ్బంది సమ్మెలో భాగస్వాములయ్యారు. ప్రైవేటు రంగంలో పారిశ్రామిక వాడలోల ఎంఎన్‌సిలలో పని చేసే కార్మికులు ట్రక్కు, ఆర్‌టిసి , ఆటో డ్రైవర్లు విధులకు దూరంగా ఉండడంతో అనేక చోట్ల వాణిజ్య, ప్రజారవాణా వ్యవస్థలు కుంటుపడ్డాయి. ఎన్ఎండిసి, బొగ్గు సహా స్టీల్, అల్యూమీనియం, బంగారు తదితర గనుల కార్మిక సంఘాలు కూడా సమ్మెలో పాల్గొనడంతో ఖనిజాల ఉత్పత్తి పెద్ద ఎత్తున నిలిచింది. రక్షణ రంగ ఉద్యోగులు సమ్మెకు మద్దతుగా గంట పాటు నిరసనలు చేపట్టారు. రైల్వే యూనియన్‌లు సైతం సంఘీభావంగా ప్రదర్శనల్లో పాల్గొన్నాయి. ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు, మత్స్యరంగ కార్మికులు, హమాలీలు పెద్ద ఎత్తున్న సమ్మె

తరువాయి 2లో













ఢిల్లీ జంతర్‌మంతర్‌లో కేంద్ర కార్మిక సంఘాల సభలో ప్రసంగిస్తున్న అమర్‌జీత్ కౌర్

### సమ్మె దిగ్విజయం : కార్మిక సంఘాలు

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె గ్రాండ్ సక్సెస్ అయిందని, 25 కోట్ల మందికిపైగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు ఇందులో భాగస్వాములు అయ్యారని సమ్మెకు పిలుపునిచ్చిన పది కేంద్ర కార్మిక సంఘాలు ప్రకటించాయి. సమ్మెలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఒక ప్రకటనలో అభినందనలు తెలియజేశాయి. గ్రామీణ భారతంలో, బ్లాక్ సబ్ డివిజన్ స్థాయిలో అసంఘటిత కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు, ఇతర కార్మికులు పెద్ద ఎత్తున సమ్మెను దిగ్విజయం చేశాయని పేర్కొన్నాయి. విద్యార్థులు, యువకులు సమ్మెకు మద్దతుగా పాల్గొన్నారని, కిసాన్ మోర్చ, వ్యవసాయ కార్మిక సంఘాల శ్రేణులన్నీ ప్రత్యక్ష భాగస్వాములయ్యాయని తెలిపాయి.





## సమ్మెకు విశేష స్పందన

- కార్మికుల నినాదాలతో దద్దరిల్లిన తెలంగాణ
- పారిశ్రామికవాడల్లో మూతపడ్డ కంపెనీలు
- హైదరాబాద్‌లో భారీ ర్యాలీ
- రాష్ట్రవ్యాప్తంగా వీధులకెక్కిన అన్ని సంఘాల కార్మికులు

ప్రజాపక్షం/హైదరాబాద్

కార్మిక లోకం కదం తొక్కింది... ఎర్రజెండాలతో తెలంగాణ ఎరుపెక్కింది... కార్మికుల నినాదాలతో దద్దరిల్లింది.. కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మె విజయవంతమైంది. సమ్మెలో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, బ్యాంకింగ్, ఇన్సురెన్స్, సంఘటిత, అసంఘటిత కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు ఏకమై ఎక్కడికక్కడ సభలు, సమావేశాలు నిరసన ర్యాలీలు నిర్వహించారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా పలు పారిశ్రామిక వాడల్లో కంపెనీలన్ని మూతపడ్డాయి. సమ్మెలో బ్యాకింగ్, ఇన్సురెన్స్ రంగాల ఉద్యోగులు సైతం భాగస్వామ్యం కావడంతో చాల మేరకు బ్యాంకులు, ఇన్సూరెన్సు కార్యాలయాలు తెరుచుకోలేదు.. అదేవిధంగా ఆర్‌టిసి కార్మికులు సైతం సమ్మెకు మద్దతు తెలుపడంతో ఉదయం వేళా బస్సులను చాల మేరకు రోడ్డెక్కలేదు.. ఆటో సంఘాలు సైతం సమ్మెలో పాల్గొన్నడంతో ఆటోలు అక్కడక్కడమాత్రమే ఆటోలు నడిచాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో అవుట్ సోర్సింగ్,

తరువాయి 2లో

# చర్చించేందుకు ఫాంహౌస్‌కైనా వస్తా..

- నదీజలాలపై చర్చకు సిద్ధం
- కెసిఆర్ లేఖ రాస్తే వెంటనే అసెంబ్లీ
- వీలు కాదంటే ఎర్రవెల్లిలో మాక్ అసెంబ్లీకైనా రెడీ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం
- ప్రజాభవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్



ప్రజాపక్షం/హైదరాబాద్

కృష్ణ, గోదావరి నది జలాల విషయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, తొమ్మిదిన్నరేళ్ల బిఆర్‌ఎస్/టిఆర్‌ఎస్ పాలన, ప్రస్తుత కాంగ్రెస్ ఏడాదిన్నర పాలన నిర్ణయాలపైన శాసనసభ, శాసనమండలిలో చర్చిద్దామని, ఒక తేదీని ఖరారు చేసి స్పీకర్‌కు కెసిఆర్ లేఖ రాస్తే, ఆ రోజు చర్చకు ప్రభుత్వం తరపున తాము సిద్ధమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కెసిఆర్ గౌరవానికి ఎటువంటి భంగం కలిగించబోమని, పల్లెత్తు మాట అననివ్వబోమని, సభలో ఎటువంటి గందరగోళం లేకుండా చూసుకుంటానని భరోసనిచ్చారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా ఇచ్చే సలహాలను, కెసిఆర్ అనుభవాలను తాము పరిగణలోకి తీసుకుంటామని, మంచి వాతావరణంలో చర్చ జరగడం ద్వారా తెలంగాణ శాసన సభ దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. స్పీకర్ అనుమతితో సభలోకి న్యాయ, నీటిపారుదల రంగ నిపుణులు, రిటైర్డ్ ఇంజనీర్లను, అడ్వకేట్ జనరల్‌ను కూడా ఆహ్వానించి వారి అభిప్రాయాలను కూడా తీసుకుందామని, తద్వారా ప్రజలకు అన్ని విషయాలు తెలుస్తాయన్నారు. ఒక వేళ కెసిఆర్ ఆరోగ్యం బాగా లేకపోతే ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో చర్చకైనా తాము సిద్ధమేనని, అక్కడికి మంత్రులను పంపిస్తామని, కెసిఆర్ కోరుకుంటే తాను కూడా వస్తానని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో మాక్ అసెంబ్లీ తరహాలో ఎర్రవెల్లలో కూడా మాక్ అసెంబ్లీ తరహా చర్చ పెడుదామన్నారు. ప్రస్తుత విలువైన సమయంలో

తరువాయి 2లో

## ఎరువుల కొరత రానివ్వం

### సిఎం రేవంత్ రెడ్డి వినతికి స్పందించిన కేంద్ర మంత్రి జెపి నడ్డా

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ రైతులకు ఎరువుల కొరత లేకుండా అన్ని విధాలా సహకారం అందిస్తామని కేంద్ర రసాయన, ఎరువుల శాఖ మంత్రి జెపినడ్డా తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం మంగళవారం కేంద్ర మంత్రి ని కలిసి రాష్ట్రానికి సరిపడా యూరియా , ఎరువులు సరఫరా చేయాలని కోరిన విషయం తెలిసిందే.ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జూలై, ఆగస్టు నెలల్లో యూరియాను నిరాటంకంగా సరఫరా చేయాలనిఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తి పై స్పందించిన కేంద్ర మంత్రి నడ్డా రైతుల అవసరాలను తీర్చడానికి మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ కు అవసరమైన మేర ఎరువులు సరఫరా ఉండేలా చూసుకోవాలని ఎరువుల శాఖ అధికారులను ఆదేశించారు.యూరియాను వ్యవసాయేతర అవసరాలకు మళ్లించకుండా, రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు సమానంగా ఎరువులు పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వ

తరువాయి 2లో



### ప్రపంచ నలుమూలల నుంచి హైదరాబాద్‌కు

## పెట్టుబడులు తరలొస్తున్నాయ్

- ప్రజాప్రభుత్వం రీజినల్ రింగ్‌రోడ్డును ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది
- ఫార్మా, ఐటి కంపెనీలతో పాటు అనేక రకాల పారిశ్రామిక క్లస్టర్ల నిర్మాణం
- సిఐఐ సదస్సులో డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు స్వర్గధామం, ఆధునికత అభ్యుదయానికి కేంద్రంగా రాష్ట్రం రోజురోజుకు శర వేగంగా అభివృద్ధి చెందుతుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. కాన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్స్ (సిఎఫ్ఒ) సదస్సుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఔటర్ రింగ్ రోడ్డు

తరువాయి 2లో

### సుందిళ్ల, అన్నారం బ్యారేజీలో

## నీళ్లు నింపితే ప్రమాదం

- 44 గ్రామాలు, సమ్మక్క బ్యారేజీ కొట్టుకుపోతాయ్...
- భద్రాచలం ఆలయానికీ ప్రమాదమే : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను నీటితో నింపితే, 44 గ్రామాలు, సమ్మక్క బ్యారేజీ కొట్టుకుపోతాయని, భద్రాచలం ఆలయం, భద్రాచలం గ్రామం కూడా ప్రమాదంలో పడుతుందని ఎన్‌డిఎస్‌ఎ బృందం స్పష్టం చేసినట్టు నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. నీళ్లు నింపితే సమస్య మరింత తీవ్రంగా ఉంటుందని ఎన్‌డిఎస్‌ఎ నివేదిక స్పష్టం చేసిందన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం వల్లనే కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా మేడిగడ్డ కూలిందని, తద్వారా శాశ్వతంగా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందన్నారు. కూలిపోయిన బ్యారేజీని ఎలా బాగు చేయాలని ఆలోచిస్తున్నామని, ఇందులో ఎటువంటి రాజకీయం లేదన్నారు. ఎన్‌డిఎస్‌ఎ నివేదిక ద్వారానే తాము ముందుకు వెళ్తున్నామని, ఇందులో తమకు ఎటువంటి స్వార్థం లేదన్నారు. అన్నారం, సుందిళ్ల కు డిపిఆర్ రూపొందించక ముందే, సిడబ్ల్యుసికి సమర్పించకముందే టెండర్, పనులు మొదలు పెట్టారని, 2016 పనులు మొదలు పెడితే, 2018లో అనుమతులు వచ్చాయని, డిపిఆర్ ఆమోదం పొందకుండానే

తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## మలేసియా విమానాన్ని కూల్చేసింది రష్యా దేశమే
### యూరప్ హెచ్ఆర్‌కోర్టు వెల్లడి

**దిహేగ్ :** ఉక్రేన్‌లో భీకర దాడులలు చేయడం ద్వారా రష్యా అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించిందని మొదటిసారి యూరప్‌లోని అత్యున్నతమైన మానవహక్కుల న్యాయస్థానం బుధవారంనాడు ప్రకటించింది. 2022 ఫిబ్రవరిలో ఉక్రేన్‌పై దాడులు మొదలైన తర్వాత యూరప్ మానవహక్కుల న్యాయస్థానం ఈ ప్రకటన చేయడం ఇదే మొదటిసారి. అదేవిధంగా 2014లో మలేసియా ఎయిర్‌లలైన్స్ విమానం–17 కుప్పకూలిపోవడం వెనుక కూడా రష్యా హస్తం ఉందని మొదటిసారి ఈ న్యాయస్థానం తప్పుపట్టింది. ఈ విమాన ప్రమాదంలో 298 మంది ప్రయాణికులు మరణించారు. ఉక్రేన్, నెదర్లాండ్స్ దేశాలు రెండూ ఈ న్యాయస్థానంలో రష్యాకు వ్యతిరేకంగా దాఖలు చేసిన నాలుగు కేసులను విచారణ చేసిన తర్వాత స్ట్రాస్‌బర్గ్‌లోని ఈ న్యాయస్థానంలోని న్యాయమూర్తులు రష్యాపై వేలెత్తిచూపించి తప్పుపట్టారు. మలేసియా ఎయిర్‌లైన్స్ విమానాన్ని కూల్చేడమే కాకుండా ఉక్రేన్‌లో పిల్లలను కూడా రష్యా అపహరించుకుపోయిందని, ఇది మానవహక్కుల ఉల్లంఘనేనని పేర్కొంది.

## కొరత రానివ్వం (మొదటి పేజీ తరువాయి)

అధికారులను కోరారు. ఇదే సమయంలో తెలంగాణలో యూరియా వినియోగం పెరుగుతుండటంపై కేంద్ర మంత్రి నడ్డా ఆందోళన వ్యక్తం చేశారు. 2023–24 యాసంగి తో పోలిస్తే 2024–25 యాసంగిలో యూరియా అమ్మకాలు 21శాతం పెరిగాయన్నారు. రసాయన ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించి, సేంద్రీయ, సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి కేంద్రం ప్రణామ్ పథకంద్వారా రాష్ట్రప్రభుత్వాలకు ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు.

## పెట్టుబడులు తరలొస్తున్నాయ్
(మొదటి పేజీ తరువాయి)

ఫలితాలను మనం చూసాం, సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రీజినల్ రింగ్ రోడ్డును ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుందని వివరించారు. రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో ఫార్మా, ఐటి కంపెనీలతోపాటు హౌసింగ్, అగ్రికల్చర్, హ్యాండ్లూమ్స్ వంటి అనేక రకాల పారిశ్రామిక క్లస్టర్ల నిర్మాణం జరుగుతుందని డిప్యూటీ సిఎం వివరించారు. హైదరాబాద్ కు ప్రపంచం నలుమూలల నుంచి పెట్టుబడులు తరలివస్తున్నాయని తెలిపారు. లండన్ లోనీ థెమ్స్ నది మాదిరిగా హైదరాబాద్ నగరంలో మూసి నదిని పారించేందుకు మూసి పునర్జీవనం ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని తెలిపారు. పెట్టుబడులకు హైదరాబాద్ పట్టణం, తెలంగాణ రాష్ట్రం స్వర్గ ధామం లాంటిదని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో నైపుణ్యం ఉన్న కార్మికులు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తక్కువ ధరకు లభిస్తారు, చక్కటి వాతావరణం, కాలుష్య రహితం, 24 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా వంటి అనేక అంశాలు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని డిప్యూటీ సీఎం తెలిపారు. నైపుణ్యం ఉన్న మానవ వనరులను సృష్టించడమే లక్ష్యంగా రాష్ట్రంలోని 100 ఐటిఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చామని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాదులో హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ మూడు సిటీలు ఉన్నాయి త్వరలో ఫ్యూచర్ సిటీ ఫోర్త్ సిటీ గా అందుబాటులోకి రాబోతుందని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని తెలిపా రు. మారుతున్న ప్రపంచంలో ఫైనాన్స్ రంగం కేవలం లెక్కల పరిరక్షణకే పరిమితం కాలేదు, CFOలు ఇప్పుడు సంస్థల దశను నిర్దేశించే మార్గదర్శకులు అని ఇప్పుడు సిఎం తెలిపారు. CFO లు వ్యూహకర్తలుగా, సాంకేతిక నిపుణులుగా ప్రమాదాల నిర్వహణలో శిల్పులుగా మారాలని డిప్యూటీ సిఎం సూచించారు. ఈ సదస్సులో సిఐఐ నిర్వాహకులు శేఖర్ రెడ్డి, శివ ప్రసాద్ రెడ్డి, బి.వి. ఆర్ మోహన్ రెడ్డి, ఎంవి నరసింహం, గౌతమ్ రెడ్డి, సమీయుద్దీన్‌లు పాల్గొన్నారు.

## నీళ్లు నింపితే ప్రమాదం
(మొదటి పేజీ తరువాయి)

రూ. 25,000 కోట్లను ముందుగా కాంట్రాక్టర్లకు చెల్లించిన విషయాన్ని ఉత్తమ్ తెలిపారు. ఉమ్మడి రాష్ట్రం కంటే బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే ఎపి ప్రభుత్వం అక్రమంగా ఎక్కువ మొత్తంలో కృష్ణ జలాలను తరలించారని ఉమ్మడి ఎపిలో 2004 నుంచి 201415 సంవత్సరం వరకు శ్రీశైలం రిజర్వాయర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు 720 టిఎంసిలను తరలిస్తే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడితన తర్వాత బిఆర్ఎస్ అధికారంలో వచ్చిన తర్వాత 2014 నుంచి 2023 సంవత్సరం వరకు 12 వందల టిఎంసి నీటిని తరలించారని వివరించారు. రూ.38వేల కోట్లతో తుమ్మిడిహట్టి ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్ట్‌కు కేంద్రం నుంచి అనుమతి లభించిందని, రూ.11,679 కోట్లతో 32 శాతం వరకు పనులు పూర్తయ్యాయని వివరించారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 డిసెంబర్‌లో సిఎంగా ఉన్న కెసిఆర్ డాక్టర్ ప్రాణహిత సృజన స్రవంతి ప్రాజెక్ట్ (తుమ్మిడిహట్టి వద్ద ) అద్భుతమని, ఇది తెలంగాణ రాష్ట్రానికి అవసరమని, పోలవరం తరహా ఈ ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసిన విషయాన్ని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తు చేశారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్ట్‌ను యథాతథంగా పూర్తి చేస్తే గత కాంగ్రెస్‌కు క్రెడిట్ వస్తుందని, లేదా ఎక్కువ అంచనాలు పెంచితే కమీషన్లు పెరుగుతాయని, ఈ రెండు కారణాలతోనే మేడిగడ్డకు తరలించారని ఆరోపించారు. కృష్ణానది జలాలలో తెలంగాణ రాష్ట్రానికి 34 శాతం, ఎపికి 66 శాతం వాటా ఇవ్వాలని, బ్రిజేష్ కుమార్ తుది తీర్పు వచ్చే వరకు ఇది అమలులో ఉంటుందని అపెక్స్ కమిషన్ సమావేశంలో పాల్గొన్న అప్పటి సిఎం కెసిఆర్, నీటి పారుదల శాఖ మంత్రిగా హరీశ్‌రావు రాతపూర్వకంగా అంగీకరించారని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# ట్రంప్ ప్రకటన మరునాడే
## ఉక్రేన్ గగనతల ప్రధాన కేంద్రంపై రష్యా భీకరదాడి

### పది ప్రాంతాలపై 728 డ్రోన్లు
### బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగం

**కీవ్ :** ఉక్రేన్‌పై రష్యా మరోసారి ఉద్ధృతస్థాయిలో డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. ఉక్రేన్ వైమానికదళానికి ప్రధాన కేంద్రంగా ఉన్న లుట్స్క్, ఇతర ప్రాంతాలపై 728 షాహద్, డెకోయ్ డ్రోన్లు, 13 బాలిస్టిక్ క్షిపణులతో బుధవారం తెల్లవారకముందుగానే భీకర దాడులు చేసింది. పోలెండ్, బెలారస్ సరిహద్దుల్లో ఉన్న ఉక్రేన్ వాయువ్యప్రాంత నగరం లుట్స్క్ సహా మరో పది ప్రాంతాలపై రష్యా ఈ దాడులు చేసిందని అధ్యక్షుడు జెలెన్స్కీ ప్రకటించారు. శాంతిని కోరుకునే ప్రతిఒక్కరూ రష్యా యుద్ధ చర్యలను ప్రతిఘటించాలని కోరారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత గడచిన మూడు సంవత్సరాలలో ఎన్నడూలేనివిధంగా నెలరోజులుగా ఉక్రేన్‌పై రష్యా క్రమ క్రమంగా దాడుల తీవ్రతను పెంచుకుంటూ వెళుతోంది. దీంతో అమెరికా సహా యూరప్ దేశాలు రష్యాపై విమర్శలు పెంచాయి. ఉక్రేన్ ఆత్మరక్షణ చేసుకునేవిధంగా కీలక ఆయుధాలు సరఫరా చేస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. రష్యా తీరుపట్ల తాను ఏ మాత్రం సంతోషంగా లేనని కూడా అన్నారు. ఆ మరునాడే రష్యా భీకరస్థాయిలో ఉక్రేన్‌పై విరుచుకుపడింది. ఉక్రేన్‌లోని వైమానిక,గగనతలదళానికి లుట్స్క్ ప్రాంతం వెన్నెముక లాంటి ప్రధానమైనస్థావరం. గగనతల డిపోలన్నీ ఇక్కడే ఉన్నాయి. ప్రధానమైన విదేశీ యుద్ధ సామాగ్రి సహాయాన్ని ఉక్రేన్ ఈ పశ్చిమ ప్రాంతానికే తరలిస్తుంది. ఇక్కడినుండే ఇతర ప్రాంతాలకు యుద్ధ సామాగ్రి రవాణా చేస్తారు. యుద్ధ సామాగ్రి రవాణా విమానాలు, ఫైటర్ జెట్స్‌ను ఇక్కడే ఉంచుతారు. లుట్స్క్‌లో ఈ విమానాలు సర్వసాధారణంగా చక్కెర్లు కొడుతూ ఉంటాయి. ఈ సప్లయ్ కారిడాన్‌ను రష్యా దెబ్బతీసింది. ఇటీవలికాలంలో ఉక్రేన్ కీలకస్థావరాలను రష్యా ధ్వంసం చేయడం ప్రారంభించింది. జులై నాలుగో తేదీన కూడా ఇదేవిధగా మూడేళ్ళలో ఎన్నడూలేనిరీతిలో రష్యా



దాడులు చేసింది. రష్యా–ఉక్రేన్ మధ్య ఉన్న 1000 కి.మీ సరిహద్దు ప్రాంతం అంతటా దాడులను రష్యా ఉద్ధృతం చేసింది.

**అమెరికా ఆయుధ సరఫరావల్ల శాంతి రాదు: రష్యా ప్రకటన**

ఉక్రేన్‌కు ఆయుధ సరఫరాను పునరుద్ధరించడంవల్ల యూరప్‌లో శాంతిస్థాపన జరగదని, ఇది యుద్ధ తీవ్రతను ఆపలేదని రష్యా హెచ్చరించింది. రష్యా విదేశాంగమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా బుధవారంనాడు మాస్కోలో పాత్రికేయులతో మాట్లాడుతూ, ఉక్రేన్ సమస్యను దౌత్యమార్గంలో పరిష్కరించడానికి ఆయుధ సరఫరాలు ఎంతమాత్రం దోహదపడవని విమర్శించారు. ఉక్రేన్‌కు ఆయుధ సరఫరాలను ఆపేస్తామని మొదట ప్రకటించిన అమెరికా ప్రభుత్వం ఆకస్మికంగా ఎందుకు తిరిగి ఆయుధాలు సరఫరా చేయాలని నిర్ణయం తీసుకుందని ఆమె ప్రశ్నించారు. 'ఈ విధమైన చర్యలవల్ల వచ్చే తదుపరి పరిణామాలు ఏమిటో, ఎలా ఉంటాయో ఇప్పటికీ ఇంకా విశ్లేషిస్తే మంచిది, అదేపనిగా ఉక్రేన్‌కు ఆయుధాలు అందజేస్తూ యుద్ధానికి ఆజ్యం పోస్తుంటే శాంతిస్థాపనకు ఎంతమాత్రం ప్రయోజనం ఉండదన్నారు. పేట్రియాట్ క్షిపణి వ్యవస్థలు, గైడెడ్ మల్టిపుల్ రాకెట్ లాంఛింగ్ వ్యవస్థలు, హెల్‌ఫైర్ క్షిపణులు, స్టింగర్ మ్యాన్ పోర్టబుల్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ వంటి వ్యవస్థలను ఉక్రేన్‌కు సరఫరా చేయకుండా ఆపేశామని న్యూయార్క్ టైమ్స్ పత్రిక ఈనెల రెండో తేదీన ప్రచురించిన వార్తను మరియా జఖరోవా గుర్తుచేశారు.

## ఒప్పందానికి చేరువలో ఉన్నాగానీ..
## ఇజ్రాయెల్–హమాస్ చర్చల్లో ప్రతిష్ఠంభన



**దోహా:** ఇజ్రాయెల్–హమాస్ మధ్య జరుగుతున్న పరోక్ష చర్చలు ఒక ఒప్పందానికి చేరువలో ఉన్నట్లు తెలుస్తోంది. ఐతే ఒకేఒక్క విషయం గురించి ఈ చర్చల్లో ప్రతిష్ఠంభన ఏర్పడింది. ఇజ్రాయెల్ తరపున చర్చల్లో పాల్గొనేందుకు మూడు రోజులక్రితమే ప్రధానమంత్రి నెతన్యాహూ ఒక బృందాన్ని దోహాకు పంపారు. ఖతార్, ఈజిప్టు దేశాలు ఈ చర్చలకు మధ్యవర్తులుగా ఉన్నాయి. ట్రంప్ చొరవతో ఈనెల ఆరో తేదీ నుండి దోహాలో ఈ చర్చలు కొనసాగుతున్నాయి. ఈ పరోక్ష చర్చల్లో రెండు వర్గాలమధ్య అన్ని ఒప్పందాలూ కుదిరాయనీ, కాకపోతే గాజాలో ఇజ్రాయెల్ సైన్యం ఉండిపోవడంపై ఒక పరిష్కారం రాలేదని స్కై న్యూస్ వార్తాసంస్థ బుధవారంనాడు తెలియజేసింది. ఈ డిమాండ్‌పైనే ప్రస్తుతం ప్రతిష్ఠంభన కొనసాగుతోందని పాలస్తినా వర్గాలను ఉటంకిస్తూ స్కైన్యూస్ తెలిపింది. అదేసమయంలో ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గిడియోన్ సార్ బుధవారం ఒకప్రకటన చేస్తూ, ఈ ఒప్పందం గనుక కుదిరితే హమాస్‌తో శాశ్వత కాల్పుల విరమణ ఒప్పందానికి సంప్రదింపులు చేస్తామన్నారు.

గాజాలో 60 రోజులపాటు కాల్పుల విరమణ పాటించేందుకు ఇప్పటికే పరోక్షంగా ట్రంప్ ద్వారా అటు ఇజ్రాయెల్, ఇటు హమాస్ కూడా అంగీకరించాయి. ఈ విషయంపై మధ్యవర్తుల ద్వారా మిగిలిన సమస్యల పరిష్కారానికి లాంఛనపూర్వక చర్చలు జరుగుతున్నాయి. ఒప్పందం కుదిరితే సజీవులైన 10 మంది ఇజ్రాయెలీ బందీలను విడతల వారీగా విడుదల చేస్తామని, మరో 18 మృత దేహాలను కూడా స్వాధీనం చేస్తామని హమాస్ ప్రతినిధిబృందాలు ఇప్పటికే మధ్యవర్తి దేశాలకు తెలియజేశాయి. అందుకు ప్రతిగా ఇజ్రాయెల్‌జైళ్ళలో అనేక సంవత్సరాలుగా మగ్గిపోతున్న పాలస్తీనియన్లను ఐడిఎఫ్ విడుదల చేయాలి.

**40 మంది పాలస్తీనియన్లు మృతి**

ఒకవైపు దోహాలో శాంతి చర్చలు జరుగుతుండగా మరోవైపు ఇజ్రాయెల్ బుధవారంనాడు 642వ రోజున గాజాలో గగనతల దాడులు కొనసాగించింది. ఈ దాడుల్లో 40 మంది పాలస్తీనియన్లు మరణించారు. ఖాన్ యూనిస్ నగరంలోని నస్సెర్ ఆసుపత్రి వర్గాల సమాచారం ప్రకారం మృతుల్లో 17 మంది మహిళలు, 10 మంది పిల్లలు ఉన్నారు. ఒకేఒక్కదాడి ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన 10 మది మరణించారు. వీరిలో ముగ్గురు పిల్లలు ఉన్నారు. మరోవైపు పాలస్తీనియన్లు ఆహారం, నీరు సంపాదించుకోవడానికి నానాకష్టాలు పడుతున్నారు. అమెరికా,ఇజ్రాయెల్ సారథ్యంలో నడుస్తున్న సహాయ కేంద్రాలవద్ద ప్రజలు పడిగాపులు పడుతున్నారు. మే నెల నుండి ఇప్పటి వరకూ ఈ సహాయ కేంద్రాలవద్ద వేచిఉన్న ప్రజలపై ఐడిఎఫ్ చేసిన కాల్పుల్లో ఇప్పటివరకూ 750 మంది మరణించారు.

చేశారు. అనేక చోట్ల మార్కెట్‌లు మూత పడ్డాయి. ముంబైలో నావికులు కూడా బ్యానర్‌లు ప్రదర్శించి నిరసన వ్యక్తంచేశారు. అనేక రాష్ట్రాల రాజధానుల్లో సమ్మెను పురస్కరించుకొని భారీ ప్రదర్శనలు నిర్వహించారు. సమ్మెకు వామపక్షాలు, వివిధ రాష్ట్రాలలోని ప్రతిపక్ష పార్టీలు మద్దతుగా నిలిచాయి. బిహార్ రాజధాని పట్నాలో జరిగిన సమ్మె సంఘీభావ ప్రదర్శనలో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబి తదితరులు హాజరయ్యారు. ఢిల్లీలో కార్మిక సంఘాలు జంతర్ మంతర్ వద్ద ప్రదర్శన నిర్వహించాయి. ఇందులో ట్రేడ్ యూనియన్‌ల జాతీయ నాయకులు ప్రసంగించారు. ఎఐటియుసి, ఎన్‌టియుసి, హెచ్ఎంఎస్, సిఐటియు, ఎఐయుటియుసి, టియుసిసి, సేవా, ఎఐసిసిటియు, ఎల్‌పిఎఫ్, యుటియుసిల ఇచ్చిన సమ్మె పిలుపు దేశవ్యాప్తంగా సక్సెస్ అయింది. విద్యుత్ రంగంలో 27 లక్షల మంది సమ్మెలో పాల్గొన్నట్లు భారత విద్యుత్ ఇంజనీర్ల సమాఖ్య ప్రకటించింది. ఎఐటిబిఎఎ, ఎఐబిఒఎ, బెఫి సమ్మెకు మద్దతు తెలపడంతో అన్ని రాష్ట్రాల్లో బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు. ''సమ్మె కారణంగా జాతీయ గ్రిడ్‌లో దేశ్యాప్తంగా రూ.20 లక్షల కోట్లకు సంబంధించి సుమారు నాలుగు కోట్ల చెక్కుల క్లియెరెన్స్ ఒక రోజు ఆలస్యమైందనట్లు తమకు సమాచారం ఉందని, అనేక బ్యాంకు శాఖల్లో

## సార్వత్రిక సమ్మె సక్సెస్
(మొదటి పేజీ తరువాయి)

సాధారణ సేవల్లో అంతరాయం కలిగిందని ఎఐబిఇఎ ప్రధాన కార్యదర్శి సి.హెచ్.వెంకటాచలయ్య తెలిపారు.

**పలు రాష్ట్రాల్లో బంద్ :** పుదుచ్చేరి, అస్సోం, బిహార్, జార్ఖండ్, తమిళనాడు, పంజాబ్, కేరళ, పశ్చిమ బెంగాల్, ఒడిషా, కర్నాటకల, గోవా, మేఘాలయ, మణిపూర్,త్రిపుర తదితర రాష్ట్రాలలో బంద్ వాతావరణం కనిపించింది. రాజస్తాన్, హర్యానా,తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఒకపూట బంద్ వాతావరణం నెలకొంది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, గుజరాత్ రాష్ట్రాలలోని పారిశ్రామిక వాడల్లో సమ్మెతో పారిశ్రామిక ఉత్పత్తులపై ప్రభావం పడింది. అస్సాం రాష్ట్ర రాజధాని గౌహతిలో యాప్ ఆధారిత ట్యాక్సీలు కూడా బంద్‌లో పాల్గొనడంతో రోడ్లపై వాహనాలు పెద్దగా కనపడలేదు. అలాగే మేఘాలయలో కూడా చక్కా జామ్ జరిగింది. హర్యానాలో హిస్సార్, బివానీ, కైతాల్, కురుక్షేత్రలో రహదారి రవాణా వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. న్యూఢిల్లీ, తిరువనంతపురం, కోల్‌కత్తా, హైదరాబాద్, విజయవాడ, తదితర చోట్ల వామపక్షాలు కూడా ప్రదర్శనల్లో పాల్గొన్నాయి. అదానీకి చెందిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు దాద్రీ, ఫరక్కాలో సమ్మెలో పాల్గొన్నారు. పశ్చిమబెంగాల్‌లో పలు చోట్ల సమ్మె చేస్తున్న కార్మికులు, వామపక్షాల కార్యకర్తలను తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఇరు పక్షాల మధ్య ఘర్షణలు జరిగాయి. పశ్చిమబెంగాల్‌లో దుర్గాపూర్, లాల్‌గోలా, బారక్‌పూర్ డైమండ్ హార్బర్ , కొన్నాగర్ హుగ్లీ,జాదవ్‌పూర్ రైల్వే స్టేషన్‌లో రైల్వే పట్టాలపై నిరసనకారులు బైఠాయించారు. పలు చోట్ల పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. కేరళలో కెఎస్ఆర్‌టిసి కార్మికులు సంపూర్ణంగా సమ్మెలో పాల్గొనడంతో బస్సులు నిలిచిపోయా యి. ఒడిషాలోని భువనేశ్వర్‌లో జాతీయ రహదారిపై కార్మిక సంఘాలు రాస్తారోకో చేశాయి. ఆర్‌జెడి విద్యార్థి విభాగం కార్యకర్తలు జెహనాబాద్‌లో రైల్వే ట్రాక్‌లకు అడ్డంగా నిల్చోవడంతో రైళ్ళకు అంతరాయం కలిగింది. పశ్చిమ బెంగాల్,కేరళలో అనేక చోట్ల రోజంతా షాపులు మూసివేశారు. చెన్నైలో అన్నా సలైలో భారీ ప్రదర్శన జరిగింది. బెంగళూరులో ఐటి ఉద్యోగులు సంఘం కెఐటియు ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన డార్జిలింగ్‌లో కార్మిక సంఘాలు ప్రదర్శన జరుపుతుండగా టిఎంసి కార్యకర్తలు అడ్డుకోవడంతో ఘర్షణ జరిగింది. అస్సోం తేయాకు కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. హిమాచల్‌ప్రదేశ్ రాజధాని సిమ్లాలో కార్మిక సంఘాలు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాయి. గోవాలోని ఆజాద్ మైదాన్‌ల అంగన్‌వాడీలు, ఇతర కార్మికులు భారీ సభను నిర్వహించారు. పాండిచ్చేరిలో సైతం సమ్మెజయప్రదమైంది. నాగాల్యాండ్, మెఘాలయలో కూడా పలు ప్రభుత్వ, ప్రైవేటు రంగ కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. పంజాబ్,రాజస్థాన్, హర్యానాలో కూడా పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి.

**ఢిల్లీలో జంతర్‌మంతర్‌లో సభ:** ఢిల్లీలోని పారిశ్రామక వాడల నుంచి ప్రదర్శన నిర్వహించి, కార్మికులు జంతర్ మంతర్‌కు చేరుకున్నారు. అక్కడ జరిగిన సభలో పది కార్మిక సంఘాల నాయకులు అమర్‌జీత్ కౌర్ (ఎఐటియుసి), అశోక్‌సింగ్ (ఐఎన్‌టియుసి), హర్భజన్ సింగ్ (హెచ్ఎంసిఎస్), తపన్‌సేన్(సిఐటియు), రాజీవ్ దిమ్రీ (ఎఐసిసిటియు), లతా బెన్ (సేవా), చౌరాసియా (ఎఐయుటియుసి), జవహర్ (ఎల్‌పిఎఫ్), ధర్మేంద్ర వర్మ (టియుసిసి), ఆర్.ఎస్.దాగర్ (యుటియుసి) తదితరులు ప్రసంగించారు. ఇంకా ఐసిఇయు, ఎంఇసి, ఎఐకెఎస్, వ్యవసాయ కార్మి సంఘాల నాయకులు కూడా మాట్లాడారు.

## ఫాంహౌస్‌కైనా వస్తా.. (మొదటి పేజీ తరువాయి)

తేరుకోకపోతే రైతుల హక్కులకు, తెలంగాణకు నష్టమని, అందుకే చర్చకు కెసిఆర్‌ను ఆహ్వానిస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. అసెంబ్లీ లేదా ఎర్రవెల్లి ఫామ్ హౌజ్ రెండింటిలో ఎక్కడైనా తాము చర్చ సిద్ధమన్నారు. ప్రభుత్వ పాలసీని కూడా అందరి ముందు పెడుతామని, అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ప్ర జాప్రతినిధుల సలహాలను, సూచనలను పరిగణలోకి తీసుకుంటామన్నారు.

కృష్ణా నది జల వివాదాలు, కాళేశ్వరం ప్రాజెక్ట్ సమస్యలపైన హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ ఛైర్మన్లకు బుధవారం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తదితరులు హాజరయ్యారు.

**తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం దేవుడినైనా ఎదురిస్తాం ...**

వ్యక్తుల కోసం తెలంగాణ రాష్ట్ర హక్కులను తాకట్టు పెట్టబోమని, పోరాటం చేస్తామని, అవసరమైతే దేవుడినైనా ఎదిరించి పోరాటం చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజల హక్కుల విషయంలో తాము శాశ్వితంగా చరిత్రలోనిలిచిపోయేలా తమ పోరాటం ఉంటుందన్నారు.తెలంగాణ నీటి హక్కుల అంశంలో తాము ప్రతి క్షణం పర్యవేక్షిస్తున్నామని, తెలంగాణ హక్కులను పరిరక్షించేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు.

**పరపతి ఉన్నదని పైకెళ్లి వస్తే ఎలా?**

కేంద్రం వద్ద పరపతి ఉన్నదని పైకెళ్లి వస్తే ఎలా అని సిఎం రేవంత్‌రెడ్డి సిఎం చంద్రబాబును ప్రశ్నించారు. న్యాయపరంగా పోరాటం చేసేందుకు సుప్రీం కోర్ట్ ఉన్నదని తమ ఫిర్యాదు వల్లనే బనకచర్ల ప్రాజెక్ట్ వెనక్కి పంపించామని గుర్తు చేశారు. నీటి వాటాలు, కేటాయింపులను ఎలా దక్కించుకోవాలనే విషయంలో తమ వ్యూహాలు తమకు ఉంటాయని, ఆ మాత్రం వ్యూహం లేకుండానే ఇంత దూరం, ఈ కుర్చీ వరకు వస్తామా అని రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలకు అన్యాయం జరుగుతుంటే, ఊరుకుంటామా? అని అన్నారు.

**చికాకు కలిగిస్తే బాగుండదు**

ప్రజాభవన్‌లో పవర పాయింట్ ప్రజంటేషన్ ఏమిటని ఒక మాజీ మంత్రి ఫోన్ చేశారని, ప్రజాభవన్ అంటే గడీ కాదని, ఇదొక ప్రజా సమస్యల పరిష్కారానికి ఉన్నదని, ఇక్కడ కొద్ది మందికి పరిమితం కాదని, ప్రజలు రావొచ్చని, ధర్మగంట కొట్టవచ్చని తెలిపారు. రాజుల కాలంలో కూడా ధర్మ గంట ఉండేదని, కానీ బిఆర్ఎస్ హయాంలో ఇందిరా పార్క్ ధర్నాచౌక్‌ను కూడా ఎత్తేశారని సిఎం గుర్తు చేశారు. తలాతోక లేకుండా మాట్లాడొద్దని, ఇప్పటికే తోక కత్తిరించామని, తనను చికాకు కలిగిస్తే బాగుండబోదని కెటిఆర్‌ను ఉద్దేశించి సిఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. పబ్బులు, క్లబ్బులకు తాము దూరమన్నారు. ఇప్పటికే తాము గంజాయి నియంత్రణకు చర్యలు తీసుకున్నామని, వాటిని అణచివేసేందుకు బలమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేశామని, మత్తు పదార్థాలు తెలంగాణ సరిహద్దులకు రాకుండా అణచివేస్తామని అన్నారు. కుటుంబ సమస్యలు ఉంటే, కులం, కుటంబ పెద్దలతో మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని, కానీ అన్నా చెల్లే, బావ బామర్ది, ఇలా వీది బాగోతాలు మంచివి కాదని ఎద్దేవా చేశా రు. పదేళ్లు అధికారంలో చెలాయించారని, ఇప్పుడు ప్రజల తీర్పును కూడా గౌరవించాలని సిఎం సూచించారు.

**తెలంగాణకు మరణ శాసనం రాసిన కెసిఆర్**

కెసిఆర్ నిర్ణయాల వల్లనే కృష్ణా పరివాహక రైతులకు మరణశాసనంగా మారాయని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రాజెక్టుల్లో తెలంగాణకు వాటా వస్తే తక్కువ ధరకు విద్యుత్ వచ్చేదని, శ్రీశైలం, సాగర్, పులిచింతలలో విద్యుదుత్పత్తిలో వాటా వస్తే తక్కువ ధరకు విద్యుత్ ఉత్పత్తి అయ్యేదని, బారానా, ఆఠానాకు దొరకాల్సిన విద్యుత్‌ను ప్రస్తుతం యూనిట్ రూ.10లకు కొనుగోలుచేసే పరిస్థితి వచేదికాదన్నారు. ఎపి మాజీ సిఎం జగన్‌కు కెసిఆర్ పలు సూచనలు చేయడంతో పాటు ఎపి ప్రాజెక్ట్‌కు సంబంధించిన టెండర్లు, జిఒలు జారీ చేసేలా సహకరించారని, వారి మధ్య అనుబంధం ఎలాంటిదైనా తెలంగాణ రాష్ట్రానికి మాత్రం తీరని నష్టమని రేవంత్ రెడ్డి విమర్శించారు.

ఉమ్మడి జలాల నుంచే హైదరాబాద్‌కు తాగు నీటి కోటా సాధించి, మిగిలిన జలాలను పరివాహక ప్రాంతాలకు పంపకాలు చేసి ఉంటే బాగుండేదని సిఎం అన్నారు. తుంగభద్ర, కృష్ణా, బీమా జలాలు తొలుత గద్వాలకు వస్తాయని, తెలంగాణలోకి కృష్ణా జలాలు ప్రవేశించిన వెంటనే ఒడిసి పట్టాల్సి ఉండేనని, ఈ నీటిని పాలమూరురంగారెడ్డి, నల్లగొండ ఇతర ప్రాంతాలకు తరలిస్తే, ప్రస్తుతం ఎపి ప్రాజెక్టులకు నీళ్లు తరలించే అవకాశం లేకుండా ఉండేదని సిఎం అభిప్రాయపడ్డారు. జూరా ల నుంచే నీళ్లు తెచ్చుకుంటే ఎపి నీళ్లు కొల్లగొట్టే అవకాశం ఉండేది కాదన్నారు. గతంలో పాలమూరురంగారెడ్డి సామర్థ్యాన్ని ఒక టిఎంసికి తగ్గించారని, ఎపి 10 టిఎంసిలతో ప్రాజెక్టులు చేపడితే పాలమూరును ఒక టిఎంసికి తగ్గించారని, ఏడాదికి కి.మీ టన్నెల్ పూర్తి చేసి ఉంటే ఎస్ఎల్‌బిసి పూర్తయ్యేదని వివరించారు. గతంలో రూ.వెయ్యి కోట్ల ప్రాజెక్టు అంచనా రూ.3 వేల కోట్లకు పెరిగిందని, 3.64 లక్షల ఎకరాలకు సాగునీరిచ్చే ఎస్ఎల్‌బిసిని పక్కనపెట్టారని, పాలమూరురంగారెడ్డి అంచనాలు పెంచినా పూర్తి చేయలేదని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనుమతులు పొందిన పెండింగ్ ప్రాజెక్ట్‌లలో కెసిఆర్ ఏ ఒక్కటి పూర్తి చేయలేదని మండిపడ్డారు.

**ఎకరానికి రూ.11 లక్షలు ఖర్చుపెట్టారు..**

తెలంగాణ హక్కులు, జలాలను ఎపికి తాకట్టు పెట్టారని, చేసిన తప్పులకు ప్రజలు శిక్షిస్తే మౌనంగా ఉండకుండా బజారున ఎక్కారని, పైగా తమపై ఎదురుదాడికి పాల్పడుతున్నారని సిఎం రేవంత్‌రెడ్డి మండి పడ్డారు. ఉమ్మడి ఎపిలో కాంగ్రెస్ 54 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చిందన్నారు. నాడు ప్రతి ఎకరాకు రూ. 93 వేలు ఖర్చు చేస్తే, కెసిఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి ఎకరాకు రూ.11 లక్షలు ఖర్చు చేశారని సిఎం తెలిపారు.

బేసిన్లు లేవని, భేషజాలు లేవని కెసిఆర్ గతంలో చెప్పారని, గోదావరిలో 3 వేల టిఎంసిలు సముద్రంలో కలుస్తున్నాయని చెప్పారని, గోదావరి, కృష్ణా, పెన్నా బేసిన్ వరకు నీళ్లు తరలించుకోవచ్చుని , రాయలసీమను రత్నాల సీమగా చేస్తామని కెసిఆర్ చెప్పిన విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. తెలంగాణ జాతిపిత అని పదే పదే చెప్పుకేనేందుకు ప్రయత్నించే కెసిఆర్ ,ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్ట్‌లో ఉన్న రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలను కాళేశ్వరం ప్రాజెక్ట్ నుంచి ఎందుకు తప్పించారోసమాధానం చెప్పాలని సిఎం డిమాండ్ చేశారు.

ఈ ప్రాజెక్ట్‌లో నల్లగొండకు కోతలు, రంగారెడ్డి జిల్లాను పూర్తిగా తొలగించారన్నారు. రాయలసీమ విషయంలో బేసిన్లు లేవని, బేషజాలు లేవని చెప్పిన కెసిఆర్, తెలంగాణ రాష్ట్రంలని రంగారెడ్డి జిల్లా విషయంలోమాత్రం బేసిన్ పరిధి అని ఎందుకు చెప్పారని అన్నారు.

తెలంగాణ ఉద్యమ సమయంలో మాక్‌అసెంబ్లీ నిర్వహించిన సందర్భంలో తమను సీనియర్‌జర్నలిస్టు కె.శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించేవారని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రానికి మద్దతుగా నిలబడాలని డిమాండ్ చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయని సిఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు.

## సమ్మెకు విశేష స్పందన (మొదటి పేజీ తరువాయి)

కాంట్రాక్టు కార్మికులు సైతం సమ్మెలో పాల్గొన్నారు. దీంతో ప్రభుత్వ పౌర సేవలకు విఘాతం కల్గింది. అంగన్ వాడీలు, అశా వర్కర్లు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న ఆయాలు ఇతర సిబ్బంది సమ్మెలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. సార్వత్రిక సమ్మెకు సంబంధించి అన్ని కార్మిక సంఘా లు గత నాలుగు నెలలుగా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించడంతో పాటు పలు దఫాలుగా సన్నాహక సమావేశాలను ఏర్పాటు చేసి కార్మికులను సమ్మెకు సన్నద్ధం చేశారు. ఈ సమ్మెలో బిజెపి అనుబంధ సంఘమైన బిఎంఎస్ తప్ప అన్ని కార్మిక సంఘాలతో పాటు వామపక్ష పార్టీలు సంపూర్ణంగా పాల్గొన్నడంతో రాష్ట్రంలో సార్వత్రిక సమ్మె పూర్తిగా విజయవంతమైంది.

**సుందరయ్య కేంద్రం నుంచి ఇందిరా పార్క్ వరకు భారీ ర్యాలీ :**

సమ్మెలో భాగంగా కేంద్ర కార్మిక సంఘాలైన ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, సిఐటియు, హెచ్ఎంఎస్, టియుసియు, ఐఎఫ్‌టియు, బిఆర్‌టియు, టిఎన్‌టియుసి, ఎఐయుసిటిసిల, ఎస్‌కెఎం, రిటైర్డ్ ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరా పార్క్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కేంద్ర కార్మిక సంఘాలతో పాటు వాటిని అన్ని అనుబంధ సంఘాలు, కిసాన్ సంయుక్త మోర్చ, వ్యవసాయ కార్మిక సంఘాలు, సిపిఐ, సిపిఐ(ఎం)తో పాటు వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ ర్యాలీలో ఎటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి.యూసుఫ్, ప్రధానకార్యదర్శి ఎస్.బాల్‌రాజు, ఉపప్రధానకార్యదర్శి ఎం.నరసింహా, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధానకార్యదర్శి పశ్యపద్మ, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కె.కాంతయ్య, సిపిఐ హైదరాబాద్ నగర సమితి సహాయ కార్యదర్శి కపతం యాదగిరి, సిఐయుటి నాయకులు సాయి బాబా, పాలడుగు భాస్కర్, టియుసియు నాయకురాలు ఎస్.ఎల్. పద్మ, బిఆర్‌టియు నాయకులు రాంబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నా రు.

**కార్మికలోకం ఎన్నికల వేళా రాజకీయ పరిణితి చూపితే అధికారం ఎర్ర జెండాలదే : కూనంనేని సాంబశివరావు**

ఈ ర్యాలీని ఉద్దేశించి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ యావత్తూ కార్మిక వర్గ వ్యతి రేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో 35 కోట్లమంది భాగస్వామ్యమై విజయవంతం చేశారని తెలిపారు. సమస్యలు వచ్చినప్పుడు కార్మికు లు రోడ్ల పైకి రావడమే కాదు..ఎన్నికలప్పుడు రాజకీయ పరిణితి చూపి రాజకీయ నిర్ణయం చేయాల్సిన సమయంలో మన పాత్ర ఎక్కడ ఉందని ఆలోచన చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. సరైన ఆలోచన చేస్తే గద్దే మీద ఎర్రజెండ పార్టీలు ఉంటాయని, బుర్జువా పార్టీలు ఇంటి బాట పడుతాయని సూచించారు. లేకపోతే దేశం మొత్తం ప్రైవేట్‌పరం అవుతుందని హెచ్చరించారు. ఇప్పటికే సగానికి పైగా ప్రైవేట్ రంగ సంస్థలకు అప్పజెప్పగా, ఉన్న వాటిలోను పైకి మాత్రమే ప్రభుత్వరంగ సంస్థలన్న బోర్డు కనిపిస్తుంది తప్ప వాటిలో పనిచేసేవారంతా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులే అధికమని తెలిపారు. మేడే స్ఫూర్తితో బ్రిటిషు కాలంలోనే పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానా న్ని ఇప్పుడు బిజెపి ప్రభుత్వం 10 గంటలకు పెంచింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రధానమంత్రి మోదీ బూట్లలో అడుగులు వేస్తూ 10 గంటల విధానాన్ని అమలు చేస్తూ జిఓ జారీ చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి, ఆర్‌టిసిని, కేంద్ర ప్రభుత్వం రైల్వే, బ్యాకింగ్, ఇన్సురెన్స్ తదితర ప్రభుత్వ రంగ సంస్థలే కాకుండా చివరికి రక్షణ రంగాన్ని సైతం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టి కేవలం పరిపాలన రంగాన్ని మాత్రం వారి చేతుల్లో పెట్టుకున్నరన్నా రు. అమెరికాలో ఇటీవల ట్రంప్‌ను గెలిపించిన ఎలాన్ మాస్క్ అనే వ్యక్తి.. ఇప్పుడు ట్రంప్ పరిపాలనకు పనికి రావు, ఇక తనే పరిపాలన చేస్తానన్ని ప్రకటించడాన్ని గుర్తు చేశారు.

**నల్లా చట్టాలతో శ్రమ దోపిడి : రంగారెడ్డి**

సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలను తీసుకువచ్చి కార్మికుల శ్రమదోపిడీకి పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న 8 గంట ల పని విధానాన్ని మార్చి ఇక 12 గంటలు పని చేయాలని బిజెపి ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని కార్మికుల తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. తక్షణమే దీనిని ఉపసంహారించుకోవాలని రంగారెడ్డి డిమాండ్ చేశారు.

**ఈ సమ్మె మోదీకి ఓ హెచ్చరిక : పశ్యపద్మ**

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ మాట్లాడుతూ కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలు అమలుచేస్తే సహించబోమంటే దేశవ్యాప్తంగా కోట్లాది మంది కార్మికులు, కర్షకులు, నిరుపేద ప్రజలు రోడ్లపైకి వచ్చి ప్రధాని మోదీ హెచ్చరికలు చేశారన్నారు. ఈ హెచ్చరికలను పట్టించుకోకపోతే వచ్చే ఎన్నికల్లో పాలకులకు తగిన గుణపాఠం తప్పదని పేర్కొన్నారు. తక్షణమే 4 లేబర్ కోడ్లను రద్దు చేయడం తో పాటు పంటలకు గ్యారంటీ చట్టం, రైతుల రుణమాఫీ చట్టంచేయాలని, విద్యుత్ సవరణ చట్టం వెనక్కి తీసుకోవాలని పశ్యపద్మ డిమాండ్ చేశారు.

**బిఎంఎస్ ఎవరీ పక్షమో స్పష్టం చేయాలి : ఎం. నరసింహా**

ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహా మాట్లాడుతూ కార్మికుల కోసమే తాము పనిచేస్తున్నామని చెప్పుకుంటున్న బిఎంఎస్ కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన సార్వత్రిక సమ్మెలో ఎందుకు భాగస్వామ్యం కాకుండ కేంద్ర ప్రభుత్వానికి ఎందుకు మద్దతు ఇచ్చిందో కార్మిక వర్గానికి చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కోడ్ల రూపంలో తీసుకువచ్చిన చట్టాలన్ని యాజమాన్య అనుకూలమైనవి వీటిని ప్రతి ఒక్కరూ పోరాటాలని ఆయన కోరారు.

**కార్మికోద్యమంలో ఈ సమ్మె ఓ మైలు రాయి : సాయిబాబా**

సిఐటియు నాయకులు సాయిబాబా మాట్లాడుతూ భారత కార్మికోద్యమంలో ఈ సార్వత్రిక సమ్మె మరో మైలురాయిగా నిలవబోతోందన్నారు. ఈ సమ్మె ద్వారా కార్మిక వర్గం కేవలం కేంద్ర ప్రభుత్వానినే ఢీకొనడం కాదని, కార్పొరేట్ సంస్థలు, బహుళ జాతి కంపెనీలు. ఫైనాన్స్ సంస్థలను ఢీకొట్టడమన్నారు. అంతర్జాతీయ కార్పొరేట్ శక్తులకు లొంగిపోయిన కేంద్ర ప్రభుత్వం భారత కార్మిక వర్గానిక ఆ వర్గాలకు బానిసలుగా మార్చాలని చూస్తుందోన్నారు. అయితే కార్మిక లోకం దానిని ఎదురించి నిలబడిందని, ఈ పోరాటం కేవలం ఆరంభం మాత్రమేనని భవిష్యత్‌లో తమ సత్తా చూపుతామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. టిఎస్.ఎల్. పద్మ, రాంబాబు యాదవ్, వెంకన్న, టి.సాగర్ తదితరులు మాటాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్లను ఉపసంహారించుకునేంత వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



జనరల్
STATE & REGIONAL NEWS

## వరల్డ్ ఎక్స్‌పో–2025లో ఆకర్షణగా భారత్ రైల్వే

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జపాన్‌లోని ఒసాకాలో జరుగుతున్న వరల్డ్ ఎక్స్‌పో 2025లో వందే భారత్, చీనాబ్ వంతెనలు ప్రముఖ ఆకర్షణగా నిలిచాయి. వందే భారత్ అద్భుతమైన ప్రయాణానికి జపనీస్ సందర్శకుల నుండి ప్రశంసలు అందుతున్నాయి. ఒసాకా తీరప్రాంతంలోని ఒక కృత్రిమ ద్వీపమైన యుమేషిమాలో జరిగిన వరల్డ్ ఎక్స్‌పో–2025 ఏప్రిల్ 13న ప్రారంభమైంది ఇది అక్టోబర్ 13 వరకు కొనసాగుతుంది, ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది సందర్శకులు వస్తున్నారు. ఉత్సాహభరితమైన అంతర్జాతీయ ప్రదర్శనల మధ్య ఇండియన్ పెవిలియన్, ముఖ్యంగా భారతీయ రైల్వేలకు అంకితమైన విభాగం, ప్రశంసల కేంద్ర బిందువుగా మారింది. ప్రదర్శనలో, జమ్మూ, కాశ్మీర్‌లోని చీనాబ్ నదిపై ఎగురుతున్న ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే వంతెన చీనాబ్ వంతెన, ఐకానిక్ అంజి ఖాద్ వంతెన, సవాలుతో కూడిన హిమాలయ భూభాగంలో భారతదేశపు మొట్టమొదటి కేబుల్ స్టేట్ రైలు వంతెన, భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌లలో మరిన్ని తాజా పురోగతులు స్థిరమైన చలనశీలతకు భారత రైల్వే ఘనతను చాటుతున్నాయి.




## నేడు మఖ్దూంభవన్ పునర్ నిర్మాణ భవన ప్రారంభోత్సవం

### ప్రారంభించనున్న సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి

### ముఖ్య అతిథిగా జాతీయ కార్యదర్శి డి.రాజా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన పునర్ నిర్మాణ భవన ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం ఉదయం 11 గంటలకు జరగనుంది. సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డి భవనాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హాజరు కానున్నారు .

# యాభైయేళ్ళ మఖ్దూంభవన్‌కు నూతన శోభ

## నేడు నవీకరించిన భవన ప్రారంభం

బొమ్మగాని కిరణ్‌కుమార్

నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, నేటి తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌ను నిర్మించి యాభై ఏళ్ళు కావొస్తుంది. సాంకేతికంగా వచ్చే ఏడాది ఆగస్టు నాటికి స్వర్ణోత్సవం. అయితే, తొలుత ఆరు నెలలలోగా మూడంతస్తుల భవనాన్ని పూర్తి చేయాలని భావించినప్పటికీ, ఆ ప్రణాళికను విస్తరించి ఐదంతస్తుల భవనాన్ని శంకుస్థాపన చేసిన రెండేళ్ళకు(1976లో) ప్రారంభించారు. దీంతో రెండేళ్ళ నిర్మాణ పనులను కలుపుకుంటే మఖ్దూంభవన్ నిర్మించి అర్థ శతాబ్దం గడిచినట్లుగా భావించవచ్చు. కష్టజీవులు, కార్మికుల చెమట చుక్కలతో నిర్మితమైన మఖ్దూంభవన్ భవిష్యత్తులో అనేక దశాబ్దాల పాటు ఉద్యమ కేంద్రంగా భాసిల్లేందుకు నూతన జవసత్వాలు సంతరించుకున్నది. గత ఏడాది కాలంగా చేపట్టిన నవీకరణ పనులు పూర్తయ్యి, గురువారం నాడు ప్రారంభానికి సిద్ధమైంది. ఈ చారిత్రక సందర్భంగా మఖ్దూం భవన్ నిర్మాణ ఘట్టాన్ని ఒకసారి గుర్తు చేసుకుందాం.

### చిరకాల వాంఛ

ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకు ముందు హైదరాబాద్ రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ హైదరాబాద్ కేంద్రంగా, ఆంధ్ర రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ విజయవాడ కేంద్రంగా పనిచేసేవి. 1956లో ఉభయ తెలుగు రాష్ట్రాలు విలీనమై ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత సిపిఐ రాష్ట్ర కార్యాలయం హైదరాబాద్‌లో అద్దె భవనాలలో కొనసాగేది. పార్టీ విస్తృతి, ప్రజానీకంపై ప్రభావం పెరగడంతో, ప్రజోద్యమాలకు దన్నుగా స్వంత రాష్ట్ర కార్యాలయం అవసరమని 1970ల్లో నాయకత్వం నిర్ణయానికి వచ్చింది. వెన్వెంటనే హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో మఖ్దూంభవన్‌కు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ సంస్థానంలో ట్రేడ్ యూనియన్‌ల నిర్మాత, ప్రముఖ కవి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చి త్రిమూర్తులలో ఒకరైన కీర్తి శేషులు కామ్రేడ్ మఖ్దూం మొహియొద్దీన్ పేరును రాష్ట్ర పార్టీ కార్యాలయానికి పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. సుప్రసిద్ధ కమ్యూనిస్టు యోధుడు, తెలంగాణ సాయుధ పోరాట సేనాని రావి నారాయణరెడ్డి చేతుల మీదుగా ఈ భవనానికి 1974 ఫిబ్రవరి 17వ తేదీన శంకుస్థాపన చేయబడింది. ఆ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ "ఈ భవనానికి మఖ్దూం పేరు పెట్టడం సముచితంగా ఉన్నదని, పూర్వపు హైదరాబాద్ రాష్ట్రంలో ట్రేడ్ యూనియన్‌లు ఏర్పాటు చేసిన మొట్టమొదటి వ్యక్తి ఆయనేనని" కొనియాడారు. నాటి కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు నీలం రాజశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగిన శంకుస్థాపన సభలో సుమారు 300ల మంది పార్టీ ముఖ్యులు, మద్దతుదారులు హాజరయ్యారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న తమ్మారెడ్డి సత్యనారాయణ సభకు స్వాగతం పలుకుతూ చిరకాల వాంఛ ఈనాటికి నిర్దిష్ట రూపం తీసుకుంటున్నదని, ఈ సంవత్సరం ఆఖరుకే భవన నిర్మాణం పూర్తవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

### దన్నుగా నిలిచిన కార్మికులు, సామాన్యులు

శంకుస్థాపన సభకు అధ్యక్షత వహించిన నీలం రాజశేఖరరెడ్డి ప్రసంగిస్తూ "చిత్రమైన విషయమేమిటంటే కమ్యూనిస్టు పార్టీకి బ్యాంకు బ్యాలెన్సు ఎప్పుడూ లేదు. అయితే తన కార్యక్రమాల నిర్వాహణకు అది ప్రజల నుంచి ఎప్పుడవసరం ఉందంటే అప్పుడు డబ్బులు సేకరించగలదని, అలా సేకరించగలగడానికి ప్రధాన కారణం పార్టీ ప్రజల మధ్య ఒకరుగా మెలగడం, వారి సంక్షేమం కోసం పోరాడడమే " అని పేర్కొన్నారు. ఆయన అన్నట్లుగానే శంకుస్థాపన చేసిన కార్యక్రమంలోనే భూరి విరాళాల హామీలు వెల్లువెత్తాయి. అప్పటికప్పుడు విరాళాలుగా సానుభూతిపరులు, ప్రజలు, ప్రజాసంఘాలు రూ.57 వేలు ప్రకటించగా, సింగరేణి బొగ్గు గని కార్మికులు రూ.2 లక్షల వాగ్దానం చేసి అగ్రభాగాన నిలిచారు. అదీ ప్రజల్లో కమ్యూనిస్టు పార్టీపై ఉన్న అంచంచల ప్రేమాభిమానాలకు నిదర్శనం. అదే బాటలో ఇతర కార్మిక సంఘాలూ నడిచాయి. జిల్లాల్లో పార్టీ ఒక్క రూపాయి కూపన్లు ద్వారా విరాళాలను సేకరించారు. ఒకవైపు ఆర్థిక సాయం అందిస్తూనే, మరోవైపు శ్రమదానానికీ పోటీ పడ్డారు. యలమంచిలి చంద్రశేఖరరావు (చంద్రం) నిర్మాణ బాధ్యత నిర్వహించారు. విద్యార్థి, యువజన, కార్మిక సంఘాలు, ఒక్కో రోజు చొప్పున వంతులవారీగా మఖ్దూంభవన్ నిర్మాణంలో ఉత్సాహంగా ఇటుకలు, కంకర మోసి తామూ భాగస్వాములైనందుకు సంతోషించారు.





### ఐదంతస్తుల అరుణశోభిత భవనం


రెండేళ్ళలో ఐదంతస్తుల అరుణశోభిత మఖ్దూంభవన్ సిద్ధమైంది. మొదటి అంతస్తులో పార్టీ రాష్ట్ర కార్యాలయం, రెండు, మూడు అంతస్తులలో గదులు, నాలుగవ అంతస్తులో సుమారు 300 మందికి సరిపడ సమావేశ మందిరం పూర్తయింది. అప్పట్లోనే లిఫ్ట్ ఏర్పాటైంది. బహుశా ఆరోజుల్లో హైదరాబాద్ నగరంలో లిఫ్ట్ కలిగిన అతి కొద్ది భవనాలలో మఖ్దూంభవన్ ఒకటి. 1976 ఆగస్టు 4వ తేదీన మఖ్దూంభవన్‌ను నాటి భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు ప్రారంభించారు. మఖ్దూం భవన్ ప్రారంభం రోజునే రాష్ట్ర పార్టీ సిపిఐ జాతీయ సమితి సమావేశాలకు ఆతిథ్యం ఇచ్చింది.

గడిచిన ఐదు దశాబ్దాలలో మఖ్దూంభవన్ అనేక చారిత్రాత్మక పోరాటాల రూపకల్పనకు, రాజకీయ ఘట్టాలకు కేంద్రంగా నిలిచింది. బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమానికి దన్నుగా నిలిచింది. నిరసన ఉద్యమాల కార్యస్థానం ధర్నా చౌక్‌లో ధర్నాలపై విధించిన నిషేధ వ్యతిరేక పోరాటాలకు వేదికైంది. పాత భవనాన్ని నవీకరించుకొని, భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలకు కేంద్రంగా నిలిచేందుకు మఖ్దూం భవన్ కొత్తరూపం సంతరించుకుంది.

*'హయాత్ లే కే చలో,*
*కాయనాత్ లే కే చలో,*
*చలో తో సారే జమానే*
*కో సాథ్ లే కే చలో'*
*"జీవితాన్ని తీసుకువెళ్ళు,*
*విశ్వాన్ని తీసుకువెళ్ళు,*
*ముందుకు వెళ్ళు, ప్రపంచాన్ని*
*వెంటబెట్టుకుని ముందుకు వెళ్ళు')*
*అనే మఖ్దూం కవిత స్ఫూర్తితో...*

### మఖ్దూంభవన్‌కు శంకుస్థాపన చేసిన 17-2-1974 నాటి వార్త


ప్రదేశ్ కమ్యూనిస్టు కార్యాలయం 'మఖ్దూంభవన్'కు శంకుస్థాపన
అక్కడికక్కడే రు. 57 వేల విరాళాల ప్రకటన: రు. 2 లక్షలు ఇచ్చేందుకు బొగ్గుగని కార్మికుల వాగ్దానం
విరాళాల వివరాలు



1976 ఆగస్టు 4న మఖ్దూంభవన్ ప్రారంభిస్తున్న నాటి సిపిఐ ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు, అనంతరం సభలో ప్రసంగిస్తున్న తమ్మారెడ్డి సత్యనారాయణ. వేదికపై సిపిఐ నాయకులు రావి నారాయణరెడ్డి, శ్రీపాద అమృత్ డాంగే, ఎస్.కె.కృష్ణన్, ఎం.ఎస్.గోవిందన్ నాయర్, ఎస్.కుమారన్



## ఎరువుల కేటాయింపులో కేంద్రం వివక్ష

### రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రానికి ఎరువుల కేటాయింపుల్లో కేంద్రం వివక్ష చూపుతోందని తెలంగాణ వ్యవసాయ రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఏ పంటలు పడుతున్నాయో, ఏ రకమైన ఎరువులు కావాలో కేంద్రానికి తెలియదా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ఈ సమయంలో ఇబ్బందిపెట్టడం సరికాదని హితవు పలికారు. హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో కమిషన్ సభ్యులు కెవిఎన్ రెడ్డి, గడుగు గంగాధర్, భవనీరెడ్డిలతో కలిసి చైర్మన్ కోదండరెడ్డి మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా, ఎరువుల పరిశ్రమలు.. కేంద్రం చేతుల్లో ఉంటాయని గుర్తుచేశారు. ఆయా రాష్ట్రాల అవసరాలకు అనుగుణం గా కేటాయించిన ఎరువులను సకాలంలో పంపించాలన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఎరువుల కోసం ఢిల్లీకి వెళ్లారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వడమే కాదు, దానికి తగ్గట్టుగా ఆర్థిక సాయం చేసి ప్రోత్సహించాలన్నారు. ఇక పంటల్లో జన్యు మార్పిడి అనేది ప్రపంచానికే ప్రమాదమని హెచ్చరించారు. గత 10 ఏళ్ల కాలంలో విత్తనోత్పత్తి చేసే రైతులు అనేక ఇబ్బందులకు గురికాగా, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న వెంటనే రైతు కమిషన్ ఏర్పాటు చేయడం ద్వారా రైతుల సమస్యల పరిష్కారానికి బాటలు వేసిందన్నారు. విత్తనోత్పత్తికి రైతులను మల్టీనేషనల్ కంపెనీలు మోసంచేస్తే నష్టపోయిన 671మంది రైతులకు నష్టపరిహారం కింద ఈ నెల 7న ములుగు జిల్లా వాజేడు మండలం నాగారం గ్రామంలో రూ.4 కోట్ల చెక్కుల పంపిణీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలో మళ్లీ ఆదర్శరైతు వ్యవస్థను తీసుకురానున్నామని, ప్రతి గ్రామానికి ఒక ఆదర్శరైతు ఉండేలా ప్లాన్ చేస్తున్నామని కోదండరెడ్డి వెల్లడించారు. రైతు కమిషన్ సభ్యులు కెవిఎన్ రెడ్డి మాట్లాడుతూ రైతులు యూరియా వాడకం తగ్గించుకుంటే మంచిదన్నా రు. మరో సభ్యురాలు భవానీరెడ్డి మాట్లాడుతూ ములుగు జిల్లాలో నష్టపరిహా రం ఇప్పించడంలో రైతు కమిషన్ కృషి ఎంతగానో ఉందన్నారు. దేశ చరిత్ర లోనే ఇది మొదటిసారి అని చెప్పుకొచ్చారు.

## ఘనంగా ఎఎంవిఐల పాసింగ్ ఔట్‌పరేడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాలుష్య నివారణ కోసం హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్, సిఎన్‌జి, ఎల్‌పిజి వాహనాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాజ్ బహదూర్ వెంకటరామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీ లో శిక్షణ పొందిన 96మంది ఎఎంవిఐల పాసింగ్ ఔట్ పెరేడ్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యా రు. ఈ సందర్భంగా ఎఎంవిఐ ల నుండి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. దేశంలో రవాణా శాఖలో నియామకం అవుతున్న వారందరికీ మీరు రోల్ మోడల్ గా ఉండాలని అన్నారు. జిల్లా అధికారుల తో సమన్వయం చేసుకుని మంచి పేరు తెచ్చుకుంటూ పని చేయాలని సూచించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి రవాణా శాఖ లో పలు కీలక పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఇప్పటికే 113 ఎఎంవిఐ పోస్టులు, 54 రవాణా కానిస్టేబుల్ పోస్టులు,10 జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ప్రక్రియ పూర్తయిందన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. ట్రాఫిక్ ఉల్లంఘన చేస్తున్న వారిపై ఎన్ ఫోర్స్‌మెంట్ చేస్తూ కఠినంగా వ్యవహరించాలని అన్నారు. రవాణా శాఖ లో అనేక సంస్కరణలు తీసుకొచ్చి ప్రజల కు సౌకర్యాలు కల్పిస్తున్నామని, ఎఐ తీసుకొచ్చి వెహికిల్ ఫిట్‌నెస్ చేస్తున్నామని, మీరు రవాణా శాఖ డిపార్ట్‌మెంట్‌లోకి రావడం వల్ల శాఖ మరింత పటిష్టం అయిందని అన్నారు. దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలలో గాయపడితే క్యాష్ లెస్ ట్రీట్‌మెంట్ తీసుకురావడం మంచి పరిణామమన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేలా చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. నాలుగు నెలల శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఎఎంవిఐలకు అవార్డులను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రధానం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్తి, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, జెటిసిలు, రవాణా శాఖ అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రానున్న జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. బిఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ మైనార్టీ సమావేశం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కెసి ఆర్ ఉన్నప్పుడు మైనార్టీలు సంతోషంగా ఉన్నారని, వారికి షాదీ ముబారక్, కెసిఆర్ కిట్, మైనార్టీ విద్యా సంస్థలు, అందరికీ ఇంగ్లీష్ మీడియం విద్య అందించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోనికి వస్తే మైనార్టీ సబ్ ప్లాన్ తీసుకొస్తా మన్న హామీని విస్మరించిందని ఆరోపించారు. సెక్యులర్ ప్రభుత్వం అని చెప్పుకునే రేవంత్ రెడ్డి ప్రభుత్వం 20నెలలు గడుస్తున్నప్పటికీ ఒక్క మైనార్టీ నాయకునికి కూడా మంత్రిగా అవకాశం ఇవ్వలేకపోయిందని ఆరోపించారు. మాజీ మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ కెసిఆర్ పాలనలో మైనార్టీలకు గురుకులాల్లో మంచి విద్య లభించిందన్నారు. ఎంఎల్‌ఎ తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడు తూ మైనార్టీలకు కెసిఆర్ చేసినంత మేలు ఎవ్వరు చేయలేదన్నారు.



**పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం**
మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా.

Lr.No.F1/PMC/78/2025-26, ఆసక్తి వ్యక్తీకరణ నోటీసు తేది: 09.07.2025

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 26 వార్డుల నుండి **చికెన్, మటన్ మరియు చేపల వ్యర్థాలను సేకరించడానికి** ఆసక్తిగల ఏజెన్సీలు / వ్యక్తుల నుండి సీల్డ్ కొటేషన్లను ఆహ్వానించడమైనవి. అమలులో ఉన్న నిబంధనల ప్రకారం **రూ.5.00 లక్షలకు** తక్కువ కాకుండా ప్రాథమిక ధరతో వ్యర్థాలను శాస్త్రీయంగా పారవేయడం కోసం కొటేషన్లు, కమిషనర్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పేరు మీద **రూ.10,000.00** తిరిగి ఇవ్వబడనివి మొత్తం డిమాండ్ డ్రాఫ్ట్‌తో పాటు కొటేషన్లను సమర్పించండి. **గమనిక:** ఆసక్తిగల ఏజెన్సీలు/వ్యక్తులు ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ నుండి అధికార పత్రం / అవగాహన ఒప్పందంతో పాటు కొటేషన్లను సమర్పించాలి. **కొటేషన్ల దాఖలుకు ప్రారంభ తేది:** 09.07.2025న ఉ.11.00గం.లకు, **కొటేషన్ల దాఖలుకు ఆఖరి తేది:** 18.07.2025న మ.03.00గం.ల వరకు, **కొటేషన్ల ప్రారంభం:** 18.07.2025న సా.04.00గం.లకు, మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన నెం. 7331164038 & 7331164056 లేదా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, పీర్జాదిగూడ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా.

సం/- కమిషనర్,
పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

DIPR R.O. No. : 4764-PP/CL/ADVT/1/2025-26, Date: 09-07-2025

## ప్రభుత్వ బడి విద్యార్థులకు 'మోదీ కిట్స్'

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** ప్రజలకు నిరంతరం అండగా ఉంటూ సమాజానికి సేవ చేయాల నే తనను ఎప్పటికప్పుడు స్ఫూర్తి నింపిన నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ అని, వారి బాటలో నడుస్తూ చేతనైన సాయం చేస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో టెన్త్ చదివే విద్యార్థులకు మోదీ కానుకగా 20వేల సైకిళ్లను స్వయం గా కొనుగోలు చేసిన బండి సంజ య్ వాటిని దశలవారీగా పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తొలుత కరీంనగర్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకిళ్లు పంపిణీ మోదీ గిఫ్ట్ అని, అతి త్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు మోదీ కిట్స్ ను అందజేస్తామని స్పష్టం చేశారు.

సైకిళ్ల పంపిణీ ఆలోచన ఇచ్చిందే జిల్లా కలెక్టర్ అని తెలిపారు. కార్పొరేట్ కంపెనీల యజమానుల సొమ్ముతో సిఎస్సార్ ఫండ్ కింద ఇచ్చిన నిధులతో సైకిళ్లను కొనుగోలు చేసి పంపిణీ చేస్తున్నానని పేర్కొన్నారు. కష్టాలు తెలిసిన వ్యక్తిని కాబట్టే విధ్యార్థుల ఇబ్బందులను తెలుసుకుని సైకిళ్లను పంపిణీ చేస్తున్నానని తెలిపారు.



## ఎరువుల కొరత అధిగమించేందుకు ప్రణాళికలు సిద్ధం

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎరువుల కొరతను అధిగమించేందుకు జిల్లాల వారీగా పంట సాగు, ఎరువుల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలకు సిద్ధం చేసుకుని ఉన్న యూరియా నిల్వలను వినియోగించుకునేందుకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అదేవిధంగా కేంద్రం కేటాయించిన ఎరువులు సకాలంలో వచ్చేలా నిరంతరం కేంద్ర అధికారులతో సంప్రదింపులు జరపాలని సూచించారు. యూరియా కొరత పేరుతో ఏ డీలరైనా అధిక ధరలకు అమ్మి నా, ఇతర ఉత్పత్తులకు లింకు పెట్టినా కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జెపి నడ్డాను కలిసి రాష్ట్రానికి నెలవారీగా కేటాయించిన యూరియాను, ప్రణాళిక ప్రకారం ఇవ్వాల్సిందిగా కోరిన నేపథ్యంలో కేంద్రం నుంచి ఎరువులు సరఫరాలు జరుగుతాయని ఆశిస్తున్నామని, ఇందుకు అనుగుణంగా జిల్లాల వారీగా ప్రణాళిక సిద్ధం చేసుకుకోవాలని తెలిపా రు. దిగుమతి యూరియా కొరత ఉన్ననేపథ్యంలో రాష్ట్రంలో ఉన్న రామగుండం ఎరువుల కంపెనీ నుంచి కేటాయించిన 30 వేల మెట్రిక్ టన్నులను 60వేల టన్నులకు పెంచాల్సిందిగా విజ్ఞప్తి చేశామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం రైతుల అవసరాల మేరకు నిల్వలున్నాయని, రైతులు అవసరమున్న లేకపోయిన యూరియాను కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో కొంత ఇబ్బందులు తలెత్తుతున్నాయని, అంతకు ముందు జిల్లాలవారీగా యూరియా లభ్యత, రోజువారీ కొనుగోళ్ల వివరాలను అధికారులు మంత్రికి వివరించారు.

**శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానము**
వెలిమినేడు గ్రామం, చిట్యాల మండలము, నల్లగొండ జిల్లా.

లేఖ నెం.యస్.యస్.టి/2025, టెండర్ - కం - బహిరంగ వేలముల ప్రకటన తేది: 09.07.2025

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! సదరు దేవస్థానమునకు సంబంధించిన బహిరంగ వేలము ది:15.07.2025 మంగళవారము రోజున ఉ.11.00 గం.లకు దేవాలయ ప్రాంగణం నందు దేవాదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించబడును.

| క్ర.సం. | వేలము వివరము | డిపాజిట్ డి.డి / నగదు | కాలపరిమితి |
|---|---|---|---|
| 1. | కొబ్బరికాయలు, పూజాసామాగ్రి, లడ్డూ, పులిహోర ప్రసాదములు & కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కు | 2,00,000/- | 16.07.2025 నుండి 15.07.2026 వరకు (1 సం॥) |

కావున పైన తెలిపిన టెండర్ - కం - బహిరంగ వేలం నిర్వహించుటకు ఒక గంట ముందు ఆసక్తిగలవారు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనగలరని కోరనైనది. ఇతర వివరములకు మొబైల్ నెంబర్ **9703662667** సంప్రదించగలరు.

ఇట్లు, సిరికొండ నవీన్
కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 4777-PP/CL/ADVT/1/2025-26, Date: 09-07-2025

ప్రజాపక్షం
గురువారం, 10 జులై

# మోదీ ప్రభుత్వానికి హెచ్చరిక

జులై 9, 2025 దేశంలో శ్రమజీవుల ఐక్య పోరాటాల్లో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు. నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎన్‌డిఎ ముసుగులోని బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక, కార్పొరేట్ శక్తులకు దాసోహ విధానాలకు వ్యతిరేకంగా 30 నుంచి 40 కోట్ల మంది పారిశ్రామిక కార్మికులు, కర్షకులు, వివిధ జీవన రంగాలకు చెందిన శ్రమజీవులు ''నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయ్–మా హక్కులు మాకివ్వు; కనీస వేతనాలు అమలు చెయ్; వ్యవసాయోత్పత్తుల గిట్టుబాటు ధరకు లీగల్‌గా గ్యారంటీ ఇవ్వు...'' అని మోదీ ప్రభుత్వాన్ని నడిబజారులో నిలదీశారు. 2020 నవంబర్ 26న సార్వత్రిక సమ్మెలో సుమారు 25 కోట్ల మంది పాల్గొన్నట్లు అంచనా. కార్మికవర్గం త్యాగభరితమైన ఎన్నో పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు దోచిపెట్టేందుకై వడపోసి 4 కోడ్‌లుగా చట్టాలు తెచ్చిన ఈ కార్మిక, ప్రజా వ్యతిరేక ప్రభుత్వం గత ఐదారు సంవత్సరాల్లో ఎన్నిసార్లు కార్మికులు దేశవ్యాప్త ఆందోళనలు చేసినా, సమ్మెలు చేసినా తన మూర్ఖపు పట్టుదల వదలటం లేదు. వాటిని నోటిఫై చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఒత్తిడి పెడుతోంది, బుజ్జగిస్తున్నది, బెదిరిస్తున్నది. ఆ కోడ్‌లకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం చేస్తున్న 10 కేంద్ర ట్రేడ్ యూనియన్‌లు, బ్యాంకింగ్, బీమా, డిఫెన్స్ (సివిల్), తపాలా వంటి స్వతంత్ర యూనియన్‌లతో ఏదో మొక్కుబడి చర్చలు మినహా శ్రమజీవుల సాధక బాధకాలను లోతుగా, సానుభూతితో చర్చించిన పాపాన పోలేదు. ప్రభుత్వంలో, ప్రభుత్వం రంగ సంస్థల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, అనేక పథకాల అమలుకు స్కీం వర్కర్ల పద్ధతులు అమలు చేస్తూ సమాన పనికి సమాన వేతన చట్టాన్ని స్వయానా ఉల్లంఘిస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నది. ఉద్యోగుల పెన్షన్‌తో జూదమాడుతున్నది. సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు తిలోదకాలిస్తున్నది.

ఇదేవిధంగా, దేశానికి అన్నం పెట్టే రైతులను మోదీ ప్రభుత్వం మోసగించింది. దేశంలో అతిపెద్ద ఉపాధి కల్పన రంగమైన వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తుల అజమాయిషీలోకి తెచ్చేందుకు తెచ్చిన మూడు రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలను దేశ రైతాంగం ముక్త కంఠంతో వ్యతిరేకించారు. రెండేళ్లకుపైగా చరిత్రాత్మక ప్రతిఘటన పోరాటం చేశారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా రైతుల ఓట్ల కోసం మోదీ 2023లో దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పి ఆ చట్టాలు ఉపసంహరించుకున్నారు. ఏరు దాటినాక బోడి మల్లయ్య అన్నట్లు, వ్యవసాయోత్పత్తుల ఎంఎస్‌పికి లీగల్ గ్యారెంటీ హామీని తుంగలో తొక్కాడు. దానికోసం రైతుల పోరాటం సాగుతోంది. బుధవారం సార్వత్రిక సమ్మెలో రైతులు కూడా పాల్గొని ఈ పోరాటానికి విస్తృతి కల్పించారు. వారితో పాటు వ్యవసాయ కార్మిక సంఘాలు పాల్గొన్నాయి. సమ్మెలో పాల్గొనలేని రైల్వే, రవాణా, ప్రభుత్వ ఉద్యోగుల వంటివారు ప్రదర్శనల్లో పాల్గొని సంఘీభావం ప్రకటించారు . సమ్మెలో పాల్గొనని బిజెపి యూనియన్ బిఎంఎస్‌కు చెందిన కార్మికులు తాము సమ్మెలో పాల్గొనలేకపోయినా వ్యతిరేకించటం లేదని ప్రకటించారు. ప్రభుత్వ రికార్డు ప్రకారం 16 వేలకు పైగా వర్కర్స్ యూనియన్లుండగా, 213 యూనియన్‌లు తాము సమ్మెలో పాల్గొనడం లేదని కార్మిక మంత్రిత్వ శాఖకు చెప్పారని ప్రభుత్వం, దాని అనుకూల మీడియా టముకులు మోగించుకుంటున్నది. అవి ఎన్ని? సముద్రంలో కాకిరెట్ట!

10 కేంద్ర ట్రేడ్ యూనియన్లు 2025 మార్చి 18న ఢిల్లీలో జరిగిన సదస్సులో 17 కోర్కెలపై మే 20న సార్వత్రిక సమ్మె జరపాలని పిలుపు ఇచ్చాయి. అయితే 'ఆపరేషన్ సిందూర్' కారణంగా సమ్మెను జూలై 9కి వాయిదా వేశాయి. మార్చి నుంచి కార్మిక సంఘాలు వివిధ రూపాల్లో తమ కోర్కెలకు విస్తృత ప్రచారం ఇచ్చాయి. ప్రతిపక్ష రాజకీయ పార్టీలన్నీ బలపరిచాయి. సమ్మె ప్రభావం ఆర్థిక వ్యవస్థ ప్రధాన రంగాలపై కనిపించింది. బ్యాంకింగ్, బీమా రంగాలు స్తంభించిపోగా, రవాణా, విద్యుత్ రంగాలకు అంతరాయం ఏర్పడింది. తపాలా, బొగ్గు గనుల రంగాలు కూడా ప్రభావానికి గురైనాయి. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం వంటి స్కీం వర్కర్స్, నరేగా శ్రామికులు కూడా సమ్మెలో పాల్గొన్నారు. నగరాలు, పట్టణాల్లో కార్మిక ప్రదర్శనలు హోరెత్తాయి.

బిజెపి మిత్రపక్షాల పాలనలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో కూడా సమ్మె విజయవంతంగా జరిగింది. మరో మిత్రపక్షం జెడియుతో కలిసి పాలన సాగిస్తున్న బిహార్‌లో ఎన్నికల సంఘం 'ముమ్మర ఓటర్ల రివిజన్'కు వ్యతిరేకంగా ఎన్‌డిఎ పార్టీలు ఈరోజు బంద్ పాటించాయి. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. రాష్ట్రమంతటా ప్రజాజీవనం స్తంభించింది.

అన్ని రంగాల కార్మికులు, శ్రామికులు పాల్గొనడం, ప్రతిపక్షాలన్నీ బలపరచడం మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై విస్తృతంగా ఉన్న అసంతృప్తిని తెలియజేస్తున్నది. ప్రభుత్వం ఇప్పటికైనా మొండితనం విడనాడి ట్రేడ్ యూనియన్లతో, స్వతంత్ర ఫెడరేషన్లతో, అసోసియేషన్‌లతో చర్చలు జరపాలి. పారిశ్రామిక రంగంలో సామరస్యం ఎంతైనా అవసరం. రైతాంగం కోర్కెలపై మాట నిలబెట్టుకోవాలి. 2015 నుంచీ ఈ ప్రభుత్వం సమావేశపరచని ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ త్రైపాక్షిక సమావేశాన్ని పిలవాలి. ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమరజీత్ కౌర్ హెచ్చరించినట్లుగా ఈ సమ్మె భవిష్యత్తులో మరింత తీవ్రమైన పోరాటాలకు నిస్సందేహంగా నాంది అవుతుంది.

# సమానత్వంపై బ్యాంక్ నివేదిక మోసపూరితం

**గ్యాన్ పాఠక్**

జులై 5, 2025 నాడు భారత ప్రభుత్వం ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో వెబ్‌సైట్‌పై ''అసమానతను తగ్గించడంలో భారత్ గాథ''ను ప్రచురించింది. అందులో మూడు అంశాలున్నాయి–భారత్ 25.5 గినీ స్కోరుతో ఆదాయ సమానత్వంలో ప్రపంచంలో నాలుగవ స్థానంలో ఉంది; 2.దుర్భర దారిద్ర్యం 2022–23లో 2.3 శాతానికి తగ్గినట్లు ప్రపంచ బ్యాంక్ చెబుతోంది; 3. 2011–23 మధ్య 17.1 కోట్ల భారతీయులు దుర్భర దారిద్ర్యం నుంచి బయటపడ్డారు.

తమ ప్రభుత్వ సాఫల్యాలపై గొప్పలు చెప్పుకునేందుకై నిర్వచనాలు మార్చి, అంకెలు తారుమారు చేసి తప్పుడు సమాచారం సృష్టించడంలో ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని భారత ప్రభుత్వం దిట్ట అనే అనుమానాలు ఎప్పుడూ ఉన్నాయి. తమ పనితీరుకు విశ్వసనీయత చేకూర్చేందుకు ఇతర సంస్థలను ఉట్టంకించడానికి నరేంద్రమోదీ ఆయన అధికారులు ఎంతో ఇష్టపడతారు. భారత్ ప్రపంచ బ్యాంకు డేటాను ఉట్టంకించడం తాజా ఉదాహరణ. ప్రపంచ బ్యాంకు తమ ''దారిద్ర్యం, అసమానత'' ప్లాట్ ఫాంపై ''ప్రభుత్వ గణాంక ఏజెన్సీల నుంచి పొందిన ప్రాథమిక గృహ సర్వేపై మా డేటా ఆధారపడింది'' అని పేర్కొన్నది. భారత ప్రభుత్వం, దాని సంస్థల తప్పుడు సమాచారాన్ని ప్రపంచ బ్యాంక్ కాపీ చేసి, పేస్ట్ చేసి, ఫార్వర్డ్ చేసినట్లయితే దాని అంచనా తప్పు అవుతుంది. దారిద్ర్యం, అసమానత, ఉపాధి భారతదేశాన్ని ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, వాటికి అంతర్ సంబంధం ఉంది. వీటిపై భారత ప్రభుత్వ సమాచారాన్ని ఇప్పుడు చూద్దాం. ఈ అంశాలకు రాజకీయ ప్రాధాన్యత ఉండటంతో అవి ఎన్నికల్లో లేవనెత్తబడుతుంటాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో మోదీ, ఇతర అధికారులు ఈ తప్పుడు గొప్పలే చెప్పుకున్నారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు కేంద్ర కార్మిక శాఖ కార్యదర్శి, కార్మిక మంత్రి, ప్రధానమంత్రి చెప్పుకున్నారు. ప్రభుత్వానికి సొంత డేటా లేనందున రిజర్వ్‌బ్యాంక్ కెఎల్‌ఇఎంఎస్ డేటా ఉట్టంకించారు. 2020–21, 2021–22 సంవత్సరాలు కోవిడ్–19తో ఆర్థిక వ్యవస్థ మూలన పడిన సంవత్సరాలు. ఆ రెండు సంవత్సరాల్లో ఉపాధి కల్పనపై రిజర్వు బ్యాంకు ఇచ్చిన సమాచారమే అదెంత తప్పుల తడకో తెలియజేస్తున్నది. ఉపాధిలో 2020–21లో 31.2 శాతం పెరుగుదల, 2021–22లో 11.9 శాతం పెరుగుదల ఉన్నట్లు ఆర్‌బిఐ తెలిపింది. జిడిపి వృద్ధి(–) 5.8గా తిరోగమనంలో ఉన్న 2020–21లో ఉపాధి పెరగటం ఎంతో ఆశ్చర్యకరం.

> *ఆ విధంగా వచ్చిన సగటు నెలసరి తలసరి వ్యయం అంచనా గ్రామీణ జనాభాలో కింది 5శాతం మందికి నెలకు రూ.1373, ఉన్నత స్థాయి 5 శాతం మందికి రూ.10,501. పట్టణ ప్రాంతాల్లో ఆ సంఖ్యలు వరుసగా రూ.2001; రూ.20,824. గణాంకాలను తారుమారు చేసినాక కూడా అసమానత స్పష్టం. ఉచిత ఆహారం విలువను, లాప్‌టాప్, పిసిలు, మొబైల్ ఫోన్లు, సైకిళ్లు , చెప్పులు, ఆర్థిక సహాయం వంటి ఆహారయేతర ఐటమ్‌లను కూడా డేటాలో చేర్చాక వచ్చిన పరిస్థితి అది.*

ఉపాధి ప్రజలకు ఆదాయం ఇస్తుంది. అది బదులుగా దారిద్ర్యం, అసమానత తగ్గిస్తుంది. ఉపాధి కల్పనపై తప్పుడు సమాచారం దారిద్ర్యం అసమానతతో తగ్గుదలపై తప్పుడు సమాచారం ఇస్తాయి. ప్రభుత్వం ఉపాధి కల్పన డేటాలో 19 శాతం వేతనం చెల్లింపు లేని వ్యక్తులున్నారు. ఎవరు వీరు. ఇంట్లో పనులకు ఏదో కొంత సహాయపడే వారు!



ఇప్పుడు ప్రపంచ బ్యాంకు గినీ స్కోరు (25.5) తీసుకుందాం. తమ సమాచారం ప్రభుత్వం ఇచ్చిన డేటాపై ఆధారపడిందని బ్యాంకు చెప్పినందున ప్రభుత్వ డేటాలో తప్పులు బ్యాంక్ అంచనాను తప్పు చేస్తాయి. గినీ స్కోరు ఆధారంగా అసమానత లెక్కిస్తారు. భారత ప్రభుత్వం కొద్ది కాలం క్రితమే 'నిలకడైన అభివృద్ధి గమ్యం జాతీయ సూచిక చట్రం ప్రగతి నివేదిక, 2005'ను విడుదల చేసింది. 2024లోక్‌సభ ఎన్నికల తరుణంలో నీతి ఆయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ బివిఆర్ సుబ్రహ్మణ్యం దేశంలో దారిద్ర్యం 5 శాతం దిగువకు తగ్గిందని చెప్పారు. కాగా దుర్భర దారిద్ర్యం 2022–23లో 2.3 శాతానికి తగ్గినట్లు ప్రపంచ బ్యాంకును ఉట్టంకించిన ప్రభుత్వ ప్రకటన చెబుతున్నది. 2011–12లో దారిద్ర్యరేఖకు నిర్ధారించిన తలసరి వినిమయం రోజుకు రూ.32/–. దాన్ని ఆ రోజుల్లో మెజారిటీ ప్రజలు తిరస్కరించారు. తలసరి వినిమయానికి సంబంధించి భారత ప్రభుత్వ 2022–23 డేటాను గుణకార పద్ధతిలో హెచ్చించి నీతి ఆయోగ్ ఆ నిర్ధారణకు వచ్చింది. అపసవ్యమైన ఆ డేటాను భారతదేశానికి గిర్నీ స్కోర్ నిమిత్తం ప్రపంచం బ్యాంకు తీసుకుంది. తలసరి వినిమయ వ్యయం లెక్కింపునకు 2022–23 పద్ధతి మార్పు చేయబడింది. 2022–23 తలసరి వినిమయ వ్యయ సర్వే ఫలితాలను పోల్చి చూసేటప్పుడు ఈ మార్పులను పరిగణలోకి తీసుకోవాలని ఆ సర్వే హెచ్చరించింది కూడా. అయితే ఈ హెచ్చరికను ప్రపంచ బ్యాంకు ఏమాత్రం పాటించినట్లు లేదు.

తలసరి వినిమయ వ్యయ సర్వే 2022–23, పరిగణనలోకి తీసుకున్న వస్తువులను 2011–12లోని 307 నుంచి 405కు పెంచింది: పాత జాబితా నుంచి అనేక వస్తువులను తొలగించింది. సర్వే ఒక ప్రశ్నపత్రం బదులు మూడు ప్రవేశపెట్టింది . ఆహార వస్తువులపై, వినిమయ పదార్థాలు, సేవా ఐటమ్స్‌పై, మన్నిక గల వస్తువులపై వేర్వేరు ప్రశ్నాపత్రాలు ఉపయోగించింది. కుటుంబ ప్రత్యేకతలు, కుటుంబ సభ్యుల వయో వివరాలపై సమష్టి సమాచారం కోసం మరో ప్రశ్నపత్రం కూడా ఉంది. ఆ విధంగా డేటా సేకరించడం డేటా ఫలితాలను గుణాత్మకంగా మార్పు చేసింది. వినిమయం, దారిద్ర్యంపై మెరుగైన దృశ్యం చూపేందుకు అది ప్రభుత్వానికి ఉపకరించింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులు క్షీణించినప్పటికీ అది దేశ గిర్నీ స్కోరుని మార్చింది. ఆ విధంగా వచ్చిన సగటు నెలసరి తలసరి వ్యయం అంచనా గ్రామీణ జనాభాలో కింది 5శాతం మందికి నెలకు రూ.1373, ఉన్నత స్థాయి 5 శాతం మందికి రూ.10,501. పట్టణ ప్రాంతాల్లో ఆ సంఖ్యలు వరుసగా రూ.2001; రూ.20,824. గణాంకాలను తారుమారు చేసినాక కూడా అసమానత స్పష్టం. ఉచిత ఆహారం విలువను, లాప్‌టాప్, పిసిలు, మొబైల్ ఫోన్లు, సైకిళ్లు , చెప్పులు, ఆర్థిక సహాయం వంటి ఆహారయేతర ఐటమ్‌లను కూడా డేటాలో చేర్చాక వచ్చిన పరిస్థితి అది. వస్తువు లేదా నగదు రూపంలో పేదలకిచ్చే సహాయం దారిద్ర్యాన్ని ఒకింత భరింపశక్యం చేస్తుంది గాని నిర్మూలించదని మనం అర్థం చేసుకోవాలి. అందువల్ల సహాయం విలువను దారిద్ర్య నిర్మూలనపై డేటా సృష్టించడానికి జత చేయడం తప్పు. ఒక మనిషి తన అస్తిత్వానికి సరిపడా సంపాదించడం మొదలుపెట్టినప్పుడే దారిద్ర్యం నిర్మూలన అవుతుంది. ప్రభుత్వ సహాయం, ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన ఈ సందర్భంగా ప్రస్తావనార్హం.

ఆహార భద్రత చట్టం కింద అంచనా ప్రకారం 2012 –2013లో పేద ప్రజలు సుమారు 81 కోట్లు. పిఎంజికెవై ఉచిత ఆహార ధాన్యాలు ఇవ్వడం 2020–21లో ప్రారంభించింది. అది ఈరోజుకూ కొనసాగుతున్నది. 2029 వరకు కొనసాగుతుంది. పిఎంజికెవై కింద పేదల సంఖ్య ఎందుకు తగ్గటం లేదు. పైనివేదికలోని మూడవ అంశం 2011–2023 మధ్య 17.1 కోట్ల మంది భారతీయులు దుర్భర దారిద్ర్యం నుంచి బయటకు వచ్చారు. అదే నిజమైతే పిఎంజికెవై కింద పేదలు ఎందుకు తగ్గలేదు. జనాభా లెక్కల సేకరణలో జాప్యాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లయితే, జాతీయ ఆహార భద్రత చట్టం కింద మరో 14 కోట్ల మంది ఉచిత ఆహార ధాన్యాలకు అర్హులవుతారు. ఆహార ధాన్యాల ఉచిత సరఫరా వల్ల పేదలు దారిద్ర్యం నుంచి బయటకు వచ్చారనే మోదీ ప్రభుత్వ, ప్రపంచ బ్యాంకు ఊహా గణాంకాల తారుమారు మాత్రమే. అందువల్ల మోదీ ప్రభుత్వ ప్రస్తుత కథనం తప్పు. భారతదేశం సృష్టించిన తారుమారు డేటా ఆధారంగా ప్రపంచ బ్యాంకు తయారుచేసిన గినీ స్కోరు వాస్తవానికి మోసపూరితమైనది.

> *వస్తువు లేదా నగదు రూపంలో పేదలకిచ్చే సహాయం దారిద్ర్యాన్ని ఒకింత భరింపశక్యం చేస్తుంది గాని నిర్మూలించదని మనం అర్థం చేసుకోవాలి. అందువల్ల సహాయం విలువను దారిద్ర్య నిర్మూలనపై డేటా సృష్టించడానికి జత చేయడం తప్పు. ఒక మనిషి తన అస్తిత్వానికి సరిపడా సంపాదించడం మొదలు–పెట్టినప్పుడే దారిద్ర్యం నిర్మూలన అవుతుంది. ప్రభుత్వ సహాయం, ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన ఈ సందర్భంగా ప్రస్తావ–నార్హం.*

– (ఐపిఎ సర్వీస్)

## సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు
# ఆరోగ్య భద్రత ఇవ్వండి

లేఖ

పవిత్ర గోదావరి నది పరివాహక ప్రాంతంలో ఉద్భవించినది సింగరేణి బొగ్గు గనుల సిరుల తల్లి. గోదావరి తెలంగాణకు సాగు త్రాగునీరు, పరిశ్రమలకు ఇతరత్రా ఉపయోగపడుతున్న విధముగా సింగరేణి కూడా రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతున్నది. ప్రతి సంవత్సరం నిర్ణయించిన విధంగా టన్నుల కొద్దీ బొగ్గును ఉత్పత్తి చేసి గణనీయమైన లాభాలు గడిస్తున్నది. కానీ బొగ్గును ఉత్పత్తి చేసి లాభాలు గడించుటకు సర్వశక్తులు ధార పోసిన రిటైర్డ్ ఉద్యోగుల పట్ల సింగరేణి తల్లి కనికరం చూపడం లేదు. ఫలితంగా సరియైన వైద్య సౌకర్యాలు అందక అచేతన స్థితిలో బతుకుతున్నారు. దాదాపు పది సంవత్సరాల క్రితం కోల్ ఇండియా నిర్దేశించిన ఎనిమిది లక్షల బీమా పథకం ఈనాటికి కూడా కొనసాగిస్తున్నా దినదినం పెరుగుతున్న వైద్య ఖర్చులకు సరిపోవడం లేదు. సింగరేణి సంస్థ రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్నది కోల్ ఇండియాతో సంబంధం లేకుండా మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని వివిధ వేదికల పైన సింగరేణి యాజమాన్యానికి విజ్ఞప్తి చేయడం జరిగినది ఆరోగ్య బిక్షపెట్టమని ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇతర మంత్రులకు అదేవిధంగా గత ముఖ్యమంత్రి చంద్రశేఖర రావుకు కూడా పలుమార్లు విజ్ఞప్తి చేసినా సమస్యను పరిష్కరించలేదు. రాష్ట్ర గనులు, కార్మిక, ఫ్యాక్టరీలు ఉపాధి కల్పన శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించుటకు తప్పకుండా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినారు. మా ఈ బాధలను దృష్టిలో ఉంచుకొని సింగరేణి యాజమాన్యం సత్వరమే మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పిస్తుందని ఆశతో ఎదురుచూస్తుంటాం!

– దండంరాజు రాంచందర్ రావు
సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు,
కాప్రా, హైదరాబాద్, 9849592958

# ఎక్స్‌టార్షన్‌కు ఇక జైలే గతి!

## 'సివిల్' అంటూ గతంలో తప్పించుకున్న పోలీసులు

'సార్ మా భూమిని గూండాలు కబ్జా చేశారు. నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మేం పేదోళ్లం. మాకు న్యాయం చేయండి' అంటూ గతంలో ఎవరైనా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే.. 'ఇది సివిల్ కేసు. కోర్టుకు వెళ్లి తేల్చుకోండి. ఇందులో మేమేం చేయలేం' అంటూ పోలీసులు తప్పించుకునేవాళ్లు. కొందరు తమను బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బుల కోసం బెదిరిస్తున్నారని కంప్లయింట్ ఇస్తే.. 'మమ్మల్నేం చేయమంటారు' అని జవాబిచ్చేవారు. రౌడీల బెదిరింపులపై సమాచారమిచ్చినా లైట్ తీసుకునేవారు. కానీ ఆదిలాబాద్ ఎస్పీగా అఖిల్ మహాజన్ వచ్చాక పరిస్థితి మారింది. ఆయన ఆదేశాలతో పోలీసులు యాక్టివ్ అయ్యారు. సివిల్ కేసులు అని తప్పించుకోకుండా సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు. అన్నీ పరిశీలించి.. అక్రమార్కులపై కేసులు నమోదు చేసి కటకటాల వెనక్కి పంపుతున్నారు. దీంతో సామాన్య ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.




### 'రియల్'.. గుభేల్!

మొన్నటి వరకు కబ్జాల పర్వం కొనసాగించిన 'రియల్' అక్రమార్కుల ఇష్టారాజ్యానికి అఖిల్ మహాజన్ వచ్చాక బ్రేక్ పడింది. ప్రభుత్వ, ప్రైవేటు భూముల కబ్జా చేస్తున్న, అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తున్న కొంత మందిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపడంతో రియల్ ఎస్టేట్‌లో అక్రమాలు చేసి కోట్లు సంపాదించిన వారి గుండెలు ఇప్పుడు గుభేల్ మంటున్నాయి. 2010లో ఖానాపూర్ శివారులో అటవీ భూమిని ప్లాట్లుగా చేసి విక్రయించిన కేసులో బీజేపీకి చెందిన ఓ కీలక నేతపై ఇటీవల పోలీసులు కేసు నమోదు చేసి కటకటాల వెనక్కి పంపారు. అంతేకాకుండా 'రియల్' మోసం కేసులో ఓ బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతను సైతం అరెస్ట్ చేశారు. మున్సిపాలిటీ ల్యాండ్‌ను ఫేక్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసి అమ్మేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై సైతం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రభుత్వ స్థలాలు ఇప్పిస్తానని, ప్లాట్లు అమ్ముతానని చెబుతూ మోసం చేస్తున్న నిర్మల్ జిల్లా ఖానాపూర్ కోర్టులో విధులు నిర్వహిస్తున్న ఓవ్యక్తిపై సైతం కేసు నమోదు చేశారు. అంతేకాకుండా ఓ దుకాణాన్ని అద్దెకు తీసుకొని.. మున్సిపాలిటీ నుంచి నంబర్ తీసుకొని రిజిస్ట్రేషన్ చేసుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారిని సైతం జైలు ఊచలు లెక్కబెట్టేలా చేశారు. దీంతో ఇన్నాళ్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించిన రియల్ ఎస్టేట్ అక్రమార్కులు ఇప్పుడు సైలెంట్ అయ్యారు.

### 'ఎక్స్‌టార్షన్' చేస్తే అంతే సంగతులు..

వివిధ కారణాలు చూపెట్టి, బెదిరింపులకు గురి చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్న వ్యక్తులపైనా ఎస్పీ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఫిర్యాదులు రాగానే.. అన్ని పరిశీలించి నిజమని తేలితే వెంటనే ఎక్స్‌టార్షన్ చేసిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఓ స్కూల్ యాజమాన్యాన్ని బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన కొందరు యువకులపై కేసులు నమోదు చేశారు. అంతేకాకుండా తమను డబ్బుల కోసం బెదిరిస్తున్నారని వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఇప్పటి వరకు ఏడెనిమిది మంది విలేకరులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. పలువురిని రిమాండ్‌కు తరలించారు. పశువుల వాహనాలను ఆపి చంపుతానని బెదిరిస్తూ డబ్బులు వసూలు చేసిన ఆదిలాబాద్ పట్టణానికి చెందిన వ్యక్తిని అరెస్ట్ చేశారు. వడ్డీల పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్న వారిని సైతం గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు.

### రౌడీయిజంపై ఉక్కుపాదం

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు అఖిల్ మహాజన్ ప్రత్యేక దృష్టి సారించారు. ఇందుకోసం ముందుగా రౌడీయిజంపై ఉక్కుపాదం మోపారు. ఇందులో భాగంగా సోషల్ మీడియాపై స్పెషల్ నజర్ పెట్టారు. కత్తులు, కటార్లు, తల్వార్లతో రీల్స్ చేస్తూ ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తున్న వారిని గుర్తించి కటకటాల వెనక్కి పంపారు. అంతేకాకుండా జిల్లా కేంద్రంలో రౌడీషీటర్లతో రౌడీ మేళా సమావేశం నిర్వహించి వార్నింగ్ ఇచ్చారు. జనాలను బెదిరించడం, డబ్బులు వసూలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఎక్స్‌ట్రాలు చేస్తే ఊరుకునేది లేదని, ప్రవర్తన మార్చుకోకపోతే పీడీ యాక్టులు సైతం నమోదు చేస్తామని వార్నింగ్ ఇచ్చారు.

### వివిధ కేసులు సైతం..

ఎస్పీ నేతృత్వంలో జిల్లా పోలీసులు అనేక కేసులను ఛేదించారు. ఇచ్చోడ మండలంలో జరిగిన ఫేక్ సర్టిఫికెట్ స్కామ్‌ను సైతం వెలుగులోకి తీసుకొచ్చారు. పదివేలకు ఓ బాలికను విక్రయించిన కేసును సైతం ఛేదించారు. రేషన్ బియ్యాన్ని 25 కిలోల బ్యాగుల్లో ప్యాక్ చేసి ప్రైవేట్ దుకాణాల్లో విక్రయిస్తుండగా, దాడి చేసి పట్టుకున్నారు. వాహనాలకు మోడిఫైడ్ సైలెన్సర్లు బిగించి శబ్ద కాలుష్యం చేస్తుండగా.. అలాంటి సైలెన్సర్లను తొలగించి వాటిని నాశనం చేశారు. అంతర్రాష్ట్ర ఆటోల దొంగల ముఠాను సైతం అదుపులోకి తీసుకున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ఎస్పీ అన్ని అంశాలపైనా దృష్టి పెడుతున్నారు. సైబర్ క్రైమ్స్‌ను నియంత్రించేలా అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి సోమవారం ఎస్పీ ఆఫీసులో ప్రజాఫిర్యాదుల విభాగం నిర్వహించి వందలాది మంది నుంచి కంప్లయింట్స్ స్వీకరిస్తున్నారు. వాటికి పరిష్కారం చూపేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, ప్రతి చిన్నారి పాఠశాలకు వెళ్లేలా కృషి చేస్తున్నారు. మత్తు వల్ల జరిగే దుష్పరిణామాలపై అవగాహన కలిగేలా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 5కే రన్ సైతం నిర్వహించారు. వర్షాకాలంలో ఆదిలాబాద్ జిల్లాలో వరదలు వస్తే ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందు జాగ్రత్తగా 20 మందితో డిస్ట్రిక్ట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసి వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. యువతులు, మహిళలు, చిన్నారుల భద్రత కోసం 'అభయ మై ట్యాక్సీ ఇన్ సేఫ్' అనే కార్యక్రమాన్ని చేపట్టి.. డ్రైవర్ల వివరాలు ఈజీగా తెలిసేలా మూడువేలకు పైగా ఆటోలను ఇందులో రిజిస్ట్రేషన్ చేయించారు. గిరిజన, మారుమూల గ్రామాల్లో 'పోలీసులు మీ కోసం' పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

– ఫిరోజ్‌ఖాన్
9640466464


# లంబాడీల ప్రకృతి పండుగ సీత్లా

లంబాడీ గిరిజనులు ఎంతో పవిత్రతో జరుపుకునే పండుగే సీత్లా భవాని వేడుక. గిరిజన సంప్రదాయంలో లంబాడీలు జరుపుకునే తొలి పండుగ కూడా ఇదే. ప్రకృతిని ఆరాధిస్తూ.. కొలుస్తూ పంటలను, పశు సంపదను, తమకు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని వేడుకుంటూ నిర్వహిస్తుంటారు. ఈ పండుగకు బోనాల వేడుకలకు సామీప్యత ఉండటం గమనార్హం. కలరా వంటి మహమ్మారులు ప్రబలకుండా కాపాడుతుందని బంజారాల నమ్మకం. తండాలో ఉన్న పశువులు, గొర్లు, మేకలు, కోళ్లు, పశుసంపద పెరగాలని, దూళ్ళకు పాలు సరిపోను ఉండాలని గడ్డి బాగా దొరకాలని క్రూర మృగాల బారిన పడకుండా ఉండాలని అటవీ సంపద తరగకూడదని, సీత్ల తల్లికి మొక్కులు తీర్చుకుంటారు. సీత్ల భవాని పండుగ ప్రపంచం మొత్తంలో నివసిస్తున్న లంబాడీలు వారి సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగ. ఇలాంటి పండుగ తెలుగు పండుగల్లో ఎక్కడ చూసినా కనిపించదు. ఇది బంజారా ఔన్నత్యాన్ని చాటి చెబుతుంది. పంట పొలాలు సాగుచేసే క్రమంలో తొలిసారిగా వారి పండుగ ఆరంభమవుతాయి. హిందూ పండుగల్లో ఉగాది తొలి పండుగ ఎలా ఉందో అలాగే సీత్ల భవాని పండుగ బంజారాలకు తొలి పండుగ. ఈ పండుగను



వివిధ తండాల్లో ఆ తండా ప్రజలు పెద్ద మనుషులంతా కలిసి ఆషాఢమాసంలో ఒక మంగళవారం ఎంచుకొని సీత్ల పండుగను జరుపుతారు. ఇలా ప్రతి సంవత్సరం కేవలం మంగళవారం రోజు మాత్రమే జరపడం ఈ పండుగ ప్రత్యేకత, ఆనవాయితీ. లంబాడీల పండుగలో మొదటిది, ప్రధానమైనది దాటుడు, సీత్ల పండుగ. తండాల సరిహద్దుల్లోని పొలిమేర, కూడలి వద్ద సీత్ల భవానిని ప్రతిష్టిస్తారు. పురుషులంతా దప్పు వాయిద్యాలు వాయిస్తూ కోళ్లు మేకలతో, మహిళలు, యువతులు బోనాలు ఎత్తుకుని నృత్యాలు చేసుకుంటూ అమ్మవారిని ప్రతిష్టించిన ప్రదేశానికి వెళ్తారు.. ఈ క్రమంలో అందరు కలిసి పాటలు పాడుతారు. సీత్ల భవాని దగ్గరకు వెళ్లి ప్రత్యేక పూజలు చేస్తారు. అమ్మవారికి నైవేద్యంగా గుగ్గిళ్లు, లాప్సి పాయసం సమర్పిస్తారు. కోళ్లు మేకలను బలి ఇచ్చి వాటిని పైనుంచి పశువులను దాటిస్తారు. అలా చేయడం వల్ల పిల్లాజెల్లా ఆరోగ్యంగా ఉండాలని, పాడి పంటలు బాగా పండుతాయని బంజారా నమ్మకం. దేవతను పూజించే క్రమంలో పెద్ద మనిషిని పూజారిగా ఉంచి అతని చేతుల మీదగా కార్యక్రమం నిర్వహించడం బంజారాల ఆచారం. ఎక్కువ పశు సంపద వృద్ధి చెందాలనీ, తండా ప్రజలందరినీ దేవత సల్లగా ఉండేలా దీవించాలనీ, పశువులకు ఎటువంటి రోగాలు రాకూడదనీ, ఎలాంటి దుష్ట శక్తులు రాకుండా ఉండాలనీ తండావాసులు వారి పశువులను ఒకేచోట చేర్చి అందరూ కలిసి భవాని దేవతను పూజిస్తారు. పశు సంపద కోసం, పశువుల ఆరోగ్యం కోసం తండా సౌభాగ్యం కోసం సీత్ల భవాని పూజ చేయడం ఆనవాయితీ. కలరా వంటి మహమ్మారులు ప్రబలకుండా కాపాడుతుందని బంజారాల నమ్మకం.

– నరేష్ జాటోత్,
నల్గొండ, 8247887267



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## టెక్సాస్ విలయంలో ఇంకా జాడ తెలియని 161 మంది

111కు పెరిగిన మృతులసంఖ్య

**ఆస్టిన్ :** గడచిన గురువారం టెక్సాస్ కెర్ కౌంటీలో భారీవర్షాలు, చరిత్రాత్మక వరద విలయంలో కౌంటీలవారీగా తేల్చిన గణాంకాల ప్రకారం, మృతులసంఖ్య బుధవారంనాటికి 111కు చేరుకుంది. ఒక్క కెర్‌విల్లే కౌంటీలోనే 90 మంది పౌరులు మరణించారు. వరద ప్రవాహంలో కొట్టుకుపోయిన 161 మంది పౌరుల జాడ ఇప్పటికీ తెలియరాలేదు. వారికోసం ఎన్నాళ్లైనా చివరివరకూ గాలింపు చర్యలు కొనసాగిస్తామని అధికారులు ప్రకటించారు. గ్వాడలుపే నది ఒడ్డున సమ్మర్ క్యాంప్‌లో ఉన్న బాలికలు 27 మంది, వారి శిక్షకులు, టీచర్లు కూడా వరదలో కొట్టుకుపోయి మరణించారు. ఒక్క టెక్సాస్‌లోనే కాకుండా పొరుగున న్యూ మెక్సికోలో కూడా మంగళవారం సంభవించిన వరదల్లో ముగ్గురు మరణించారు. న్యూమెక్సికోలో 8.8 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మొత్తం 250మంది సిబ్బంది గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. హెలికాప్టర్లను, బోట్లను ఉపయోగిస్తున్నారు. గడచిన 100 సంవత్సరాల చరిత్రలో ఇలాంటి ఘోరమైన వరద విలయం ఎన్నడూ సంభవించలేదు. కాగా ముందస్తు వరద హెచ్చరికల ఆధునిక వ్యవస్థ వైఫల్యం, అధికారుల లోపాలున్నాయన్న ఆరోపణలను ప్రభుత్వం ఖండించింది.

# పాక్-చైనా-బంగ్లాదేశ్ కుటిలత్వం..

### భారతదేశ స్థిరత్వం, భద్రతా అంశాలకు తీవ్రస్థాయి ముప్పు

### రక్షణ సిబ్బంది చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్

### రెండు అణ్వాయుధ దేశాలు నేరుగా ఘర్షణకు దిగడం ఇదే మొదటిసారి అని వెల్లడి

**న్యూఢిల్లీ :** చైనా–పాకిస్థాన్–బంగ్లాదేశ్ కుటిలత్వం భారతదేశ స్థిరత్వం, భద్రతా అంశాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని మంగళవారం చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్) జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. మే 7నుంచి 10 తేదీలలో భారతదేశంపాకిస్థాన్ దేశాల మధ్య జరిగిన సైనిక సంఘర్షణను లోతుగా విశ్లేషిస్తూ ఇక్కడ జరిగిన ఒక థింక్ ట్యాంక్‌లో జనరల్ చౌహాన్ మాట్లాడారు. రెండు అణ్వాయుధ దేశాలు నేరుగా శతృత్వాలలో పాల్గొనడం బహుశా ఇదే మొదటిసారి అన్నారు. ముఖ్యంగా బీజింగ్–ఇస్లామాబాద్ కుటిలత్వం గురించి ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. గత 5 సంవత్సరాలలో పాకిస్థాన్ తన ఆయుధాలు, సామగ్రిలో దాదాపు 70శాతం నుండి 80శాతం వరకు చైనా నుంచి కొనుగోలు చేసిందేనన్నారు. చైనా సైనిక సంస్థలు పాకిస్థాన్‌లో వాణిజ్య బాధ్యతలు కలిగి ఉన్నాయని తెలియజేశారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలోని దేశాలలో ఆర్థిక సంక్షోభం బయటి శక్తులు తమ ప్రభావాన్ని సృష్టించుకునేలా చేసిందని, ఇది భారతదేశానికి దుర్భలత్వాన్ని సృష్టించగలదని అత్యున్నత సైనికాధికారి చౌహాన్ వెల్లడించారు. 'చైనాపాకిస్థాన్‌బంగ్లాదేశ్ మధ్య ఆసక్తి కలయిక భారతదేశ స్థిరత్వం, భద్రతా అంశాలకు చిక్కులు కలిగించే అవకాశం ఉంది' అని జనరల్ చౌహాన్ అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ నిర్వహించిన ఒక కార్యక్రమంలో చెప్పారు. పదవీచ్యుతులైన ప్రధానమంత్రి షేక్ హసీనా ఢాకా నుంచి పారిపోయి గత ఏడాది ఆగస్టులో భారతదేశంలో ఆశ్రయం పొందిన తర్వాత బంగ్లాదేశ్‌తో భారత్ సంబంధాలు బాగా క్షీణించాయన్నారు. అదే సమయంలో ఆయన ఆపరేషన్ సిందూర్ గురించి మాట్లాడుతూ 'మనం సైబర్, విద్యుదయస్కాంత గోళాల వంటి యుద్ధానికి సంబంధించిన కొత్త టెక్నిక్‌లు, యుద్ధరీతులను నూతనంగా స్వీకరించాల్సిన అవసరం ఉంది. తద్వారా సంప్రదాయ కార్యకలాపాలలో 'స్థల విస్తరణ సాధ్యమవుతుంది' అని అనిల్ చౌహాన్ చెప్పారు. భారతదేశంపాకిస్థాన్‌ల మధ్య నాలుగురోజులపాటు చోటుచేసుకున్న సంఘర్షణలో ఉత్తర సరిహద్దు వెంబడి చైనా వైపు ఎలాంటి అసాధారణ కార్యకలాపాలు జరుగలేదని జనరల్ చౌహాన్ స్పష్టంచేశారు. 'అది చిన్న సంఘర్షణే కావచ్చు. అది నేను చేయగల ఊహ. కానీ ఉత్తర సరిహద్దు వెంబడి (చైనా సైన్యాలు) ఎలాంటి కార్యకలాపాలు జరగలేదనేది వాస్తవం' అని ఆయన చెప్పారు. పాకిస్థాన్‌చైనా మధ్య వ్యూహాత్మక స్నేహాన్ని కూడా ఈ సందర్భంగా సిడిఎస్ జనరల్ అనిల్ చౌహాన్ చెప్పారు.' న్యూక్లియర్ బ్లాక్‌మెయిల్‌కు మేం భయపడబోమని భారతదేశం కూడా చెప్పింది.రెండు అణ్వాయుధ దేశాల మధ్య ఘర్షణకు ఆపరేషన్ సిందూర్ ఒక్కటే సమాధానం ఇచ్చిందని నేను అనుకుంటున్నాను. అణ్వాయుధాలు కనిపెట్టినప్పటి నుంచి ప్రపంచంలో వందలాది ఘర్షణలు చోటుచేసుకున్నాయి. అయితే రెండు అణ్వాయుధ దేశాలు నేరుగా ఘర్షణకు దిగడం ఇదే మొదటిసారి' అని జనరల్ అనిల్ చౌహాన్ చెప్పారు.'అయితే ఆపరేషన్ సిందూర్ కొంచెం విలక్షణమైనది ఇది ఉపఖండానికి మాత్రమే కాకుండా యావత్ ప్రపంచానికి కూడా పాఠాలు నేర్పుతోంది' అని చౌహాన్ వివరించారు. మారుతున్న యుద్ధ గతిశీలత గురించి ప్రస్తావించాల్సి వచ్చినప్పుడు పాత, కొత్త రకాల యుద్ధాలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆర్మీ,నేవీ, ఎయిర్‌ఫోర్స్ మధ్య పూర్తి సమన్వయం ఉందని ఆయన వివరించారు.

# మహారాష్ట్రతరహా రిగ్గింగ్‌ను బీహార్‌లో ఎన్నికల్లో సాగనివ్వం

### రాహుల్‌గాంధీ




**పాట్నా:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన రిగ్గింగ్‌ను మళ్ళీ బీహార్‌లో జరగనివ్వబోమని కాంగ్రెస్‌పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ చెప్పారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ప్రయోజనాలకు అనుగుణంగా రిగ్గింగ్ జరిగిందని, కేంద్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎన్‌డిఎ పాలకులు బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా దీనిని పునరావృతం చేయాలని కోరుకుంటున్నారని, ఆ ఆటలు సాగనివ్వబోమని హెచ్చరిక చేశారు. ఈ ఏడాది చివరిలో నిర్ణీత ప్రకారం బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా "సర్" పేరుతో నిర్వహించే ఓటర్ల జాబితాల ప్రత్యేక తనిఖీ సవరణలు అణగారిన వర్గాల ఓటర్లను తొలగించడంకోసమే జరుగుతోందని సర్వత్రా విమర్శలు చెలరేగుతున్నాయి. ఈ విషయంపై ప్రతిపక్షాలు సుప్రీంకోర్టుకు కూడా వెళ్ళాయి. ఓటర్ల జాబితాలలో అక్రమంగా చేపట్టిన సవరణలను వ్యతిరేకిస్తూ పాట్నాలో ఎన్నికల సంఘం కార్యాలయం వరకూ బుధవారం జరిగిన నిరసన ప్రదర్శనలో రాహుల్‌గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శకులను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్నికలసంఘంలో ఉన్న బిజెపి ఎంపిక చేసిన వ్యక్తులు, అధికారపార్టీ ప్రయోజనాలు నెరవేర్చడంకోసం బీహార్ ఓటర్ల జాబితాలలో చాలా సునిశితంగా ప్రత్యేక సవరణలు చేపట్టారని రాహుల్ గాంధీ బుధవారంనాడు విమర్శించారు. కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా జరిగిన సార్వత్రికసమ్మెలో భాగంగా రాహుల్‌గాంధీ పాట్నాలో జరిగిన నిరసన ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్నారు. సమ్మె చేస్తున్న కార్మికుల డిమాండ్లతోపాటు బీహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ సమస్యను కూడా రాహుల్ గాంధీ ఈ నిరసన కార్యక్రమాల్లో ముందుకు తెచ్చారు. ఎప్పుడూ లాగానే రాజ్యాంగ ప్రతిని తన చేతుల్లో పట్టుకుని రాహుల్‌గాంధీ ప్రసంగిస్తూ, "ఎన్నికల సంఘం ఇటీవల బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ భాషలో మాట్లాడుతోంది, ఎన్నికల సంఘం సభ్యులను ఎంపిక చేసే కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తితోపాటు లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు కూడా సభ్యులుగా ఉండాలి, కానీ ఇప్పుడు ఆ ప్రక్రియకు స్వస్తిచెప్పారు. వారిద్దరినీ ఆ కమిటీలోంచి బయటకు పంపేశారు, బిజెపియే సొంతంగా ఎన్నికల కమీషనర్ల పేర్లను ఒక కాగితంమీద రాసి ఇచ్చేస్తోంది" అని విమర్శించారు.

"మేం ఇప్పటికే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి చేసిన రిగ్గింగ్ అక్రమాల నమూనాని ప్రజలముందుకు తీసుకువచ్చాం" అని రాహుల్‌గాంధీ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పరాజయం పొందిన మహారాష్ట్రలో కేవలం ఆరునెలల వ్యవధిలోనే బిజెపి నాయకత్వంలోని కూటమి బ్రహ్మాండమైన విసయం అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిందని, ఈ రాష్ట్రంలో బోగస్ ఓటర్లను అక్రమంగా ఎన్నికల జాబితాల్లో చేర్చడంవల్లనే ఈ విజయం సాధించగలిగారని, ఈ రిగ్గింగ్‌ను ప్రజలకు తాము ఇప్పటికే తెలియజెప్పామని రాహుల్‌గాంధీ అన్నారు. "మహారాష్ట్రలో వేలాదిమంది ఓటర్లు ఒకే ఇంట్లో ఉన్నట్టుగా ఓటర్ల జాబితాల్లో చూపించారు, ఈ విషయాలన్నీ మేం ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువచ్చి చూపించినప్పుడు వాటన్నింటినీ ఎన్నికల సంఘం తిరస్కరించింది, బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ భాషలో మాట్లాడింది, వారు దేశ ప్రజలకు సేవ చేసేందుకే ఎన్నికల సంఘంలో అధికారులుగా ఉన్నారుతప్ప బిజెపి ప్రయోజనాలు నెరవేర్చడానికి ఎన్నికల సంఘంలో లేరన్న విషయాన్ని వారు గుర్తుంచుకోవాలి" అని రాహుల్‌గాంధీ హెచ్చరించారు. "మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్ల జాబితాలను రిగ్గింగ్ చేసిన నమూనానే ఇతర చోట్ల కూడా అమలు చేయాలని వారు ప్రయత్నిస్తున్నారు,ఈసారి మాత్రం అనేకమంది ఓటర్ల పేర్లను జాబితాల నుండి తొలగించేందుకు ప్రయత్నం చేస్తున్నారు, కానీ వాళ్ళు గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే ఇది బీహార్ రాష్ట్రం, ఈ విధమైన కుట్రలను బీహార్ ప్రజలు తిరస్కరిస్తారు" అన్నారు.

# గగనయాన్ చోదకశక్తి యంత్రంలో రెండు అగ్ని పరీక్షలు విజయవంతం

**బెంగళూరు :** గగనయాన్ చోదకశక్తి వ్యవస్థలో రెండు అగ్ని పరీక్షలను ఇస్రో విజయవంతంగా నిర్వహించింది. రోదసీలోకి మానవసహిత అంతరిక్ష నౌకను ప్రయోగించేందు ఇస్రో చేస్తున్న సన్నాహాలలో భాగంగా నౌక యంత్రాన్ని శరవేగంగా ముందుకు నడిపించే చోదకశక్తిని ప్రేరేపించేందుకు వీలుగా అగ్నిని రాజేసే పరీక్షలు చేశారు. గగనయాన్ సర్వీస్ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టమ్ (ఎస్ఎంపిఎస్)లో 30 సెకన్లపాటు ఒకసారి, 100 సెకన్లపాటు ఒకసారి అగ్నిని రాజేసే స్వల్పకాలిక పరీక్షలను బుధవారంనాడు విజయవంతంగా నిర్వహించినట్లు ఇస్రో ఒక ప్రకటనలో తెలియజేసింది.ఈ పరీక్షలు చేయడం ద్వారా ఇస్రోకు విశ్వాసం వచ్చిందని, దీని ఆధారంగా తదుపరి పూర్తిస్థాయి అగ్ని పరీక్షలను త్వరలో నిర్వహిస్తుందని పేర్కొంది. 'ఈ రెండు అగ్ని పరీక్షల సందర్భంగా ప్రొపల్షన్ వ్యవస్థలో మొత్తంగా పనితీరు సర్వసాధారణంగానే ఉంది, ఎలాంటి తేడాలూ లేవు అని ముందస్తు పరీక్షల అంచనాల్లో తేలింది. ఈ రెండు పరీక్షల్లోనూ వాహకనౌక వేగంగా ప్రయాణించడానికి ఒకదాని తర్వాత ఒకటిగా అగ్నిని వివిధ పద్ధతుల్లో రాజేసే రియాక్షన్ కంట్రోల సిస్టమ్, దానితోపాటు అత్యున్నతస్థాయికి చేరుకున్న తర్వాత అంతరిక్ష నౌక కోడిగుడ్డు ఆకారంలో భూమిచుట్టూ పరిభ్రమించేదశ మొదలయ్యేటప్పుడు నౌకలో ఉన్న ఎల్ఎఎంఇ (లిక్విడ్ ఎపోజీ మోటార్ ఇంజిన్)కూడా అనుకున్నవిధంగానే అగ్ని రాజుకుని వేగాన్ని అందుకుంటుందని అంచనాల్లో తెలిసిందని పేర్కొంది. గగనయాన్‌లో ఎస్ఎంపిఎస్ కోసం సాంకేతిక అభివృద్ధి కార్యకలాపాలకు ఇస్రోకు చెందిన లిక్విడ్ ప్రొపల్షన్ సిస్టమ్ సెంటర్ (ఎల్‌పిఎస్‌సి) సారథ్యం వహిస్తోంది. గగనయాన్ యాత్రలో వాహక నౌక ద్వారా కక్ష్యలోకి ప్రవేశించిన అంతరిక్ష నౌక పనితీరు అన్నింటికంటే అత్యంత కీలకమైనది. దీనిని చాలా జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉంటుంది, గగన్‌యాన్‌లో వ్యోమగాములుండే కంపార్ట్‌మెంటులో ఊహించని పరిణామాలు సంభవించకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంటుంది" అని ఇస్రో పేర్కొంది. గగనయాన్‌లో మొత్తం ఐదు లిక్విడ్ ఎపోజీ మోటారు యంత్రాలు ఉంటాయి. ఈ ఐదింటిలో ఒక్కొక్కటీ 440 న్యూటన్ల శక్తిని సృష్టిస్తుంది. అదేవిధంగా ఒక్కొక్కటీ 100 న్యూటన్ శక్తిని ఉత్పత్తిచేసే 16 రియాక్షన్ కంట్రోల్ వ్యవస్థలు కూడా ఉంటాయి.



# 12 మంది నక్సలైట్ల లొంగుబాటు

**దంతేవాడ :** ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జిల్లాలో పన్నెండు మంది నక్సలైట్లు లొంగిపోయినట్లు పోలీసు అధికారి తెలిపారు. 2020 జూన్‌లో ప్రారంభించిన 'లోన్ వర్రాటు' (గోండి మాండలికంలో 'మీ ఇంటికి/గ్రామానికి తిరిగి వెళ్ళు' అని అర్థం) ప్రచారం కింద జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 1,005 మంది నక్సలైట్లు లొంగిపోయారని దంతేవాడ పోలీసు సూపరింటెండెంట్ గౌరవ్ రాయ్ తెలిపారు. లొంగిపోయిన కార్యకర్తలలో, మావోయిస్టుల పశ్చిమ బస్తర్ డివిజన్‌లో డివిజనల్ కమిటీ సభ్యుడిగా చురుగ్గా పనిచేసిన చంద్రన్న అలియాస్ బుర్సు పూనెం (52), గడ్చిరోలి డివిజన్‌లో అదే హోదాలో చురుగ్గా పనిచేసిన అమిత్ అలియాస్ హింగా బార్సా (26)లకు ఒక్కొక్కరికి రూ.8 లక్షల రివార్డు ప్రకటించారని ఆయన అన్నారు. ఈ ఇద్దరు గతంలో భద్రతా దళాలపై పలు దాడుల్లో పాల్గొన్నారని ఆయన చెప్పారు. ఏరియా కమిటీ సభ్యురాలు అరుణ లేకం (25), సెక్షన్ కమాండర్ దేవా కవాసి (22)లకు వరుసగా రూ.5 లక్షలు, రూ.3 లక్షలు రివార్డు ప్రకటించారని ఆయన చెప్పారు. ఒక కేడర్‌కు రూ.2 లక్షలు, ఒక మహిళా కేడర్‌కు రూ.1 లక్ష, మరో ముగ్గురికి రూ.50,000 రివార్డు ప్రకటించారని ఆయన చెప్పారు. లోన్ వర్రాటు డ్రైవ్‌లో లొంగిపోయిన కార్యకర్తలు దంతేవాడ కాకుండా సుక్మా, బీజాపూర్, నారాయణపూర్ జిల్లాలకు చెందినవారని ఆయన చెప్పారు. 2024లో, దంతెవాడతో సహా ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ ప్రాంతంలో మొత్తం 792 మంది నక్సలైట్లు లొంగిపోయారని పోలీసులు తెలిపారు.

# రాజస్థాన్‌లో కూలిన యుద్ధ విమానం

### ఇద్దరు పైలట్లు మృతి

**జైపూర్/ న్యూఢిల్లీ :** భారత వాయుసేన (ఐఎఎఫ్)కు చెందిన ఓ యుద్ధ విమానం కూలిపోయింది. బుధవారం ఉదయం రాజస్థాన్‌లోని చురు సమీపంలో జాగ్వార్ శిక్షణ విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో భారత వైమానిక దళానికి చెందిన ఇద్దరు పైలట్లు మరణించారు. ప్రమాదానికి గల కారణాన్ని తెలుసుకోవడానికి విచారణకు ఆదేశించినట్లు ఐఎఎఫ్ తెలిపింది. సాధారణ శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఐఎఎఫ్ జాగ్వార్ శిక్షణ విమానం ప్రమాదానికి గురై రాజస్థాన్‌లోని చురు సమీపంలో కూలిపోయిందని ఐఎఎఫ్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు తీవ్ర గాయాలతో ప్రాణాలు కోల్పోగా, ఎటువంటి ఆస్తి నష్టం జరిగినట్లు నివేదికలు అందలేదని తెలిపింది. ఘటన పట్ల ఐఎఎఫ్ తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ ఈ దుఃఖ సమయంలో మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తామని వెల్లడించింది. కాగా, రాజస్థాన్ పోలీసు అధికారులు మధ్యాహ్నం 1.25 గంటల ప్రాంతంలో జెట్ కూలిపోయిందని చెప్పారు. భనోడా గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో విమానం కూలిపోయిందని రాజల్‌దేశర్‌లోని ఎస్‌హెచ్ఒ కమలేష్ తెలిపారు. ప్రమాద స్థలం సమీపంలో మానవ శరీర భాగాలు కనిపించాయని ఆయన చెప్పారు. ప్రమాదం జరిగిన కొద్దిసేపటికే స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని కాలిపోతున్న శిథిలాలను గుర్తించారు. రాజల్‌దేశర్, రతన్‌గఢ్ నుండి పోలీసులు, అగ్నిమాపక దళ అధికారులు, అంబులెన్స్‌లు అక్కడికి చేరుకుని, ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు. రాజస్థాన్ గవర్నర్ హరిభావు బగాడే, ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ ఈ సంఘటనపై విచారం వ్యక్తం చేశారు. 'చురు జిల్లాలోని రతన్‌గఢ్ ప్రాంతంలో భారత వైమానిక దళ విమానం కూలిపోవడం విచారకర వార్త అందింది. ఘటన జరిగిన వెంటనే, అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. సహాయ, రక్షణ చర్యల కోసం అధికారులకు సూచనలు ఇచ్చామని శర్మ ఎక్స్‌లో పోస్ట్ చేసి మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# తహవ్వూర్ రాణా జ్యుడీషియల్ కస్టడీ మరోసారి పొడిగింపు

**న్యూఢిల్లీ :** ముంబయి 26/11 పేలుళ్ల కేసులో ప్రధాన నిందితుడైన తహవ్వూర్ హుస్సేన్ రాణా జ్యుడీషియల్ కస్టడీని ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు మరోసారి పొడిగించింది. ఇప్పటికే ఆయనకు విధించిన కస్టడీ నేటితో ముగియడంతో రాణాను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 13 వరకు కస్టడీని పొడిగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ఉగ్రదాడి కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) పాటియాలా హౌస్ కోర్టులో అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో తహవ్వూర్ రాణా పేరును ఛార్జిషీట్‌లో పొందుపరిచింది. ఎన్ఐఎ దాఖలు చేసిన ఈ ఛార్జిషీట్‌ను ఆగస్టు 13న కోర్టు పరిశీలించనుంది. అప్పటి వరకూ రాణా ఎన్ఐఎ కస్టడీలోనే ఉండనున్నారు.

**పాక్ సైన్యానికి నమ్మకమైన ఏజెంట్‌ను..!**

ముంబయి 26/11 పేలుళ్ల కేసులో రాణా నేరాన్ని అంగీకరించినట్లు ఇటీవలే వార్తలు వచ్చాయి. ముంబై ఉగ్రదాడి వెనుక తన పాత్ర ఉందన్న సంగతిని ఎన్ఐఎ విచారణలో అతడు అంగీకరించినట్టు జాతీయ మీడియా పేర్కొంది. పాక్ సైన్యానికి నమ్మకమైన ఏజెంట్‌గా ఉన్నాననే సంగతిని ఎన్ఐఎ అధికారులకు అతడు తెలిపినట్టు సమాచారం. అంతే కాదు తాను, తన స్నేహితుడైన డేవిడ్ హెడ్లీకి పాక్‌కు చెందిన లష్కరే తాయిబాతో సంబంధాలు ఉన్నట్టు కూడా రాణా అంగీకరించినట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

# కుప్పకూలిన బ్రిడ్జి

### నదిలో పడి కొట్టుకుపోయిన వాహనాలు

### 10 మంది మృతి, మరో 9 మందిని రక్షించిన అధికారులు



**వడోదర :** గుజరాత్‌లో ఘోర ప్రమాదం సంభవించింది. బుధవారం ఉదయం వడోదర జిల్లాలో నాలుగు దశాబ్దాల నాటి వంతెన ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో 10మంది మృతి చెందారు. మృతుల్లో ఓ చిన్నారి కూడా ఉన్నారు. మరో తొమ్మిది మందిని రక్షించినట్లు అధికారులు తెలిపారు. మధ్య గుజరాత్‌ను రాష్ట్రంలోని సౌరాష్ట్ర ప్రాంతంతో కలిపే మహిసాగర్ నదిపై ఉన్న గంభీర వంతెన స్లాబ్ కూలిపోవడంతో 10మంది మరణించినట్లు పోలీసు సూపరింటెండెంట్ (వడోదర గ్రామీణ) రోహన్ ఆనంద్ తెలిపారు. ఈ వంతెన జిల్లాలోని పద్రా పట్టణానికి సమీపంలో ఉంది. ఘటనకు సంబంధించి అందుబాటులో ఉన్న వివరాల మేరకు ఇప్పటి వరకు 10 మంది మరణించగా, మరో తొమ్మిది మందిని రక్షించారు. వీరిలో ఐదుగురిని వడోదరలోని ఎస్ఎస్‌జి ఆసుపత్రికి తరలించారు. రక్షించబడిన వారి పరిస్థితి సాధారణంగానే ఉందని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ఆనంద్ చెప్పారు. ఉదయం 7.30 గంటల ప్రాంతంలో వంతెన కూలిపోయినట్లు ఆయన చెప్పారు. వంతెన ఒక్కసారిగా కూలిపోవడంతో బ్రిడ్జిపై వెళ్తున్న రెండు ట్రక్కులు, రెండు వ్యాన్లు, ఒక ఆటోరిక్షా నదిలో పడిపోయాయని వడోదర కలెక్టర్ అనిల్ ధమేలియా తెలిపారు. అయితే నదిలో పడిపోతున్న మరో రెండు వాహనాలను బయటకు లాగేసి సురక్షిత ప్రదేశానికి తీసుకెళ్లారని కలెక్టర్ తెలిపారు. కాగా, నదిలో పడిపోయిన ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురు వ్యక్తులు సురక్షితంగా ఈదుకుంటూ బయటపడ్డారని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ పటేల్ ఈ విషాదం పట్ల విచారం వ్యక్తం చేశారు. వంతెన కూలిపోవడంపై దర్యాప్తు నిర్వహించి నివేదిక సమర్పించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల విభాగానికి ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. రాష్ట్ర రోడ్లు, భవనాల విభాగం, వంతెన నిర్మాణంలో ప్రత్యేకత కలిగిన ప్రైవేట్ ఇంజనీర్లు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని బ్రిడ్జి కూలిపోవడానికి గల కారణాలు, ఇతర సాంకేతిక విషయాలపై ప్రాథమిక దర్యాప్తు నిర్వహించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. స్థానిక మునిసిపాలిటీ, వడోదర మునిసిపల్ కార్పొరేషన్‌కు చెందిన అగ్నిమాపక దళ బృందం ప్రమాద స్థలంలో పడవలు, ఈతగాళ్లతో కలిసి సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయని, ఎన్‌డిఆర్ఎఫ్ బృందం కూడా ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నట్లు సిఎం పేర్కొన్నారు. గుజరాత్ మంత్రి రుషికేష్ పటేల్ మాట్లాడుతూ ఈ వంతెనను 1985లో నిర్మించామని, అవసరమైనప్పుడు మరమ్మతులను ఎప్పటికప్పుడు చేపడుతున్నామన్నారు. ఘటన వెనుక ఉన్న కచ్చితమైన కారణాన్ని పరిశీలిస్తామని చెప్పారు. రెండు స్తంభాల మధ్య ఉన్న వంతెన మొత్తం స్లాబ్ కూలిపోయినట్లు వీడియోలు వైరల్ అయ్యాయి. స్లాబ్ కూలిపోవడం వల్ల దాని పైనుంచి వెళుతున్న వాహనాలు నదిలో పడిపోయాయి. వడోదర అగ్నిమాపక శాఖ, స్థానికుల బృందాలు సహాయక చర్యలో పాల్గొన్నాయని ఒక అధికారి తెలిపారు. దాదాపు 900 మీటర్ల పొడవైన గంభీర వంతెన 23 స్తంభాలను కలిగి ఉంది. గుజరాత్‌లోని వడోదర, ఆనంద్ జిల్లాలను కలుపుతుంది. దీనిని 1985లో ప్రారంభించారు.

**ప్రధాని మోదీ దిగ్భ్రాంతి**

గుజరాత్ రాష్ట్రంలో బ్రిడ్జి కూలిన ఘటనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి కింద బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మృతి చెందిన ఒక్కో బాధిత కుటుంబానికి రూ.2లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు ఆర్థిక సాయం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

# యెమెన్‌లో కేరళ నర్సు ప్రియకు 16న ఉరిశిక్ష

### రక్షించేందుకు ఇంకా ప్రయత్నాలు



**సనా:** యెమెన్‌లో భారతీయ నర్సు నిమిషా ప్రియ (36)కు నిర్ణీత ప్రకారం ఈనెల 16వ తేదీన ఉరిశిక్ష అమలు చేస్తారు. ఆమెను రక్షించేందుకు భారత ప్రభుత్వం సహా పలువురు ముమ్మర ప్రయత్నాలు చేశారు. కానీ గత ఏడాది డిసెంబరులో యెమెన్ అధ్యక్షుడు రషాద్ అల్ అలిమి ఆమెను ఉరితీసేందుకు ఉత్తర్వులపై సంతకం చేశారు. ఎలాగైనా ఆమెశిక్ష తగ్గించేందుకు,రక్షించేందుకు చివరి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఈ కేసులో కోర్టు విచారణ అంతా ప్రియకు ఎంతమాత్రం అర్థంకాని అరబిక్ భాషలోనే జరిగింది. దీంతో తనను తాను రక్షించుకునేందుకు బలమైన వాదనలు వినిపించే అవకాశం ఆమెకు లేకపోయింది. యెమెన్ జాతీయుణ్ణి 2017లో హత్యచేసిందన్న ఆరోపణలపై 2018 నుండి ఆమె యెమెన్ సెంట్రల్ ప్రిజన్‌లో మగ్గుతున్నారు. బంధువుల విజ్ఞప్తి మేరకు అప్పటినుండి ఆమెను రక్షించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. చివరకు ఈనెల 16వ తేదీన ఆమెను ఉరితీసేందుకు తేదీని ఖరారు చేశారు. ప్రియను రక్షించేందుకు ఆమె బంధువులు, ఇతరులు ఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసి ప్రయత్నం చేశారు. మరణించిన యెమెన్ జాతీయుడి కుటుంబీకులకు ఆర్థిక సహాయం చేసి ప్రియను విడిపించేందుకు యత్నించారు. కొంత సొమ్ము విరాళాలుగా పోగుజేసి ఇచ్చారు కూడా. ప్రత్యేక అనుమతి తీసుకుని ప్రియ తల్లి, కుటుంబీకులు ఆమెను కలిసేందుకు యెమెన్ వెళ్ళారు.

కేరళ రాష్ట్రం పాలక్కాడ్ జిల్లా కొల్లెంగోడ్‌లో 1989 జనవరిలో జన్మించిన నిమిషా ప్రియ స్థానిక చర్చ్ ఆర్థిక సహాయంతో నర్సింగ్ కోర్సు చదువు పూర్తిచేసింది. కానీ ఆమె కేరళలో నర్సుగా పనిచేయలేకపోయింది. ఎందుకంటే ఆమె స్కూలు చదువుల్లో కొన్ని సబ్జెక్టులను పూర్తి చేయలేదు. తర్వాత ప్రియ యెమెన్ వెళ్ళింది. రాజధాని సనాలో ప్రభుత్వం నిర్వహించే ఆసుపత్రిలో నర్సుగా చేరింది. 2014లో ప్రియ ఆ ఉద్యోగాన్ని వదిలేసి సొంతంగా క్లినిక్ నడిపేందుకు సిద్ధపడింది. ఐతే యెమెన్ చట్టాల ప్రకారం విదేశీయులు అక్కడ సొంతంగా ఏ వ్యాపారం చేయాలన్నాగానీ స్థానిక వ్యాపారి ఒకరు భాగస్వామిగా ఉండాలి. దాంతో ప్రియ స్థానికంగా ఒక టెక్స్‌టైల్ వ్యాపారం చేస్తున్న తలాల్ అబ్దో మహ్దీని భాగస్వామిగా చేర్చుకుంది. 2015లో 14 పడకలతో కృత్రిమ మేధ సహాయంతో ఒక క్లినిక్‌ను ప్రియ ప్రారంభించింది. ఆమె ఆమె భర్త ఇద్దరూ రుణాలు తెచ్చి క్లినిక్ నడిపేవారు. తర్వాత యెమెన్‌లో అంతర్యుద్ధం ప్రారంభం కావడంతో ప్రియకు సమస్యలు మొదలయ్యాయి. మరోవైపు ఆమె వ్యాపార భాగస్వామి నుండి కూడా లైంగిక వేధింపులు మొదలయ్యాయి. ఆమె ధనాన్ని వ్యాపారి మహ్దీ దోచుకున్నాడు. ప్రియా ఈ ఆరోపణలు చేసింది. యుద్ధం కారణంగా ఇక అక్కడే ఉండిపోవాలని కూడా ఆమె ముందే నిర్ణయించుకుంది. తనను భర్తగా అంగీకరించమని మహ్దీ ఆమెపై ఒత్తిడిని బాగా పెంచాడు. ఆమె పాస్‌పోర్టును, ఇతర డాక్యుమెంట్లను కూడా అతడే కాజేసి భారత్‌లో ఉన్న బంధువులతో కూడా మాట్లాడనివ్వకుండా మెహ్దీ అడ్డుకుంటూ వచ్చాడు. అతడు పెడుతున్న హింస గురించి 2016లో ప్రియ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఐనాగానీ పోలీసులు ఆ విషయంలో జోక్యం చేసుకోవడానికి ఇష్టపడలేదు. పోలీసులు ఆమెకు ఎలాంటి సహాయం చేయలేదు. దీంతో అతడి హింస నుండి బయట పడేందుకు, తన పాస్‌పోర్టును, ఇతర డాక్యుమెంట్లను తిరిగి లాక్కునేందుకు , నిద్రలేవకుండా చేసేందుకు జనరల్ అనెస్తీటిక్‌కు చెందిన సైక్లో హెగ్జాన్‌కు చెందిన కెటామైన్‌ను మెహ్దీకి ఓవర్ డోస్ ఇచ్చింది. మెహ్దీ చనిపోవడంతో మరో నర్సు సాయంతో అతడి శరీరాన్ని ముక్కలుగా నరికి వాటర్ ట్యాంకులో పడేసింది. తర్వాత ప్రియా పరారయ్యేందుకు ప్రయత్నించగా 2017 ఆగస్టులో సౌదీఅరేబియాతో యెమెన్‌కు ఉన్న సరిహద్దుల్లో పోలీసులు ఆమెను, తోటి నర్సును అరెస్టు చేశారు. తోటి నర్సుకు యావజ్జీవశిక్ష విధించారు. ప్రియకు ఉరిశిక్ష విధించారు. అప్పట్లో యెమెన్ మీడియా తప్పుగా అర్థం చేసుకుని యెమెన్‌కు జాతీయుడు మెహ్దీ–ప్రియ ఇద్దరూ వివాహబంధంలో ఉన్నారని వార్తలు రాసింది.

## నిమిషాప్రియను కాపాడండి

### జైశంకర్‌కు సిపిఐ(ఎం) ఎంపి విజ్ఞప్తి

**న్యూఢిల్లీ:** యెమెన్‌దేశం సనాలో ఉరిశిక్ష అమలుకు సిద్ధంగా ఉన్న కేరళ నర్సు నిమిషా ప్రియ (36) ప్రాణాలు కాపాడాలని విదేశీ వ్యవహారాలమంత్రి ఎస్.జైశంకర్‌కు సిపిఐ(ఎం) రాజ్యసభ ఎంపి జాన్ బ్రిట్టస్ బుధవారంనాడు విజ్ఞప్తి చేశారు. తక్షణం దౌత్య జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. తొలుత కేంద్ర ప్రభుత్వం ప్రియను కాపాడతామని హామీ ఇచ్చిందని, కానీ తర్వాత ఆమె ఆర్థిక పరిస్థితే కారణమంటూ ప్రియ కుటుంబంపై కేంద్రం నిందలు వేస్తోందని బ్రిట్టస్ విమర్శించారు. ఆమెను కాపాడేందుకు అన్ని విధాలుగా సహకరించాని కోరారు. కేరళ పాలక్కాడ్ జిల్లాకు చెందిన నిమిషాప్రియ నర్సుగా చేసేందుకు యెమెన్ రాజధాని సనా వెళ్ళారు. 2018లో ఆమెపై హత్యకేసు ఆరోపణ చేశారు. ఇన్నాళ్ళుగా ఆమె జైలులో మగ్గుతున్నారు. హతుడి కుటుంబంతో మాట్లాడి వారికి పరిహారం చెల్లించి ఒక ఒప్పందం చేసుకుని ప్రియను కాపాడేందుకు అంతర్జాతీయస్థాయిలో సహాయం తీసుకున్నఆమె కుటుంబసభ్యులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. విరాళాలు సేకరించి కొంత మొత్తాన్ని కూడా హతుడి కుటుంబానికి చెల్లించారు. కానీ యెమెన్‌కు వెళ్ళేందుకు అంతర్జాతీయంగా రాకపోకల ఆటంకాలు ఎదురయ్యాయి. 2023 నవంబరులో యెమెన్ అత్యున్నత న్యాయస్థానం ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. దీంతో గత ఏడాది డిసెంబరులో యెమెన్ అధ్యక్షుడు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఈనెల 16వ తేదీన ఆమెకు మరణశిక్ష విధించేందుకు తేదీని ఖరారు చేశారు.

# మాలీలో కిడ్నాపైన భారత కార్మికులు క్షేమమేనా?

### కుటుంబాల్లో తీవ్ర ఆందోళన

**న్యూఢిల్లీ:** మాలీలో కర్మాగారంపై దాడిచేసి ఉగ్రవాదులు ముగ్గురు భారతీయులను అపహరించి తీసుకువెళ్ళిపోయిన వారం రోజుల తర్వాత కూడా ఎలాంటి సమాచారం అందకపోవడంతో భారత్‌లోని వారి కుటుంబాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. మూడు నెలల వ్యవధిలో ఆఫ్రికాలో భారతీయులను అపహరించడం ఇది రెండోసారి. ఈ రెండు ఘటనల్లోనూ ఇప్పటివకూ ఎలాంటి సమాచారం లేదు. మాలీలో జరిగిన కిడ్నాప్‌లపై అక్కడి ప్రభుత్వ వర్గాలు ఇంతవరకూ స్పందించలేదు. వారు క్షేమంగా ఉన్నారా? ఎక్కడ ఉన్నారు? అనే విషయాలపై ఎలాంటి సమాచారం తెలియకపోవడంతో కుటుంబీకులు ఆందోళన పడుతున్నారు. గడచిన గురువారంనాడు ఉగ్రవాదులు మాలీదేశంలో అనేక ప్రాంతాలలో దాడులు చేసి హింసాకాండ సృష్టించారు. అందులోభాగంగానే మాలీలోని సిమెంటు ఫ్యాక్టరీపై దాడిచేసి ముగ్గురు కార్మికులను అపహరించి తీసుకువెళ్ళారు. ఆ ముగ్గురూ భారతీయులే. కాయే నగరంలో ఉన్న డైమెండ్ సిమెంట్ కర్మాగారాన్ని భారత్‌కు చెందిన ప్రసాదిత్యాగ్రూపు నడుపుతోంది. ఈ కర్మాగారంపై ఉగ్రవాదులు దాడిచేశారు. దీనిపై ఈ కర్మాగారం కూడా ఇంతవరకూ ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఈ ఘటన జరిగినప్పుడు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆఫ్రికాఖండంలో ఆ సమీపంలోనే ఘనా దేశ పర్యటనలో ఉన్నారు. అల్ ఖైదా ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా ఉన్న జమాత్ నస్రత్ అల్ ఇస్లామ్ వాల్ ముస్లిమీన్ (జెఎన్ఐఎం) సంస్థ మాలీలో అనేకచోట్ల తామే దాడి చేసి హింసాకాండ సృష్టించినట్లు ప్రకటించింది. కానీ భారతీయ కార్మికుల అపహరణ గురించి ఈ ఉగ్రవాదసంస్థ నుండి ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం మాలీలో 400 మంది భారతీయులు నివసిస్తున్నారు. 1990వ దశకం నుండి ఆ దేశంతో భారత్‌కు వాణిజ్య సంబంధాలు కొనసాగుతున్నాయి. అంతకుముందు ఏప్రిల్ నెలలో కూడా మరో ఆఫ్రికా దేశం నైజీరియాలో ఐదుగురు భారత పౌరులను సాయుధ దుండగులు అపహరించుకు తీసుకుపోయారు. అదేసమయంలో ఈ సాయుధ దుండగులు దాదాపు 12 మందినైజీరియా సైనికులను కూడా హతమార్చారు. ఈ భారతీయుల గురించి కూడా ఇప్పటివరకూ ఎలాంటి సమాచారం తెలియలేదు. విధంగా ఇప్పటివరకూ ఎనిమిదిమంది భారతీయులు రెండు ఆఫ్రికాదేశాల్లో అపహరణకు గురయ్యారు. వారి జాడ తెలియలేదు. ఇస్లామిక్ రాజ్యస్థాపనకోసం మాలీలో అల్‌ఖైదా ఉగ్రవాదులు 2012లో పోరాటం ప్రారంభించారు. ఈ పోరాటం ఇప్పుడు ఆ చుట్టుపక్కల దేశాలకు పాకింది.

## అధికారులు సమన్వయంతో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం పూర్తి

**జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు**

**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం పూర్తి అయ్యే విధంగా వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ అధికారులు సమన్వయం చేసుకుని పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ బి.బాబు తన సిబ్బందితో కలిసి కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్‌ను కలిశారు. జిల్లాలో ఆయిల్‌ఫామ్ సాగు ఏ విధంగా జరుగుతుందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాకు ప్రభుత్వం ఇచ్చిన మూడువేల ఎకరాల లక్ష్యం పూర్తి అయ్యేలా చూడాలన్నారు. ఆయిల్‌ఫామ్ సాగుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, రైతులకు నాణ్యమైన మంచి మొక్కలను అందించినట్లయితే అధిక దిగుబడి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ జిల్లా అధికారి నాగయ్య, ఉద్యాన అధికారులు ఎం.మహేష్, ప్రమిత, పతంజలి ఆయిల్‌ఫామ్ కంపెనీ తెలంగాణ డిజిఎం బి.యాదగిరి, మేనేజర్ హరీష్, క్షేత్ర సహాయకు ముత్యంరాజు పాల్గొన్నారు.

## సిసి కెమెరాలు ప్రారంభం

**ప్రజాపక్షం/చందంపేట:** చందంపేట మండలం పోలేపల్లి స్టేజి వద్ద వ్యాపారస్తులందరు కలిసి సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో ముందుకు రావడంతో బుధవారం ఎఎస్‌పి మౌనిక ముఖ్యఅతిథిగా సిసి కెమెరాలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సిసి కెమెరాల ద్వారా దొంగలను పట్టుకోవచ్చని, అసాంఘిక కార్యక్రమాలు జరుగకుండా, వ్యాపారస్తుల ఆస్తులను కాపాడానికి ఉపయోగపడతాయని ఆమె అన్నారు. సిసి కెమెరాల ఏర్పాటుకు సహకరించిన వారికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిండి సిఐ బీసన్న, చందంపేట ఎస్ఐ లోకేష్, తిరుపతి రెడ్డి, రవీందర్‌రెడ్డి, హరీష్, అంజనేయులు, నరేష్, జనార్ధన్, శ్రీను గౌడ్ పాల్గొన్నారు.





## సూర్యాపేట పోలీస్ పనితీరు బేష్

**మల్టిజోన్-2 ఇన్‌ఛార్జి ఐజిపి తఫ్సీర్ ఇక్బాల్**

**ప్రజాపక్షం/సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా పోలీసుల పనితీరు బేష్‌గా ఉందని మల్టిజోన్2 ఇన్‌ఛార్జి ఐజిపి తఫ్సీర్ ఇక్బాల్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో చేపట్టిన పోలీస్ ప్రజాబరోసా కార్యక్రమం మంచి ఆలోచన అని అన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. పిల్లల అక్రమ రవాణా, మహిళల వేధింపులు, ర్యాగింగ్ లను నిరోధించాలని, అక్రమ కార్యకాలపాలు, గంజాయి సరఫరా సమూలంగా నిర్మూలించాలని అన్నారు. అనంతరం జిల్లా ఎస్‌పి కె.నర్సింహా మాట్లాడుతూ ఉన్నతాధికారుల అదేశానుసారం జిల్లాలో పోలీస్ పటిష్టతను పెంచుతామని చెప్పారు. దీనికి ముందు పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలను నాటారు. మొదటిసారిగా వచ్చిన ఐజిపికి పోలీసులు గౌరవ వందనంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి లు రవీందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సూర్యాపేట, కోదాడ డిఎస్‌పిలు ప్రసన్నకుమార్, శ్రీధర్‌రెడ్డి, ఎఆర్ డిఎస్‌పి నర్సింహాచారి, ఎవో మంజుభార్గవి, డిసిఆర్‌బి ఇన్స్‌పెక్టర్ హరిబాబు, సిసిఎస్ ఇన్స్‌ఫెక్టర్ శివకుమార్, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ రంజీత్‌రెడ్డి, సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు రాజశేఖర్, వెంకటయ్య, నర్సింహరావు పాల్గొన్నారు

## అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు

**నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం**



**ప్రజాపక్షం/ రామన్నపేట:** అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. బుధవారం మండలంలోని సిరిపురం, కొమ్మాయిగూడెం, రామన్నపేట మండల కేంద్రం, దుబ్బాక, మునిపంపుల, ఎన్నారం, కుంకుడుపాముల గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. అర్హులైన ప్రతి పేదవారికి ఇండ్లు కట్టించాలనే చిత్తశుద్ధితో ప్రభుత్వం ఉందని, ఇందిరమ్మ రాజ్యంలోనే పేద ప్రజల సొంత ఇంటి కల నేరవేరుతుందని అన్నారు. గడిచిన ప్రభుత్వంలో ఇండ్లు కట్టించలేదని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని, ఇందిరమ్మ రాజ్యంలో పార్టీలు లేవని ప్రతి పేదవారికి మేలు చేయడమే లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి, ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ మల్లారెడ్డి, నాయకులు గంగుల రాజిరెడ్డి, తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, పున్నా జగన్, నర్సిరెడ్డి, జెల్లా వెంకటేశం, అక్రమ్, రేహాన్, పృద్వీరాజ్, జమీర్, పున్నా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా ఇంటి నిర్మాణాలు

**ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్**



**ప్రజాపక్షం/వలిగొండ:** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు త్వరితగతిన ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకొని (బేస్మెంట్ లెవెల్, పిల్లర్ లెవెల్, స్లాబ్ లెవల్) పూర్తి అయిన లబ్ధిదారులకు విడతల వారీగా రూ.5 లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో ప్రతి సోమవారం డబ్బులు జమ చేయడం జరుగుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం వలిగొండ మండలంలోని నాతాళ్లగూడెం గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుతో కలెక్టర్ మాట్లాడుతూ వేగంగా తమ ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. ప్రతి సోమవారం లబ్ధిదారుల అకౌంట్‌లలో డబ్బులు జమ అవుతున్నాయన్నారు. మేస్త్రీతో మాట్లాడి నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

## అన్ని రకాల ఎరువులు ఆన్‌లైన్‌లోనే

**ప్రజాపక్షం/చిట్యాల/నార్కట్‌పల్లి:** నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం చిట్యాల, నార్కట్‌పల్లి మండలాలలో ఆకస్మిక తనిఖీని చేపట్టారు. చిట్యాలలో రైతులు పండించిన ఆర్గానిక్ కూరగాయల మార్కెటింగ్ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న రైతు బజార్‌కు కావల్సిన స్థలాన్ని ఆమె పరిశీలించారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని ఆమె సందర్శించి కార్యాలయ పనితీరును అడిగి తెలుసుకున్నారు. మీ సేవ కేంద్రంలో రేషన్ కార్డుల కొరకు ఆన్‌లైన్ దరఖాస్తు విధానాన్ని పరిశీలించారు. భూభారతి రెవిన్యూ సదస్సులలో భాగంగా మండలంలో వచ్చిన దరఖాస్తుల విచారణను అధికారులు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. అలాగే స్థానిక మిత్ర ట్రేడర్స్ ఎరువు దుకాణాన్ని తనిఖీ చేశారు. అన్ని రకాల ఎరువులను ఆన్‌లైన్‌లోనే అమ్మకాలు చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారమే ధరలను అమ్మాలని లేనట్లైతే కఠిన చర్యలు తీసుకుంటామని యజమాన్యానికి తెలిపారు. ఆమె వెంట తహసిల్దార్ కృష్ణానాయక్, రెవిన్యూ అధికారులున్నారు.

## ఆయిల్‌పామ్ సాగుకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** జిల్లాలో ఆయిల్ ఫాం పంట సాగుకు ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని అలంపూర్ ఉద్యాన శాఅధికారి పి ఇమ్రాన్ తెలిపారు. పంట సాగు, సబ్సిడీ పొందేందుకు భూమి పట్టాదార్ పాస్ బుక్, ఆధార్ కార్డ్, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్ బుక్, ఆధార్ కార్డ్, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, ఒక్కొక్కటి మూడు కాపీల చొప్పున సంబంధిత అధికారికి సమర్పించాలన్నారు. అలంపూర్, మానవపాడు ఏరియా ఆఫీసర్ 977714296 ఫోన్ నెంబర్ లో సంప్రదించాలన్నారు. వడ్డేపల్లి మండల ఆయిల్ ఫాం విస్తరణ అధికారి ఫోన్ నెంబర్ 9030677515 , ఇటిక్యాల, ఉండవల్లి, ఎర్రవల్లి మండలాల ఏరియా ఆఫీసర్ 9515241250 ఫోన్ నెంబర్లలో సాగు పై ఆసక్తి గల రైతులు సంప్రదించాలన్నారు.

# 4 కోడ్‌లు కార్మికులకు వ్యతిరేకం

## సిపిఐ,ఎఐటియుసి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సక్సెస్



**ప్రజాపక్షం/దేవరకొండ :** కేంద్ర కార్మిక సంఘాల దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పిలుపులో భాగంగా దేవరకొండ నియోజకవర్గ కేంద్రంలో సిపిఐ ప్రజా సంఘాలు, ఎఐటియుసి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత 44 కార్మిక చట్టాలుండగా 29 కార్మిక చట్టాలను పూర్తిగా తొలగించి 4 కోడ్‌లుగా తీసుకువచ్చిందని ఇది కార్మికులకు పూర్తిగా వ్యతిరేకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి, ఏఐఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు, సిపిఐ మండల కార్యదర్శులు దేపా సుదర్శన్ రెడ్డి, ఉప్పునూతల వెంకటయ్య, గుమ్మకొం వెంకటేశ్వర్ రెడ్డి, కుంభం జయరాములు, సిపిఐ నాయకులు జూలూరి వెంకట్రాములు, పల్లా రంగారెడ్డి, మైనోద్దీన్, నీల వెంకటయ్య, జూలూరు జ్యోతిబసు, అలమోని మల్లయ్య, రామేశ్వరమ్మ, శారద పాల్గొన్నారు.






**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్‌లో జరిగిన నిరసన ర్యాలీలో ఎర్రజెండా రెపరెపలాడింది. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యల్లావుల రాములు,ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్‌లు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ యావత్ భారతదేశ ప్రజలు,ఆల్ ట్రేడ్ యూనియన్స్ నాయకులు,కార్యకర్తలు ఈ సార్వత్రిక సమ్మెలో పాల్గొనడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన,సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు గుండు వెంకటేశ్వర్లు,మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లీశ్వరీ,యల్లావుల రమేష్,ఇందిరాల వెంకటేశ్వర్లు,జెట్టి ప్రసాద్,మామిడి వెంకయ్య పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/కోదాడ:** కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా బుధవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా కోదాడ ఎఐటియుసి, సిఐటియు, ఐఎన్‌టియుసి, ఐఎఫ్‌టియు, బిఆర్ఎస్‌కెవి ఆధ్వర్యంలో కోదాడ ఆర్టీసీ బస్టాండ్ నుండి రంగా థియేటర్ చౌరస్తా వరకు వేలాదిమంది కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ముల్కలపల్లి రాములు, ఎఐకెఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి వక్కంతుల కోటేశ్వరరావు, బిఆర్ఎస్‌కెవి జిల్లా కార్యదర్శి షేక్ నయీం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి షేక్ లతీఫ్, సిపిఎం పట్టణ కార్యదర్శి ఎం.ముత్యాలు పాల్గొన్నారు.




**ప్రజాపక్షంశ్రీ/చండూరు :** దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం చండూరు మండల కేంద్రంలో నిరసన తో పాటు సిపిఐ ఏఐటియూసి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య ,సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ ,ఏఐటియూసి జిల్లా ఉపాధ్యక్షుడు దోటి వెంకన్న, ఏఐటియూసి జిల్లా సహాయ కార్యదర్శి బరిగెల వెంకటేశ్ ,భవన నిర్మాణ సంఘం మండల అధ్యక్షుడు భైతరాజు శ్రీను పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/అడ్డగూడూరు:** మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏఐటియుసి ఆశా వర్కర్స్ కార్మికుల ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెడే చంద్రయ్య, సీపీఐ మండల కార్యదర్శి రేఖల శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు ఉప్పుల శాంతికుమార్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు చెడిపల్లి రవీందర్, ఏఐటియుసి నాయకులు సుధాకర్ తరుణ్, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు చిప్పలపల్లి వంశీ, ఉప్పుల వంశీ, ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు పసల మగ్దలీన, ప్రధాన కార్యదర్శి ఎడ్ల అమృత, సభ్యులు సిహెచ్ మంగమ్మ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో భారీ ర్యాలి నిర్వహించారు. స్థానిక సుందరయ్య పార్క్ నుంచి బస్టాండ్ , రాజీవ్ చౌక్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డబ్బికార్ మల్లేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు






ఎండి.సయాద్, దళిత హక్కుల పోరాట సమితి డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సైదులు, వల్లంపట్ల వెంకన్న, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, తిరుపతి రామ్మూర్తి పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** ఏఐటీయూసీ, సిఐటియు, సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం జాతీయ రహదారిపై నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఆర్డీవోకు వినతి




పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జాంగిర్, సిపిఐ సిపిఎం నాయకులు బూరుగు కృష్ణారెడ్డి, పల్లె శేఖర్ రెడ్డి, ఏఐటియుసి, సిఐటియు నాయకులు పిల్లి శంకర్, ఎండి పాషా, గంగాదేవి సైదులు, పంపగల శంకరయ్య, బెడద రమేష్, ఉడత రామలింగం, టంగుటూరి రాములు, కొండూరు వెంకటేష్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/చింతపల్లి :** సార్వత్రిక సమ్మెలో భాగంగా సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో కార్మికులు నాగార్జునసాగార్ జాతీయ రహదారిపై బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి



పోలే వెంకటయ్య, ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, ముఖ్య అతిధులుగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావు, ఎఐటియుసి మండల అధ్యక్షుడు మాదుగుల సైదులు, వేముల బుచ్చయ్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ మాడ్గులపల్లి:** కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను



వెంటనే రద్దు చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి అన్నారు. బుధవారం చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో ప్రజా సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రొండి శ్రీనివాస్, దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, నాగమణి, పుల్లెంల శ్రీకర్, నర్సయ్య, యాదమ్మ, రేణుక, సరిత, సునీత, జానకమ్మ, పుష్ప, పావని, ఎల్లయ్య, సయ్యద్, బాలయ్య, చిరంజీవి, నాగరాజు, నరేష్, దేవిరెడ్డి మల్లారెడ్డి, బొంగర్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/డిండి:** డిండి మండల కేంద్రంలో బుధవారం జాతీయ రహదారిపై ఏఐటియూసి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.డి మైనోద్దీన్ పాల్గొన్నారు. సిపిఐ మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకచారి, సహాయ కార్యదర్శి బొల్లె శైలేష్, ఎఐటియుసి మండల అధ్యక్షులు బూసిపాక లింగయ్య, గ్రా. కార్మిక సం. మండల అధ్యక్షులు రామావత్ జవహర్‌లాల్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎలిమినేటి దేవయ్య, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షలు నవీన్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మునుగోడు:** కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం




అవలంబిస్తున్న విధానాలను తిప్పికొట్టాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురిజ రామచంద్రం పిలుపునిచ్చారు. బుధవారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో కార్మికులు రైతులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను,దళిత కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ గోస్కొండ లింగయ్య, ఎఐటియుసి అధ్యక్షుడు దుబ్బ వెంకన్న,కార్యదర్శి బెల్లం శివయ్య, కార్మిక సంఘం నాయకులు మాలాద్రి,భీమనపల్లి స్వామి పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన జాతీయ సార్వత్రిక సమ్మె విజయవంతం అయిందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చన గొని గాలయ్య అని అన్నారు. బుధవారం నారాయణపురం మండల కేంద్రంలో ఏఐటీయూసీ, సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మెకు మద్దతుగా నారాయణపురం సిపిఐ ఆధ్వర్యంలో సంఘీభావం ప్రకటించి ర్యాలీలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిఐటియు నాయకులు దోనూరు నర్సిరెడ్డి, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస చారి, సిపిఎం మండల కార్యదర్శిదోడ యాదవ రెడ్డి, ఏఐటీయూసీ, మండల కార్యదర్శి చిలువేరు అంజయ్య పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/వలిగొండ :** కార్మిక వ్యతిరేక విధానాలు ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న బిజెపి పాలనపై ప్రజలు తిరగబడాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, రైతు సంఘం జిల్లా నాయకులు ఎలగందుల అంజయ్యలు మద్దతు తెలుపగా కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పైళ్ల గణపతి రెడ్డి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు,రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందడి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మెరుగు వెంకటేశం, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్ పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/మోత్కూర్ :** కార్మికుల వ్యతిరేకి నరేంద్ర మోడీ నశించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, ఏఐటీయూసీ మండల కార్యదర్శి జంగా నరసయ్య అన్నారు. బుధవారం మోత్కూరు పట్టణంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కార్మికులు భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై యూనియన్ అధ్యక్షులు పురుగుల రవి, మండల పార్టీ కార్యదర్శి అన్నెపు వెంకట్, గీత పని వాళ్ళ సంఘం జిల్లా అధ్యక్షులు చాపల అంజయ్య, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బుష్పక నరసింహ, మోత్కూరు పట్టణ కార్యదర్శి బోయిన్ ఉప్పలయ్య, మండల సహాయ కార్యదర్శి పులకరం మల్లేష్, ప్రజా నాట్యమండలి మండల అధ్యక్షుడు గొలుసుల యాదగిరి, బీసీ హక్కుల సాధన సమితి మండల అధ్యక్షుడు పెండెం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మెలో వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వేముల బిక్షం, రచ్చ గోవర్ధన్, సిపిఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి మహ్మద్ నయీమ్, సిఐటి యు మండల అధ్యక్షులు కూరెళ్ల కిష్టయ్య పాల్గొన్నారు.






## రైతు బజార్ ను వినియోగించుకోవాలి

### జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** సిరిసిల్ల పట్టణంలోని బతుకమ్మ ఘాట్ రైతు బజార్ ను కూరగాయలు, మాంసం, చేపల విక్రయదారులు వినియోగించు కోవాలని బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కూరగాయల వ్యాపారులను బతుకమ్మ ఘాట్ రైతు బజార్ లోకి తరలించేందుకు అవసర మైన షెడ్ల నిర్మాణం చేస్తున్నామని, అదేవిధంగా ఈ రైతు బజార్ లోకి మటన్ షాపులు, మాంసం షాప్ లు, చేపల విక్రయం షాపులు సైతం తరలించాలని, ఎవరు కూడా రోడ్డు పక్కన అమ్మకూడదని అన్నారు.బతుకమ్మ ఘాట్ రైతు బజార్‌ను వినియోగదారులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి వాడుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఉచిత బస్సు ఏర్పాటు చేయాలని వినతి

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్:** బిసి, ఎస్‌సి, ఎస్‌టి జెఎసి రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ప్రభుత్వ స్కూల్లో చదివే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ లతని కలిసి బీసీ ఎస్టీ, ఎస్సీ జేఏసి ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు.

ఈ సందర్భంగా బీసీ సంఘ రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మినారాయణ మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న పాఠశాలలను పడగొట్టి వాటి స్థానంలో కొత్త స్కూల్ భవనాలను ఏర్పాటు చేయాలని, జగిత్యాల జిల్లాలో రహదారులలో ఎక్కడ చూసిన గుంతలమయమైన రోడ్లు ఉండటంతో ప్రజల ప్రయాణానికి విద్యార్థుల పాఠశాలలకు వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో ఎదలాపురం శ్రీనివాస్, శివ, తిరుపతి, ఉపేంద్ర, బాబు, అశోక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

### మంత్రి లక్ష్మణ్‌కుమార్




**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమం, రక్షణ కోసం ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనార్టీ వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని సుమంగళి గార్డెన్స్‌లో మంగళవారం స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల జిల్లా తృతీయ మహాసభలో ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ మీడియా అనేది ప్రజల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసే గొంతుకని పేర్కొన్నారు. జర్నలిస్టులకు ఆరోగ్య భీమ, హౌసింగ్ పథకాలు, గుర్తింపు కార్డుల పంపిణీ వంటికార్యక్రమాలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు వారు ఎదుర్కొంటున్న విషయాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని హామీ ఇచ్చారు.తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల పాత్ర కీలకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల కోరుట్ల ఎంఎల్‌ఎలు సంజయ్ కుమార్, కల్వకుంట్ల సంజయ్, ఎంఎల్‌సి రమణ, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి, మాజీ జడ్పీ చైర్ పర్సన దావ వసంత, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు, విరహత్ అలీ, నాగునూర్ శేఖర్, ఎలగందుల రవీంధర్, సంపత్, శ్రీనివాస్, టీవీ సూర్యం, చీటి శ్రీనివాస్ రావు, మహమ్మద్ ఇమ్రాన్, బండ స్వామి, మల్లేశం, రాగుల గోపాల చారి, సంబు, రాజిరెడ్డి, సుధన్ తదితరులు హాజరయ్యారు.

## 14న ఆర్టీజన్ కార్మికుల నిరవధిక సమ్మె




**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** టివిఎసి జెఎసి ఆద్వర్యంలో ఈనెల 14 నుండి ఆర్టీజన్ కార్మికుల నిరవధిక సమ్మె నిర్వహించనున్నట్లు జెఎసి జిల్లా చైర్మన్ ఎం.కిషన్ రెడ్డి తెలిపారు. ఈమేరకు పెద్దపల్లి ఎన్పీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం ఆవరణలో బుధవారం సమ్మె పోస్టర్లు ఆవిష్కరించారు. జిల్లాలోని ఆర్టిజన్లు పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని కార్మికులు అందరూ సమ్మెలో పాల్గొనేలా మండలాల వారిగా విస్తృత ప్రచారం చేయాలని సంఘం నాయకులను కోరారు.ఈ కార్యక్రమంలో చైర్మెన్ మారుపాక తిరుపతి, షఫీ,దూడపాక ఓదెలు, కాంపెల్లి రఘు,తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటా

### ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటానని జగిత్యాల ఎంఎల్‌ఎ డా.సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని 21,22,32,33,34,39, 40 వార్డులలో 1 కోటి రూపాయలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్ల అభివృద్ధి పనులకు ఎంఎల్‌ఎ సంజయ్‌కుమార్ బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ జగిత్యాల పట్టణ అభివృద్ధి కోసం ఎల్లప్పుడు కృషి చేస్తానని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 140 కోట్ల నిధులు పట్టణ అభివృద్ధికి మంజూర్ చేయడం జరిగిందన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు మహిళ సంఘాల ద్వారా 1 లక్ష రూపాయల రుణం ఇచ్చే అవకాశం ఉందని దీనిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు, కమిషనర్ స్పందన, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, ఆడువాల జ్యోతి లక్ష్మన్, చెట్‌పెల్లి సుధాకర్, దయాల శంకర్, ఎల్లారెడ్డి మాజీ మున్సిపల్ కౌన్సిలర్‌లు అల్లే గంగాసాగర్, వీరబత్తిని పద్మజశ్రీనివాస్, కోరే గంగమల్లు, పిట్ట ధర్మరాజు, సమిండ్ల వాణిశ్రీనివాస్, అవారీ శివకేసరిబాబు, పులి రమ, నాయకులు ఓరుగంటి నగష్, ఏవో శ్రీనివాస్, డీఈ వరున్, ఏఈలు అనిల్, శరన్, మున్సినల్ సిబ్బంది, మాజీ కౌన్సిలర్‌లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌సి బాలుర వసతి గృహంలో లోపించిన పరిశుభ్రత

### విధులకు హాజరు కాని వార్డెన్



**ప్రజాపక్షం/శంకరపట్నం:** శంకరపట్నం మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శ్రావణ్ కుమార్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు హాస్టల్‌లోని పరిసరాలు పొదలతో నిండి ఉన్నాయని గుర్తించారు. డస్ట్‌బిన్లలో నిలువ నీరు ఉందని, నిలువ నీటితో డయేరియా వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని పేర్కొన్నారు. హాస్టల్‌లో వార్డెను విధులకు హాజరు కాలేదని పేర్కొన్నారు. అంతే కాకుండా వంటశాలలో పరిశీలించగా కుళ్లిన టమాటాలతో వంట చేస్తున్నట్లు తెలిపారు. హాస్టల్ పరిస్థితులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు శ్రావణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హోమియోపతి డాక్టర్ సంధ్య, సిహెచ్‌ఓ భాస్కర్ తదితరులున్నారు.

# ‘వేములవాడ’ అభివృద్ధికి కృషి

### పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/ వేములవాడ:** వెనుకబడిన వేములవాడ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం వేములవాడ పట్టణంలోని 19,20,21,22, వార్డుల్లో 54 లక్షలతో సైడ్ డ్రైన్, సీసీ రోడ్లు మరియు సీసీ కల్వర్టుల నిర్మాణనికి రాష్ట్ర ప్రభుత్వ విప్‌ఆదిశ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడం లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. గుడి చెరువులో,మూల వాగులో మురికి నీరు కలవకుండా చర్యులు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.రెండు సార్లు రాజన్న దేవస్థాన ఛైర్మెన్‌గా పని చేసి, రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణ చేయడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఏటా వంద కోట్ల ఇస్తామని రాజన్న భక్తులను మోసం చేసిందని, ప్రతి శివరాత్రి ఉత్సవాలు సందర్భంగా రంగు రంగుల బ్రోచర్లతో రాజన్న భక్తులను మోసం చేసిందని తెలిపారు. గతంలో తండ్రి కొడుకులు ఎమ్మెల్యే పదవిని తమ హోదకు, వరి పరపతి పెంచుకోవడం కోసం వాడుకున్నారే తప్ప ప్రజా సేవ చేయడానికి కాదన్నారు. ప్రజా ప్రభుత్వంలో రాష్ట్రంతో పాటు వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట మేరకు మహిళ తల్లులకు ఉచిత బస్సు ప్రయాణం, 500 కు సిలిండర్,10 లక్షల ఆరోగ్య శ్రీ, పది సంవత్సరాలుగా పేద ప్రజలు ఎదురు చూస్తున్నా ఇందిరమ్మ ఇల్లు, నూతన రేషన్ కార్డులను మంజూరు చేసినట్లు తెలిపారు. పట్టణంలోని సుభాష్ నగర్ లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వ విప్ పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలో పేద ప్రజల సొంత ఇంటి కల నెరవేరుతుందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి శ్రీనివాస్, కొమరయ్య, పాత సత్యలక్ష్మి, మహేష్, సంఘ స్వామి యాదవ్, రమేష్, నాగుల విష్ణు, లహరి, శ్రీశైలం, దాడి మల్లేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

### సార్వత్రిక సమ్మెలో
## పాల్గొన్న కార్మిక సంఘాలు

**ప్రజాపక్షం/శంకరపట్నం:** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలో ఏఐటియుసి జిల్లా కార్యదర్శి పిట్టల సమ్మయ్య, సిపిఎం మండల కార్యదర్శి వెలుమారెడ్డి రాజిరెడ్డిల ఆద్వర్యంలో బస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ పాత చట్టాలను అమలు పరిచి జీవో నెంబర్ 282 వెంటనే రద్దు చేయాలని కోరారు. కార్మికులందరికీ కనీస వేతనం 26 వేలు ఇవ్వాలన్నారు. ఈ శ్రమ్ గుర్తింపు కార్డులు అందరికీ అందజేయాలన్నారు. కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే 10 లక్షల రూపాయలు, సహజ మరణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రేగుల శ్రీనివాస్, బూర్తుల శ్రీనివాస్, తిరుపతి, రామస్వామి, మధ్యాహ్న భోజనం జిల్లా కార్యదర్శి రజిత, రాజేశ్వరి, బొజ్జ సాయిలు, ఎస్టీ బాబా, చక్రపాణి, మల్లేశం సారయ్య, రాజమణి, లలిత తదితరులున్నారు.




## ఆగస్టు 15 నుండి మధ్యాహ్న భోజన కార్మికుల నిరవధిక సమ్మె



**ప్రజాపక్షం/ముత్తారం :** ఆగస్టు 14 తేదీ లోగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన మధ్యాహ్నం భోజన కార్మికుల గౌరవ వేతనం చెల్లించని యెడల అగస్టు 15వ తేది నుండి నిరవధిక సమ్మెలో వంటలు నిలిపివేసి పాల్గొంటామని డిమాండ్ చేస్తూ మండల మధ్యాహ్న భోజన కార్మకులు మండల విద్యా వనరకు కేంద్రం వద్ద అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 22 సంవత్సరాలుగా ఏ ప్రభుత్వం వచ్చినా నేతనం పెంచుతానని మాట ఇచ్చి వేతనం పెంచకుండా శ్రమ దోపిడీకి గురిచేశారని అన్నారు. కోడిగుడ్లను ప్రభుత్వం సరఫరా చేసి గ్యాస్ ఉచితంగా ఇచ్చే వరకు భోజనం అందించలేమన్నారు. ప్రతి నెల బిల్లులు ఇవ్వకుండా 5 నుండి 6 నెలలకు ఒక చెల్లిస్తే ఎలా వంటలు చేసి పిల్లలకు భోజనం అందించగలమని అన్నారు. వంట కార్మికులకు పనిభద్రత కల్పించాలని కనీస వేతనం రూ. 10 వేలు వెంటనే అమలు చేయాలని నిత్యవసర వస్తువులు గ్యాస్, అన్నీ సరుకులు ప్రభుత్వమే. అంగన్ వాడీ లకు చేసినట్టు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ రాధమ్మ, బాగ్యలక్ష్మి ,పద్మ,కళావతి, శాంతక్క,స్వప్న,లక్ష్మి ,వెంకట లక్ష్మి ,జుబేదా తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## బోనాల మహోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్



**ప్రజా పక్షం/ వేములవాడ టౌన్:** వేములవాడ పట్టణానికి చెందిన టాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్ అసోసియేషన్, సుభాష్ నగర్ లో పోచమ్మ,మైసమ్మ బోనాల మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్ల దీవెనలతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకొన్నారు.

# తప్పనిసరిగా ఆధార్ బయోమెట్రిక్ అప్ డేట్

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

**ప్రజాపక్షం/రాజకసిరిసిల్లప్రతినిధి:** ప్రతి ఒక్కరూ తమ ఆధార్ కార్డ్ లో వివరాలు, బయోమెట్రిక్ అప్ డేట్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఎస్పీ మహేష్ బి గీతేతో కలిసి జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, సంతృప్త పద్ధతిలో పౌరులందరికీ తప్పనిసరిగా ఆధార్ కార్డు జారీ చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగే ప్రసవాల వివరాలు ఈ బర్త్ పోర్టల్‌లో నమోదు చేయాలని అన్నారు. ప్రతి 10 వేల జనాభాకు ఒక సి.ఎస్.సి సెంటర్ ఏర్పాటు చేయాలని, 7 రోజుల సమయంలో అదనంగా మరో 36 సిఎస్‌సి సెంటర్ల ఏర్పాటు నోటిఫికేషన్ జారీ చేయాలని, ప్రస్తుతం ఉన్న కొన్ని సెంటర్లు మార్చాలని అన్నారు. జిల్లాలో 5 నుంచి 15 సంవత్సరాల లోపు గల 27 వేల పైగా ఉన్న జనాభాకు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్డేట్ చేయించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆధార్ బయోమెట్రిక్ అప్ డేషన్ కోసం ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ , కాలేజీలలో ప్రత్యేక అవగాహన క్యాంపులను ప్రతి 6 నెలలకు ఒకసారి ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా సంక్షేమ అధికారి 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు పిల్లలకు ఆధార్ కార్డు అందేలా చూడాలని అన్నారు. 18 సంవత్సరాలు దాటిన వారి ఆదార్ నమోదుకు సంబంధించి తహసిల్దార్ లాగిన్ లో పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని తెలిపారు. ఈ సమావేశంలో యూఐడిఏఐ ప్రాజెక్టు మేనేజర్ నరేష్ చంద్ర, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ రాజం, జిల్లా విద్యాశాఖ అధికారి వినోద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రజిత, ఈడిఎం శ్రీనివాస్, లీడ్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జున్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

### ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**ప్రజాపక్షం/గంగాధర:** తెలంగాణ రాష్ట్రంలోని వికలాంగుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆద్వర్యంలో ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. వికలాంగులకు ఆర్థికంగా భరోసా కల్పించడానికి ప్రభుత్వం ఆర్థిక పునరావాస స్కీమును ప్రవేశపెట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా గంగాధర మండలం గర్శకుర్తి గ్రామానికి చెందిన మామిడిపల్లి విజయకు ఆర్థిక పునరావాస భరోసా పథకం కింద 100 శాతం సబ్సిడీతో రూ. 50వేల ఆర్థిక సహాయం మంజూరయ్యింది. బుధవారం గంగాధర మండలం మధురానగర్‌లోని ప్రజా కార్యాలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం లబ్దిదారురాలికి పరిహారం చెక్కును అందజేశారు. 100 శాతం సబ్సిడీపై ఆర్థిక సహాయాన్ని మంజూరీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇందుకోసం సహకరించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు విజయ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులున్నారు.




**ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించే బాధ్యత తీసుకోవాలి**

జీవకోటికి మొక్కలే ప్రాణాధారమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం గంగాధర మండల కేంద్రంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే స్థానిక నాయకులు, అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ప్రజలను భాగస్వాములను చేసి గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు పురుమల్ల మనోహర్, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల్ రావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, తోట సంధ్య కరుణాకర్, ఎంపిడివో రామ్, గంగన్న, తదితరులున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఇండ్లు నిర్మించుకోవాలి

### కలెక్టర్ హైమావతి

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** ఇందిరమ్మ లబ్ధిదారులు త్వరగా ఇల్లు నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ హైమావతి సూచించారు. బుధవారం సిద్ధిపేట మున్సిపాల్టీలోని వార్డు 37, 20 వార్డుల్లో పర్యాటించి ఇందిరమ్మ ఇండ్ల స్టేటస్‌ను పరిశీలించారు. ముందుగా 37వ వార్డులో పర్యటించి మార్కింగ్ చేసి బెస్‌మెంట్ స్థాయిలో ఉన్న పలువురి ఇండ్లను పరిశీలించారు. అలాగే ఇండ్లు మంజూరైతే నిర్దేశిత 400 ఫీట్ల కన్న తక్కువ స్థలం ఉన్న మాత్రమే ఉన్న లబ్ధిదారులు,మాక్కూడ ఇల్లు నిర్మించుకోవటానికి అనుమతి ఇవ్వాలని వారి స్థలాలను చూపించి కలెక్టర్‌నుకోరారు. బెస్‌మెంట్ పూర్తయిన తర్వాత లక్ష, బెస్‌మెంట్ పిల్లర్లు పూర్తి చేస్తే మరోలక్ష, స్లాబ్ పూర్తయిన తర్వాత రెండు లక్షలు, ఇల్లు మొత్తం పూర్తయితే ఐదులక్షలు అందించటం జరుగుతుందన్నారు. ఇండ్లు త్వరగా నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. 400 నుండి 600 స్కైర్ ఫీట్స్ వరకు మాత్రమే ఇల్లు కట్టుకోవాలని, ఎక్కువ కట్టుకున్న, తక్కువ కట్టుకున్న డబ్బులు రావని తెలిపారు. ఆనంతరం 20వ వార్డులో కుర్షిద్‌నగర్ లో పర్యటించారు.



**నేను ఒకప్పుడు టీచర్‌నే..విద్యార్థులకు సొంత-పిల్లలుగా బావించి విద్యబుద్దులు నేర్పించాలి**

నేను ఒకప్పుడు టీచర్‌నే విద్యార్థులను సొంత పిల్లగా భావించి విద్యాబుద్దులు నేర్పించాలని, మెనుప్రకారం మధ్యాహ్న భోజనం అందించి ఆరోగ్యంగా ఎదిగేలా చూడాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. ఈకార్యక్రమంలో తొగుట తహశీల్దార్ శ్రీకాంత్, ఎంఈఓ నర్సయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని సన్మానించిన కాంగ్రెస్ నేత గుండ్రేటి శ్రీనివాస్



**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర కార్మికశాఖ మంత్రి,ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామిని సిద్దిపేట కాంగ్రెస్ నేత గుండ్రేటి శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. సిద్దిపేట నియోజక వర్గం కాంగ్రెస్ పరిస్థితిని మంత్రి వివేక్ వెంకటస్వామికి సిద్దిపేట కాంగ్రెస్ మాజీ పట్టణ అధ్యక్షుడు గుండ్రేటి శ్రీనివాస్ వివరించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకవచ్చేందుకు కృషిచేయాలన్నారు. కాంగ్రెస్ సర్కార్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గడప,గడపకు ప్రచారం చేయాలన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవాలని సూచించారు. సిద్దిపేట గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నారు.

## గంజాయి సరఫరా చేస్తున్న నలుగురు వ్యక్తుల అరెస్ట్

### 3.75 లక్షల విలువైన 15 కిలోల గంజాయి స్వాధీనం

### హుజురాబాద్ ఏసిపి మాధవి వెల్లడి

**ప్రజాపక్షం/జమ్మికుంట:** గంజాయి సరఫరా చేస్తున్న నలుగురు వ్యక్తుల ముఠాను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్న సంఘటన జమ్మికుంట పరిధిలో జరిగింది. జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హుజురాబాద్ ఏసిపి మాధవి మీడియాతో వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ బార్డర్ సీలేరు నుంచి కరీంనగర్‌కు గంజాయి తరలిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని మూడు లక్షల 75 వేల విలువగల పదిహేను కిలోల గంజాయి, ఐదు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. జమ్మికుంట పట్టణంలోని ఎఫ్‌సిఐ గోదాం సమీపంలో నలుగురు వ్యక్తులు గంజాయి తీసుకొస్తున్నారన్న పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసుల సహకారంతో సిఐ రామకృష్ణ గౌడ్ ఆదేశాల మేరకు ఎస్సై సతీష్ తనిఖీలు నిర్వహించారు. నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వారి వద్ద నుంచి మూడు లక్షల 75 వేల విలువైన పదిహేను కిలోల గంజాయి, ఐదు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఏసిపి తెలిపారు. ఇందులో హనుమకొండ జిల్లా భీంపల్లి గ్రామానికి చెందిన ఆఫ్రిద్, కరీంనగర్ చెందిన చెందిన పాశం తరుణ్ రావు, కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌కు చెందిన బండి పూర్ణం చందర్ కుమార్, కరీంనగర్ తీగలగుట్టపల్లికి చెందిన జనగాం శశిప్రీతంలున్నారు. ఇందులో ఒకరిపై గతంలో మర్డర్ కేసు ఉండగా మరో ఇద్దరిపై గంజాయి సరఫరా చేసిన కేసులున్నాయని తెలిపారు. గంజాయి యువతను చెడుదారిన పెడుతుందని, దానిని అరికట్టడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని, గంజాయిపై తమకు సమాచారం ఇవ్వాలని ఏసిపి మాధవి తెలిపారు. గంజాయి పట్టుకున్న పోలీసు సిబ్బందిని ఏసిపి ప్రత్యేకంగా అభినందించారు. జమ్మికుంట సిఐ ఎస్.రామకృష్ణ, ఎస్సై సతీష్, హెడ్ కానిస్టేబుల్, యాకూబ్, కానిస్టేబుల్స్, అబ్దుల్ ఖదీర్, జాలేందర్ తదితరులున్నారు.




## పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి

### రూ.44వేల నగదు, 9 మొబైల్స్, 9 మోటారు సైకిళ్లు స్వాధీనం

**ప్రజాపక్షం/హుస్నాబాద్:** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని పొట్లపెల్లి గ్రామ పంచాయితీ పరిదిలో గల దేవేంద్ర నగర్‌కు చెందిన వడ్లూరి లక్ష్మన్ పశువుల కొట్టంలో పేకాట అడుతున్నరన్న పక్క సమాచారం మేరకు సిద్దిపేట టాస్స్‌పోర్సు పోలీసులు మరియు హుస్నాబాద్ పోలీసుల సంయుక్తంగా దాడి నిర్వహించారు. ఈ దాడుల్లో దోంతరవేణి ఐలయ్య, బోర్ర శ్రీనివాస్, చెన్నూరి శ్రీనివాస్, కుట్లు రాజయ్య, బసవేణి సాగర్, ఐపాక శ్రీనివాస్, పత్రి మహెందర్, మహ్మద్ షబ్బీర్, వంతడుపుల వెంకటస్వామి, తూర్పటి అనిల్, వడ్లూరి లక్ష్మన్, అనే 11 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుండి దాదాపు 44వేల నగదు తోపాటు 9 సెల్ పొన్లు, 9 మోటారు సైకిల్లును స్వాదీనం చేసుకున్నట్లు పోలీసులు తెలపిపారు. వీరంత హుస్నాబాద్ పట్టణానికి చెందిన వారుగా పేర్కోన్నారు. ఈ సందర్బంగా టాస్స్ పోర్స్ పోలీసులు మాట్లాడుతూ జూదం ,చట్టవ్యతిరేఖ కార్యకలపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాని పరిశీలించిన కేంద్ర డిప్యూటీ డైరెక్టర్



**ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్ :**కాగజ్‌నగర్ మండలంలోని పిపిసి సీతానగర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ మనోజ్ కుమార్ మిశ్ర పరిశీలించారు. ఈ సందర్భంగా రబీ సీజన్‌లో జరిగిన కొనుగోళ్ల వివరాలను పిఎసిఎస్ సెక్రటరి సతీష్‌ను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వ,తూకం, ఇతర సౌకర్యాలు గురించి ఆరా తీశారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కొనుగోళ్ల ప్రక్రియ జరిగిన విధానాన్ని, పంట అమ్మిన డబ్బులు ఎన్ని రోజుల్లో జమ అవుతున్నాయని తెలుసుకున్నారు. సివిల్ సప్లై డిఎం నర్సింహరావు, డిసిఎస్ఓ సాదిక్, ఎఫ్ఎసి సభ్యుడు డిటి ఎన్‌ఫోర్స్‌మేంట్ , డిసిఓ , పిఎసిఎస్ సెక్రటరి , రైతులు పాల్గొన్నారు.

## కార్మికులకు శానిటేషన్ దుస్తులు పంపిణీ



**ప్రజాపక్షం/బోధన్:**బోధన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బుధవారం మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి లు మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు శానిటేషన్ దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పురుష కార్మికులకు ప్యాంటు షర్టు మహిళా కార్మికులకు చీరలు అందచేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మున్సిపల్ కమీషనర్ జాదవ్ కృష్ణ, మున్సిపల్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఎమ్మెల్యే బాబు శంకుస్థాపన



**ప్రజాపక్షం / కాగజ్‌నగర్ :**కాగజ్‌నగర్ పట్టణంలోని 8వ వార్డు, ద్వారకా నగర్‌లో నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి బుధవారం సిర్పూర్ శాసన సభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు భూమి పూజ చేశారు. సందీప్ యాదవ్, అనూష దంపతులకు మంజూరైన ఇంటి నిర్మాణం కోసం ఎంఎల్‌ఏ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీష్ బాబు మాట్లాడుతూ లబ్ధిదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని, ప్రణాళికాబద్ధంగా ఇంటి నిర్మాణం చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్, మాజీ కౌన్సిలర్లు ,జిల్లా కోశాధికారి అరుణ్ లోయ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వనమహోత్సవంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/కౌటాల:**కౌటాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఆవరణలో బుధవారం వనమహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనమహోత్సవాన్ని పండుగలా జరుపుకోవాలని, నాటిన ప్రతి మొక్కను ప్రేమతో సంరక్షించాల్సిన బాధ్యత విద్యార్థులదే అని తెలిపారు. అనంతరం పాఠశాలలో నెలకొన్న సమస్యలను అధ్యాపకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వాటిని శ్రద్ధతో వినిపించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దేవయ్య, తహసీల్దార్ ప్రమోద్, ఎంపిడిఓ రమేష్, ఎంఇఓ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/ఎడపల్లి:**నిజామాబాద్ జిల్లా ఎడపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ పనితీరును ముఖ్యంగా భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా అందిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ దత్తాత్రేయ తెలిపిన వివరాల ప్రకారం భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా మొత్తం 833దరఖాస్తులు అందాయని, ఈ దరఖాస్తులను సంబంధించి దరఖాస్తుదారులకు రసీదులు అందించారా..? అని కలెక్టర్ ఆరా తీశారు. అందిన అర్జీలను వాటి కేటగిరిల వారిగా విభజించి, వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అంతేగాకుండా కొత్త రేషన్ కార్డులు, కుటుంబ సభ్యుల పేర్ల నమోదు కోసం వచ్చే దరఖాస్తులను కూడా వెంటనే పరిశీలించి, అర్హులైన వారికి మంజూరు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యాలయంలోని పలు రికార్డులను కూడా కలెక్టర్ తనిఖీ చేసి, అవసరమైన సూచనలు చేశారు. కలెక్టర్ ఆకస్మిక తనిఖీతో కార్యాలయ సిబ్బంది అప్రమత్తమయ్యారు.

## ఈవ్ టీజింగ్‌పై విద్యార్థులకు అవగాహన




**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :**సామాజిక మాధ్యమాల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, వేధింపులు ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని ఆసిఫాబాద్ ఎస్ఐ సతీష్ తెలిపారు. బుధవారం ఆసిఫాబాద్ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో ఈవ్ టీజింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, బాల్యవివాహాలు, సైబర్ నేరాలు, గంజాయి వాడకం వంటి అంశాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వివిధ సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత సమాచారం షేర్ చేయడంలో జాగ్రత్తలు పాటించాలని, ఎవరికైనా వేధింపులు ఎదురైతే డయల్ 100 లేదా షీ టీం నంబర్ 8712670564కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కర్నూ, అధ్యాపకులు, షీ టీం సిబ్బంది స్వప్న, రజిని, దినేష్ పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి నిరుపేదలకు గొప్పవరం



**ప్రజాపక్షం/మనోహ-రాబాద్:**సిఎం సహాయ నిధి నిరుపేదలకు గొప్ప వరం లాంటిదని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని పరికిబండ గ్రామానికి చెందిన పెగడ రాజు కొంతకాలం క్రితం ప్రమాదానికి గురై ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. అందుకుగాను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా ఆయనకు మంజూరు అయిన 22,500 సిఎంఆర్ఎఫ్ చెక్కును బుధవారం ఈటల రాజేందర్ తన క్యాంపు కార్యాలయంలో బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,సిఎం సహాయ నిధి పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి ఒబిసి సభ్యుడు లక్ష్మణ్ సింగ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కెజిబివి బాలికల పాఠశాలను (మైనారిటీ)

# కలెక్టర్ ఆకస్మిక తనిఖీ





**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి:**హోతి గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను (మైనారిటీ)ధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం క్లాస్ రూములను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్య పుస్తకాలు ఏకరూప దుస్తులు అందరికి అందాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో ఆసక్తి పెంచేందుకు నూతన శైలీ బోధన పద్ధతులు పాటించాలంటూ ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా గణిత శాస్త్రం, సైన్స్ ఇంగ్లీష్ వంటి ముఖ్యమైన సబ్జెక్టుల్లో పిల్లలకు ఆత్మవిశ్వాసం పెంపొందించేలా బోధన జరగాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు భోజన సదుపాయాలపై కలెక్టర్ పరిశీలించారు. వంట గదిని తనిఖీ చేసి అక్కడ శుభ్రత పరిస్థితులు భోజన పదార్థాలు నాణ్యత వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. కలెక్టర్ విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. ఆపై స్టోర్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్ నిత్యవసర సామాగ్రి నిల్వలు నిల్ల విధానాలపై అధికారుల పలు సూచనలు చేశారు. అన్ని వస్తువులు సక్రమంగా నిల్వ చేయాలని ఉపయోగించిన పదార్థాలపై స్పష్టమైన రికార్డులు ఉండాలన్నారు. ఉపాధ్యాయులు మరింత బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓరాంరెడ్డి తహసీల్దార్ దశరథ్ పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

### నిమ్జ్ భూసేకరణ వేగవంతం చేయాలి

జహిరాబాద్‌లో ఏర్పాటవుతున్న నిమ్జ్‌కి సంబంధించి భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధ వారం జహీరాబాద్ ఆర్‌జిఓ కార్యాలయంలో నిమ్జ్ ప్రత్యేక అధికారి రాజు ఆర్‌డిఓ రామిరెడ్డి, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిమ్జ్ ప్రాజెక్టు ఫేస్ 1కు అవసరమైన భూమి సేకరించాల్సి ఉందని దాన్ని త్వరతిగతిన పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ఫేస్ వన్‌లో మొత్తం 3,240 ఎకరాల భూమి అవసరం కాగా ఇప్పటి వరకు 2,888 ఎకరాల భూమి మాత్రమే స్వాధీనంచేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన భూ సేకరణ ఇంకా పూర్తికాలేదని సం బంధిత గ్రామాల రైతులు భూమి యజమానులతో సన్నిహితంగా చర్చించి సమస్యలను పరిష్కరించి భూ సేకరణను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. నిమ్జ్ ద్వారా పరిశ్రమలు ఉద్యోగాలు స్వయం ఉపాధి అవకాశాలు కలుగుతాయని పేర్కొన్నారు. భూముల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు.

## ఉపాధ్యాయుడే కీచకుడై ... విద్యార్థినులపట్ల అసభ్య ప్రవర్తన

### కోటపల్లిలో ఆందోళనకు దిగిన బాలికలు



**ప్రజాపక్షం/చెన్నూరు:**అసభ్య ప్రవర్తన చేస్తున్న ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థినీలు బుధవారం కోటపల్లి మండల కేంద్రంలో రోడ్డుపై ఆందోళన చేపట్టారు. చెన్నూరు నియోజకవర్గంలోని కోటపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న అట్టెం అశోక్ గత కొన్ని రోజులుగా తమ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని విద్యార్థినీలు ఆరోపించారు. ఈ ప్రవర్తన వల్ల తాము తీవ్ర మనోవేదనకు గురవుతున్నామని, చదువుపై దృష్టి కేంద్రీకరించలేకపోతున్నామని తెలిపారు. ఈ విషయంపై పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడంపై వారు అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే ఆందోళన విరమించబోమని స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, ప్రధానోపాధ్యాయుడిపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థినీలు ఆందోళన విరమించారు. ఈ ఘటనపై విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ప్రధానోపాధ్యాయుడిపై , ఫిర్యాదులు చేసినా స్పందించని అధికార యంత్రాంగంపై కూడా స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

## విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను విరమించుకోవాలి

### కాగజ్‌నగర్‌లో ఉద్యోగుల ధర్నా





**ప్రజాపక్షం /కాగజ్‌నగర్ :**విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించాలనే కేంద్ర నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆసిఫాబాద్ జిల్లా చైర్మన్ విలాస్, కన్వీనర్ ఎమ్మాజీ సతీష్ అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ డివిజన్ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగులు విధుల బహిష్కరణ చేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జులై 9న నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజినీర్స్ (ఎన్‌సిసిఓఇఇఇ) పిలుపు మేరకు దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందేనని, దానికి సంఘీభావంగా రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమం నిర్వహించామని స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలను కాపాడాలని, ప్రైవేటీకరణతో ప్రజలకు మరియు ఉద్యోగులకు నష్టం జరుగుతుందని వారు హెచ్చరించారు. విద్యుత్ రంగాన్ని లాభాపేక్ష దృష్టితోకాక,ప్రజా అవసరాల కోణంలో చూసినిర్ణయాలుతీసుకోవాలనికోరారు. కార్యక్రమంలోజిల్లాకోకన్వీనర్‌ఇర్ఫాన్ అహ్మద్, 1104 యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటేష్, 327 యూనియన్ జిల్లా అధ్యక్షుడుచంద్రశేఖర్,నాయకులుపాల్గొన్నారు.

## దిలావర్‌పూర్ కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీ ఏర్పాటు..



**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :**మత్తు పదార్థాల వినియోగంతో జీవితం అంధకారం అవుతుందని డ్రగ్స్, గంజాయి, కొకెన్,గ్రామీణ ప్రాంతాల్లో దొరికే తెల్ల కల్లు వంటి వాటికి దూరంగా ఉండాలని కళాశాల ప్రిన్సిపాల్ పి.సుదర్శన్ విద్యార్థులకు సూచించారు.బుధవారం రోజున కళాశాలలో యాంటి డ్రగ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కమిటీకి అధ్యక్షుడిగా కళాశాల ప్రిన్సిపల్ పి.సుదర్శన్,ఉపాధ్యాక్షుడుగా నజ్నీన్ బేగమ్ అధ్యాపకులు,విద్యార్థులను సభ్యులుగా నియమించారు.స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్,సైబర్ క్రైమ్ పైన స్థానిక ఎఎస్ఐ లక్ష్మి నారాయణ అండ్ టీం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగానే యాంటీ డ్రగ్స్,సైబర్ క్రైమ్ అవగాహన పోస్టర్‌ను విద్యార్థులతో కలిసి విడుదల చేశారు.లక్ష్మి నారయణ మాట్లాడుతూ మత్తు పదర్థాలకు అలవాటు పడి దాన్ని వ్యసనంగ మార్చుకుంటున్నారని అందోళన వ్యక్తం చేశారు.సైబర్ క్రైమ్ అనేది కూడా ఈ రోజుల్లో ఒక పెద్ద సమస్యగా మారింది. అనవసరమైన యాప్ లను ఓపెన్ చేసి ఇబ్బందులకు గురికాకుండా ఉండాలని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.సుదర్శన్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మాలెపు కృష్ణ సీనియర్ అధ్యాపకులు ఆనందం ఎఎస్ఐ లక్ష్మి నారాయణ అండ్ టీమ్ అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి : కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్‌ప్రతినిధి:**ప్రభుత్వ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తూ లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి కలెక్టర్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, భూసేకరణ, భారీ వర్ష సూచనల నేపథ్యంలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, భూభారతి తదితర అంశాలపై మండల ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమీషనర్లు, డీఎల్‌పీఓలు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, వైద్యాధికారులు, హౌసింగ్ ఏఈలు, ఐకెపి ఎపియంలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష జరిపారు. ఒక్కొ మండలం వారిగా ఆయా అంశాలలో ప్రగతిని సమీక్షిస్తూ అధికారులకు క్షేత్ర స్థాయి సిబ్బందికి కలెక్టర్ సూచనలు చేశారు. భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను కేటగిరిల వారిగా విభజిస్తూ సత్వరమే వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఆగస్టు 14 నాటికి అన్ని దరఖాస్తుల పరిష్కారమయ్యేలా చొరవ చూపాలన్నారు. కాగా భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ చేసిన సూచనల దృష్ట్యా అవసరమైనప్రాంతాలలో ముందస్తుగానే అప్రమత్తతో కూడిన చర్యలు తీసుకోవాలసి సూచించారు. ఇదివరకు అతివృష్టి సమయాలలో తీసుకున్న చర్యలను సమీక్షించుకుని ప్రస్తుతం కూడా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. కొత్త రేషన్ కార్డులు, పేర్ల నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటవెంటనే పరిశీలిస్తూ అర్హులకు మంజూరిలు తెలుపాలని సూచించారు. ఎలాంటి విమర్శలు తావు లేకుండా నిబంధనలకనుగుణంగా వ్యవహరించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టేలా వారికి ఉచితంగా ఇసుక అందుబాటులో ఉండేలా చూడాలని ఈ సందర్భంగా అక్రమాలకు తావు లేకుండా పకడ్బంధీ పర్యవేక్షణ జరుపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజోపయోగ పనుల కోసం భూసేకరణ జరిపిన స్థలాలను ఆయా నిర్మాణాల నిమిత్తం సంబంధిత శాఖలకు అప్పగిస్తూ పనులకు శ్రీకారం చుట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కోటి మందిని కోటీశ్వరులుగా చేయడమే ప్రధాన ఉద్దేశం: రూరల్ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/నిజామాబాద్‌ప్రతినిధి:**కోటి మందిని కోటీశ్వర్లుగా చేయడమే ప్రధాన ఉద్దేశ్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో క్రిస్టియన్ మైనార్టీ శాఖ ద్వారా మంజూరైన ఏడు కుట్టు మిషన్లను లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రజాప్రభుత్వం తెలంగాణ మహిళలను కోటి మందిని కోటీశ్వర్లు చేయడమే ప్రధాన ఉద్దేశ్యమన్నారు. మహిళ సహాయక సంఘాల ద్వారా వడ్డీ లేని రుణాలు ఇప్పించి, సోలార్ ప్లాంట్లను ఇన్‌స్టాల్ చేసి విద్యుత్ ఉత్పత్తి చేసి ప్రభుత్వంకే అద్దెకు ఇవ్వాలని కోరారు. దీని ద్వారా మహిళలకు ప్రభుత్వం అద్దె చెల్లిస్తుందన్నారు. మహిళలకు మంచి వ్యాపారమని ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావలన్నారు. కార్యక్రమంలో జక్రాన్‌పల్లి తహసీల్దార్, పీసీస డెలిగేట్ శేఖర్‌గౌడ్, మండల అధ్యక్షు లు చిన్నారెడ్డి, రూరల్ యూత్ నాయకులు ఉమ్మాజీ నరేష్, క్రిస్టియన్ మైనార్టీ శాఖ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి



**ప్రజాపక్షం/బోధన్:**విద్యార్థులు విద్యను ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని మాజీమంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం బోధన్ మండలం బెల్లాల్ గ్రామంలో అటవీశాఖ అధికారులు నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఫోటో దిగి వారితో ముచ్చటించారు.

## నాలుగు కోడ్‌లకు వ్యతిరేకంగా ఎఐటియుసి ర్యాలీ






**ప్రజాపక్షం / మందమర్రి :**బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు కార్మిక కోడ్‌లను వెనక్కి తీసుకోవాలని కార్మికుల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని ఎఐటియుసి కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ తెలిపారు. బుధవారం, దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల సమ్మెకు మద్దతుగా మందమర్రి మార్కెట్‌లో ఎఐటియుసి శ్రేణులు ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్‌లుగా మారుస్తూ తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు.

**తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో...**

ఇదిలా ఉంటే సమ్మెకు మద్దత్తుగా ఎపి, తెలంగాణ బ్యాంకు ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డిసిసిబి బ్యాంక్ ఎదుట ఉద్యోగులు నిరసన తెలిపారు. కేంద్రం తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బ్యాంకులను ప్రయివేట్ పరం చేయడం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసిరాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రశేఖర్, ఇమ్రాన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**సిపిఐ ఆధ్వర్యంలో...**

దేశవ్యాప్త సమ్మెకు మద్దత్తుగా సిపిఐ ఆధ్వర్యంలో అదిలాబాద్ పట్టణంలోని నేతాజీ చౌక్ వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్త ంగా 44 చట్టాలను సాధించుకున్న కార్మికుల హక్కులను మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని ఆరోపించారు. నాలుగు కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్ అరుణ్‌కుమార్, డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు కమలే రామదాస్, నాయకులు పాల్గొన్నారు.

**విద్యుత్ జెఎసి ఆధ్వర్యంలో...**

విద్యుత్ ప్రయివేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని చీఫ్ ఇంజనీర్, ఇన్‌చార్జి ఎస్ఇ జెఆర్ చౌహాన్ అన్నారు. బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో విద్యుత్ జెఎసిఆధ్వర్యంలో ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కార్యాలయం ఎదుట ఉద్యోగులు, జెఎసినాయకులు ప్లకార్డులు ప్రదర్శించి ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలోజెఎసికన్వీనర్‌కే.సత్తయ్య,తదితరులుపాల్గొన్నారు.




**సమ్మెలో పాల్గొన్న మధ్యాహ్న భోజన కార్మికులు**

**నిజాంసాగర్:** దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు బుధవారం సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో నిజాంసాగర్ మండల మధ్యాహ్న భోజన ఏజెన్సీలు తమ సమస్యలను విన్నవిస్తూ స్థానిక తహసీల్దార్ బిక్షపతి, మండల విద్యా శాఖ అధికారి తిరుపతిరెడ్డిలకు వినతిపత్రం సమర్పించారు. నిరుపేదలమైన మధ్యాహ్న భోజన ఏజెన్సీదారులు, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీదారుల సంఘం అధ్యక్షురాలు మల్లమ్మ, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైలు పట్టాలపై తల,మొండెం వేర్వేరుగా లభ్యం



**ప్రజాపక్షం/మనోహరాబాద్:**అనుమానాస్పద స్థితిలో యువకుడు రైలు కిందపడి మృతి చెందిన సంఘటన మనోహరాబాద్ మండలంలోని కూచారం రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే కూచారం గ్రామానికి చెందిన డబ్బు ప్రవీణ్ తండ్రి చంద్రయ్య, 25 సం॥ బుధవారం ఉదయం గ్రామ శివారులో గల రైలు పట్టాలపై ప్రవీణ్ మృతదేహం తల మొండెం వేరై కనిపించాయి. దీంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఆందోళనకు గురై ప్రవీణ్ ఆత్మహత్య చేసుకున్నాడా.? ఎవరైనా హత్య చేశారా.?అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# క్రీడ

## హెచ్‌సిఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు అరెస్ట్



హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు అరెస్ట్ అయ్యారు. సన్‌రైజర్స్ హైదరాబాద్, హెచ్‌సిఏ వ్యవహారంలో సిఐడి చర్యలు చేపట్టింది. జగన్మోహన్‌రావుతో పాటు మరో వ్యక్తిని సిఐడి అరెస్టు చేసింది. ఐపిఎల్ టికెట్ల వ్యవహారంలో వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టిన సిఐడి అధికారులు.. తాజాగా ఇద్దరిని అరెస్ట్ చేశారు. విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఇటీవల కేసు సిఐడి కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. గత ఐపిఎల్ సీజన్‌లో ఎస్‌ఆర్‌హెచ్–హెచ్‌సిఏ మధ్య టికెట్ల వివాదం చెలరేగింది. మ్యాచ్ టికెట్లు కేటాయించలేదంటూ కార్పొరేట్ బాక్స్‌కు హెచ్‌సీఏ తాళం వేసింది. ఈ ఘటనతో ఎస్‌ఆర్‌హెచ్ యాజమాన్యం హైదరాబాద్‌ను వీడిపోతామని హెచ్చరించింది. అధ్యక్షుడు జగన్మోహన్‌రావుపై ఎస్‌ఆర్‌హెచ్ యాజమాన్యం తీవ్ర ఆరోపణలే చేసింది. ఘటనపై గతంలో ప్రభుత్వం విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఎస్‌ఆర్‌హెచ్ ఫ్రాంచైజీపై హెచ్‌సిఏ అధ్యక్షుడు ఒత్తిడి తీసుకువచ్చినట్లుగా విజిలెన్స్ విచారణలో తేలింది. టికెట్ల కోసం ఎస్‌ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని ఇబ్బందులకు గురి చేశారని నిర్ధారణ అయ్యింది. వాస్తవానికి ఉచిత పాస్‌ల కోసం హెచ్‌సిఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు తీవ్రంగా వేధిస్తున్నాడని సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్ ఆరోపించింది. ఇలాగే చేస్తే తాము హైదరాబాద్ నుంచి వెళ్లిపోతామని హెచ్చరించింది. ఉచిత పాస్‌ల కోసం హెచ్‌సీఏ అధికారులు, అధ్యక్షుడి నుంచి వేధింపులు తీవ్రమయ్యాయని.. ఇలాంటి ప్రవర్తనను సహించమని స్పష్టం చేసింది. ఇలాగే కొనసాగితే తాము వేదికను మార్చుకునేందుకు వెనుకాడబోమని.. ఉప్పల్ స్టేడియాన్ని హోం గ్రౌండ్‌గా ఎంచుకుని మ్యాచ్‌లు ఆడటం వారికి ఇష్టం లేనట్లుగా ఉందంటూ హెచ్‌సిఏ కోశాధికారికి లేఖ సైతం రాసింది. లిఖితపూర్వకంగా చెబితే హైదరాబాద్ నుంచి వెళ్లిపోతామని.. ఈ విషయంపై బిసిసిఐకి, తెలంగాణ ప్రభుత్వం, జట్టు యాజమాన్యానికి తెలుపనున్నట్లు చెప్పింది. గత 12 సంవత్సరాలుగా హెచ్‌సీఏతో కలిసి పని చేస్తున్నామని.. గత సీజన్ నుంచి మాత్రమే ఈ సమస్యలు, వేధింపులు ఎదుర్కొంటున్నట్లుగా పేర్కొంది. ప్రతి సీజన్‌లో 50 కాంప్లిమెంటరీ టికెట్లు (F12A బాక్స్) ఇస్తున్నామని.. ఈ ఏడాది వారు అదనంగా మరో 20 టికెట్లు అడుగుతున్నారని ఆరోపించింది. ఎస్‌ఆర్‌హెచ్, హెచ్‌సీఏ వివాదం తీవ్ర స్థాయికి చేరడంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే.




### భారత్ X శ్రీలంక వన్డే సిరీస్..

## కోహ్లీ, రోహిత్ రీఎంట్రీ!

ఇంగ్లాండ్‌తో టెస్ట్ సిరీస్ ముగిసిన వెంటనే టీమిండియా.. శ్రీలంక పర్యటనకు వెళ్లే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు టెస్ట్‌ల అండర్సన్‌సచిన్ ట్రోఫీ ఆగస్టు తొలి వారంలో ముగియనుంది. ముందస్తు షెడ్యూల్ ప్రకారం ఇంగ్లాండ్ పర్యటన అనంతరం టీమిండియా బంగ్లాదేశ్ టూర్‌కు వెళ్లాల్సి ఉంది. అక్కడ ఆ జట్టుతో వన్డేతో పాటు టీ20 సిరీస్ ఆడాల్సి ఉంది. కానీ అనూహ్యంగా ఈ పర్యటన 2026కి వాయిదా పడింది. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిస్థితుల కారణంగా టీమిండియా పర్యటించలేదని బిసిసి భావించింది. దాంతోనే బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుతో చర్చలు జరిపి ఈ పర్యటనను వాయిదా వేసింది. అనూహ్యంగా ఈ పర్యటన వాయిదా పడటంతో ఆటగాళ్లుక విశ్రాంతి దక్కుతుందని అందరూ భావించారు. మరోవైపు శ్రీలంకలో జూలై, ఆగస్టులో జరగాల్సిన లంక ప్రీమియర్ లీగ్ వాయిదా పడింది. దాంతో ఆ జట్టుకు కూడా ఈ విండో ఖాళీగా మిగిలిపోనుంది. ఈ గ్యాప్‌లో అంతర్జాతీయ సిరీస్‌లు నిర్వహించాలని శ్రీలంక క్రికెట్ బోర్డు భావిస్తోంది. ఈ క్రమంలోనే భారత్‌తో మూడు వన్డేలు, మూడు టీ20ల సిరీస్ నిర్వహించాలని ప్రయత్నిస్తోంది.
ఇరు దేశాల క్రికెట్ బోర్డుల ఈ ద్వైపాక్షిక సిరీస్‌లకు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఆగస్టులో భారత్, శ్రీలంక మధ్య మూడు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌లు జరగనున్నాయి. త్వరలోనే అధికారిక ప్రకటన రానుంది. ఈ సిరీస్‌లు జరిగితే అంతర్జాతీయ టెస్ట్, టీ20లకు వీడ్కోలు పలికిన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రీఎంట్రీ ఇవ్వనున్నారు. ఈ ఇద్దరు ఆటగాళ్లు కేవలం వన్డే క్రికెట్‌లో మాత్రమే కొనసాగుతున్న విషయం తెలిసిందే.

## గెడ్డం తెల్లబడింది.. ఇంకేం ఆడమంటావ్: కోహ్లీ

టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలకడంపై టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'గెడ్డం తెల్లబడింది.. ఇంకేం ఆడమంటావ్'అని నవ్వులు పూయించాడు. ప్రస్తుతం కోహ్లీ వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఐపిఎల్ 2025 సీజన్ సందర్భంగా విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా హోస్ట్ గౌరవ్ కపూర్.. విరాట్ కోహ్లీని స్టేజీపైకి ఆహ్వానించాడు. మైదానంలో విరాట్ కోహ్లీని ప్రతీ ఒక్కరు మిస్సవుతున్నారని, రిటైర్మెంట్ ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించాడు. అందుకు కోహ్లీ సరదా వ్యాఖ్యలతో నవ్వులు పూయించాడు. 'రెండు రోజుల క్రితమే నా గడ్డానికి కలర్ వేసుకున్నాను. ఇంకేం ఆడమంటావ్. ప్రతీ నాలుగు రోజులకు ఒకసారి గెడ్డానికి రంగు వేసుకోవాల్సి వచ్చిందంటే.. ఆటకు వీడ్కోలు పలకాల్సిన సమయం ఆసన్నమైందని అర్థం' అని నవ్వుతూ బదులిచ్చాడు. దాంతో అక్కడ నవ్వులు పూసాయి. ఈ సందర్భంగా విరాట్ కోహ్లీ.. రవి శాస్త్రికి ధన్యావాదాలు తెలిపాడు. తన టెస్ట్ కెరీర్‌ను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారని, ఆయనే లేకుంటే టెస్ట్ క్రికెట్‌లో తాను సాధించిన ఘనతలను అందుకునేవాడిని కాదన్నాడు.



# ఫోకస్

# కళారంగం







### కర్నాటకలో నాటకాలకు


## పునరుజ్జీవనం

కర్నాటక రాష్ట్రంలో నాటకాల పునరుజ్జీవన ప్రక్రియ అటు కళాకారులు, ఇటు ప్రేక్షకులకు కొత్త ఉత్సాహాన్నిస్తున్నది. ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ బుకర్స్ ప్రైజ్‌కు ఎంపికైన బాను ముష్తాక్ రచన 'అదెయ హనాతే' (హృదయ దీపం లేదా హార్ట్ ల్యాంప్) ఆధారంగా, అదే పేరుతో రూపుదిద్దుకున్న నాటక ప్రదర్శనలకు మంచి స్పందన ఉంటుందని నిర్వాహకులు అంటున్నారు. 55 నిమిషాల ఈ నాటకను, ఈనెల 5న హెగ్గోడులో ప్రదర్శిస్తారు. కథలో భావోద్వేగాలు పుష్కలంగా ఉండడంతో, నటీనటులు తమ అద్భుత నటనతో ప్రేక్షకులను ఆకట్టుకోవడం ఖాయం. 2019లో 'హృదయాద', 'తీర్పు' పేర్లతో ప్రదర్శితమైన నాటకం, ఇప్పుడు కొత్త రూపాన్ని సంతరించుకొని, ప్రదర్శనకు సిద్ధంగా ఉంది. బాను ముష్తాక్ స్వస్థలమైన హాసన్‌లో ఈనెల 12న నటకాన్ని ప్రదర్శిస్తారు. అదే విధంగా మైసూరులోని కిరు రంగ మందిర ఆడిటోరియంలో ఈనెల 19న ప్రదర్శన ఉంటుంది. ఈ నాటకం మొత్తాన్ని కవిత్వాత్మకంగా ప్రదర్శించనుండడం విశేషం. రచయిత్రి కథలోని భావోద్వేగ భావనలను, నటీనటులు, సాంకేతిక బృందం వేదికపై దృశ్యరూపంలో ఆవిష్కరిస్తారు. ఇందులో మొత్తం 7 పాత్రలు ఉంటాయి. కథ, సాహిత్య విలువలను సమపాళ్లలో రంగరించి, ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా తీర్చిదిద్దినట్టు నిర్వాహకులు అంటున్నారు. ఇలావుంటే, బాను ముష్తాక్ స్వస్థలం హెగ్గోడులో 'నీలకంఠేశ్వర నాట్య సేవా సంఘ' (నినసం)ను 1949లో స్థాపించారు. కన్నడ గ్రామీణ నాటకాలకు అంతర్జాతీయ గుర్తింపును తెచ్చిపెట్టడంలో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తున్నది. ఇది నాటకాలను ప్రదర్శించే ఓ నాటక సమాజం మాత్రమేకాదు... ఇక్కడ డ్రామా ఇన్‌స్టిట్యూట్ ఉంది. అందులోనే నాటక రంగానికి సంబంధించిన ఎన్నో విభాగాల్లో ఔత్సాహికులకు శిక్షణనిస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే, రంగస్థల కళకారులు, సాంకేతిక విభాగాల్లో సేవలు అందించే వారికి ఈ సంస్థ శిక్షణనిస్తున్నది. అదే సమయంలో, మన దేశంలోగాక, ప్రపంచంలోని వివిధ దేశాల్లోనూ నాటక ప్రదర్శనలను నిర్వహిస్తున్నది.



### చిత్రకళకు

## కొత్త రూపం



ప్రముఖ చిత్రకారుడు జార్జ్ స్టబ్స్ పేరు వింటే ముందుగా అద్భుతమైన చిత్రాలు... ఆ వెంటనే గుర్రాలు స్ఫురణకు వస్తాయి. 18వ శతాబ్దానికి చెందిన స్టబ్స్ చిత్ర కళనకు కొత్త రూపాన్నిచ్చాడు. కొత్త పుంతలు తొక్కించాడు. 1724 ఆగస్టు 25న జన్మించిన స్టబ్స్, 1806 జులై 10న తుదిశ్వాస విడిచాడు. జీవితకాలంలో అరుదైన చిత్రాలతో చరిత్రలో తన పేరును చిరస్థాయిగా లిఖించుకున్నాడు. అతని చిత్రాల్లో ముఖ్యంగా గుర్రాలు, జంతువులు, వేట, ఖగోళం నేపథ్యాలున్న జీవితాంతపు చిత్రాలు ఉన్నప్పటికీ, అతని శైలి, శాస్త్రీయ అధ్యయనం, నిర్మాణంలో ఉన్న ఖచ్చితత్వం అతనికి చిత్రకళలో ప్రత్యేక స్థానాన్ని కల్పించాయి. స్టబ్స్ ఎక్కడా చిత్రలేఖనం నేర్చుకోలేదు. స్వయంగా తనను తాను చిత్రకారుడిగా మలచుకున్నాడు. చిహ్నశాస్త్రం, శరీర నిర్మాణ శాస్త్రాలపై చిన్నతనం నుంచే ఆసక్తి ఉండేది. అదే విషయం అతని చిత్రాల్లో వివిధ రూపాల్లో ప్రతిఫలిస్తుంది. అతను ప్రారంభంలో మానవ శరీర నిర్మాణాన్ని అధ్యయనం చేస్తూ అనేక రేఖాచిత్రాలు వేశాడు. తరువాత ఇది అతని జంతు చిత్రలేఖనానికి మలుపుతిప్పింది. 'ది అనాటమీ ఆఫ్ ది హార్స్' (1766) స్టబ్స్‌కు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చింది. ఇది కేవలం కళా సంపద మాత్రమే కాక, శాస్త్రీయంగా గుర్రం శరీర నిర్మాణాన్ని విశ్లేషించిన ప్రముఖ గ్రంథం. అతను మూడు సంవత్సరాలు గుర్రాల శరీర నిర్మాణాన్ని అధ్యయనం చేశాడు. వాటిని శస్త్రచికిత్స ద్వారా విభజించి, ప్రతి భాగాన్ని ఖచ్చితంగా చిత్రీకరించాడు. అందుకే, దీనిని ఒక విప్లవాత్మకమైన అధ్యయనంగా పేర్కొంటారు. దీనివల్ల స్టబ్స్ చిత్రాల్లో ఉన్న శాస్త్రీయ ప్రామాణికత బలపడింది. గుర్రాలే అత్యధిక శాతం స్టబ్స్ చిత్రాల్లో కీలకంగా కనిపిస్తాయి. వాటి రూపం, కదలిక, శరీర నిగూఢత, వాతావరణంలో వాటి ప్రవర్తన వంటి సున్నితమైన అంశాలను అతను ఎంతో చక్కగా చిత్రీకరించాడు. 'విజిల్ జాకెట్' (1762) అతని అత్యంత ప్రఖ్యాత చిత్రం. ఇందులో గుర్రాన్ని స్వేచ్ఛాస్వరూపంగా, నేపథ్యం లేకుండా చూపించాడు. 'మేర్స్ అండ్ ఫోల్స్', 'హార్స్ అటాక్డ్ బై ఎ లయన్' వంటి చిత్రాలు స్టబ్స్ కుంచె నుంచి జాలువారిన అద్భుత కళాఖండాలు. వాస్తవికత, స్పష్టత, ఖచ్చితత్వం అతనిని ఇతరులకంటే భిన్నంగా నిలబెట్టాయి. ఆ రోజుల్లో బ్రిటన్ శాస్త్రసాంకేతిక రంగాల్లో పురోగమిస్తున్నది. కొత్తకొత్త పరిశోధనలు జోరందుకున్నాయి. సాంస్కృతిక ముఖచిత్రం కూడా వేగంగా మారుతున్నది. అలాంటి నేపథ్యంలో, జంతువులను చిత్రాల్లో ప్రధాన వస్తువుగా చూపించడం కొత్త గవాక్షాన్ని తెరిచింది. స్టబ్స్ ఎక్కువగా జంతువుల చిత్రాలు వేశాడు, వాటిలో మానవ సంబంధాలు ప్రత్యక్షంగా లేకపోయినా పరోక్షంగా అనేక తత్విక అంశాలు ఉన్నాయి. ఉదాహరణకి 'గొరిల్లా అండ్ జూకీపర్' వంచి చిత్రాల్లో మానవ, జంతు సంబంధాన్ని అద్భుతంగా ఆవిష్కరించాడు. 'ది మూస్', 'ది జీబ్రా', 'ది కంగారూ' వంటివి బ్రిటిష్ సామ్రాజ్యవాదం వలన యూరోప్‌కు వచ్చిన విదేశీ జంతువుల చిత్రాలు. స్టబ్స్ సమకాలీన విమర్శకులు ఆయన చిత్రాలను 'ప్రకృతికి నకలు' అంటూ కొట్టిపారేసినప్పటికీ, 20వ శతాబ్దంలో కళా చరిత్రకారులు అతని శైలి లోతును, శాస్త్రీయతను గుర్తించారు. ప్రఖ్యాత విమర్శకులు అనేక మంది అతనిని 'బ్రిటిష్ లియోనార్డో'గా అభివర్ణించారు. అతని కళ సుసంపన్నమైన, శాస్త్రీయంగా బలమైనదిగా, అదే సమయంలో భావోద్వేగాలను ఆవిష్కరించేదిగా ఉందని పేర్కొన్నారు. గుర్రం మాత్రమేకాదు.. ఎత్తుగా ఎగిరే క్షణాన్ని ఫ్రీజ్ చేసినట్టుగా శరీర నిర్మాణం శాస్త్రీయంగా ఖచ్చితంగా ఉండేలా చిత్రాలు గీయడం స్టబ్స్ సామర్థ్యానికి ప్రతీక. స్టబ్స్ చిత్రాలు వాస్తవికత, శాస్త్రీయత, మరియు భావోద్వేగాల అనన్య కలయిక. అతను జంతువులను చిత్రీకరించడంతోపాటు, ప్రకృతి జీవ వైవిధ్యం, శక్తి, సామాజిక సంబంధాలు, మానవపు మౌలిక ప్రశ్నలను ఛాయల రూపంలో వ్యక్తీకరించిన తత్త్వవేత్త. అందుకే అతను చిత్రకారులకు నిత్యస్మరణీయుడు.





# లీల



### ఆర్‌కె నాయుడు కంటే పవర్ ఫుల్

## పోలీస్ ఆఫీసర్

### సాగర్ 'చిట్ చాట్'

'ది 100' సినిమాలో బుల్లితెర నటుడు ఆర్కే సాగర్ హీరోగా నటించాడు. పోలీస్ ఆఫీసర్ పాత్రను పోషించిన సాగర్ ఈ సినిమాపై భారీగానే ఆశలు పెట్టుకున్నారు. బుల్లితెర నుంచి పెద్ద తెరకు ప్రమోట్ అవుతున్న సాగర్ తాను నటించిన ది 100 సినిమా ఈనెల 11వ తేదీన విడుదల అవుతున్న సందర్భంగా మీడియాతో చిట్ చాట్ చేశారు.

*** ఈ సినిమాకి 'ది 100' టైటిల్ పెట్టడానికి కారణం?**
'ది 100' అనే టైటిల్ వచ్చిన తర్వాత సినిమాకి ఒక ఎమోషన్ వచ్చింది. సొసైటీకి ఏదైనా మంచి చేయాలి అనే తపనతో పెట్టిన టైటిల్ ఇది. లక్కీగా కథకి ఈ టైటిల్ పర్ఫెక్ట్‌గా కుదిరింది. సినిమా చూసిన తర్వాత ఈ సినిమాకి 100 అనే టైటిల్ ఎందుకు పెట్టామో మీకు తెలుస్తుంది. ప్రతి యుగంలో దీనులను కాపాడడానికి ఒక ఆయుధం పుడుతుంది. త్రేతాయుగంలో రామ బాణం, ద్వాపర యుగంలో సుదర్శన చక్రం, కలియుగంలో 'ది 100'. ఈ సినిమాకి అంత పవర్ ఉంది. వెరీ టచింగ్ పాయింట్‌తో తీసిన సినిమా.

*** ఇందులో మీ క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?**
ఇప్పటివరకు చాలా పోలీస్ క్యారెక్టర్స్ వచ్చాయి కానీ ఇందులో క్యారెక్టర్ మాత్రం ప్రతి పోలీస్ ఆఫీసర్ గర్వంగా ఫీల్ అయ్యేలా ఉంటుంది. ఈ సినిమా రిలీజ్ అయిన తర్వాత వాళ్లే ఈ విషయం చెప్తారు.

*** మొగలిరేకులు సీరియల్‌లో ఆర్ కె నాయుడు క్యారెక్టర్ చాలా మంచి పేరు తీసుకొచ్చింది కదా.. మళ్ళీ అలాంటి క్యారెక్టర్‌తో సినిమా ఎందుకు చేయలేదు?**
దాదాపు ఆరు సంవత్సరాలు నేను ఆర్కే నాయుడు క్యారెక్టర్‌లోనే ఉన్నాను. సినిమాల్లో చేసినప్పుడు ఆ క్యారెక్టర్ కి భిన్నమైన క్యారెక్టర్స్ ఇంకా డిఫరెంట్ క్యారెక్టర్స్ చేయాలని ఆలోచనతో మాన్ అఫ్ ది మ్యాచ్, సిద్ధార్థ, షాదీ ముబారక్ లాంటి సినిమాలు చేశాను. పోలీస్ క్యారెక్టర్ చేయాలంటే మళ్ళీ ఒక బలమైన కథ కుదరాలి. అలాంటి కథ 100లో కుదిరింది. ఈ క్యారెక్టర్ ఆర్కే నాయుడు కంటే పవర్ ఫుల్ గా ఉంటుంది


*** ఈ కథ ఎలా పుట్టింది?**
ఇది ఒక రియల్ పోలీస్ ఆఫీసర్ చెప్పిన ఆలోచన సినిమాగా తీసుకోవచ్చా అని అడిగాను. పేరు పెట్టకుండా తీసుకోవచ్చు అని చెప్పారు. దాదాపు ఆలోచనని నాలుగు సంవత్సరాలు పాటు నా బుర్రలో మోసాను. ఒకసారి సుకుమార్ దగ్గరికి లంచ్ కి వెళ్ళాను. కథల గురించి డిస్కషన్ వచ్చింది. అప్పుడు ఈ కథ చెప్పాను. ఆయన చాలా ఎక్సైట్ అయ్యారు. ముందు ఇలాంటి కథ చేయాలని చెప్పారు. వాళ్ళ టీంతో కొన్ని రోజులు జర్నీ జరిగింది. తర్వాత ఆయన వేరే ప్రాజెక్ట్స్ లో బిజీ అయ్యారు. ఈ కథ చేసుకుంటానని ఆయనకి చెప్పాను. తర్వాత కథని పూర్తిస్థాయిలో సిద్ధం చేశాం. 100% కాన్ఫిడెన్స్ వచ్చిన తర్వాత సెట్స్ పైకి తీసుకెళ్లాం.

*** మిషా, ధన్య క్యారెక్టర్స్ ఎలా ఉంటాయి?**
మిష క్యారెక్టర్‌లో చాలా డెప్త్ ఉంటుంది. ఆ క్యారెక్టర్ చూస్తే కళ్ళల్లో నీళ్లు ఆగవు. మిషా, ధన్య, విష్ణు ప్రియ.. ఈ మూడు క్యారెక్టర్ లో సినిమాలో చాలా కీలకంగా ఉంటాయి.

*** మీకేమైనా డ్రీమ్ క్యారెక్టర్స్ ఉన్నాయా ?**
నాకు ఇష్టమైన సినిమా నాయకుడు. ఎన్నోసార్లు ఆ సినిమాని చూశాను. అలాంటి ఒక క్యారెక్టర్ చేయాలని ఉంది. నా తరువాతి ప్రాజెక్టు కు ఇంత గ్యాప్ ఉండదు. అది తొందరలోనే వస్తుంది. అలాగే 'ది 100' సినిమాకి సీక్వెల్ చేసే ఛాన్స్ కూడా ఉంది.

### సితార హ్యాట్రిక్ చిత్రం

## బ్యాడాస్



'కృష్ణ అండ్ హిజ్ లీల' చిత్రంతో ఆకట్టుకున్న స్టార్‌బాయ్ సిద్ధు జొన్నలగడ్డ, దర్శకుడు రవికాంత్ పేరెపు కలయికలో మరో సినిమా రాబోతుంది. ఈసారి వారు 'బ్యాడాస్' అనే విభిన్న చిత్రం కోసం చేతులు కలిపారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. 'బ్యాడాస్' సినిమాకి రవికాంత్ పేరేపుతో పాటు సిద్ధు జొన్నలగడ్డ రచయితగా వ్యవహరిస్తున్నారు. రవికాంత్ దర్శకత్వం వహిస్తున్నారు.
'బ్యాడాస్' చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. సిద్ధు జొన్నలగడ్డతో 'డీజే టిల్లు', 'టిల్లు స్క్వేర్' వంటి ఘన విజయాల తర్వాత వారి నిర్మాణంలో వస్తున్న ముచ్చటగా మూడో చిత్రమిది. ఈ సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని నిర్మాత వంశీ తెలిపారు.







### తెలంగాణ నేపథ్యంలో

## మోతెవరి లవ్ స్టోరీ

తెలంగాణ నేపథ్యంలో సాగే ఓ ప్రేమ కథను జీ5కోసం నిర్మించారు. మధుర ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై శివ క్రిష్ణ దర్శకత్వంలో నిర్మించిన ఈ వెబ్ సీరీస్ మోతెవరి లవ్ స్టోరీ. ఈ వెబ్ సీరీస్ ను ఆగస్టు 8వ తేదీ నుంచి జీ5లో ప్రసారం కానుంది. ఈ వెబ్ సీరీస్ కు సంబంధించి ఫస్ట్ లుక్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. చరణ్ అర్జున్ సంగీతం అందిస్తున్నారు. మై విలేజ్ షో నడిపిస్తున్న నటీ నటులు ఇందులో నటించారు. బలగం జనార్ధన్ గౌడ్ తదితరులు నటించారు. మధుర ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై తెరకెక్కించిన ఈ వెబ్ సీరీస్ తొలి సారిగా తెలంగాణ గ్రామీణ యాసతో తెరకెక్కించామని దర్శకుడు శివ క్రిష్ణ తెలిపారు.


## 'రాజు గాని సవాల్' టీజర్ రిలీజ్



లెలిజాల రవీందర్, రితికా చక్రవర్తి హీరో హీరోయిన్ లుగా నటిస్తున్న సినిమా 'రాజు గాని సవాల్'. ఈ చిత్రాన్ని లెలిజాల కమల ప్రజాపతి సమర్పణలో, ఎల్ ఆర్ ప్రొడక్షన్ బ్యానర్ పై లెలిజాల రవీందర్ నిర్మిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా రక్షా బంధన్ పండుగ సందర్భంగా ఆగస్టు 8న శ్రీ లక్ష్మి పిక్చర్స్ ద్వారా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. 'రాజు గాని సవాల్' సినిమా టీజర్‌ను నటుడు జగపతి బాబు రిలీజ్ చేశారు. అనంతరం ఫిల్మ్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో ప్రముఖ నిర్మాత దామోదర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

### యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణలో

## ది పారడైజ్



నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న 'ది పారడైజ్' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం ఈ సినిమా కోసం రామోజీ ఫిలిం సిటీలో భారీ యాక్షన్ ఎపిసోడ్ ను చిత్రీకరిస్తున్నారు. ఎస్ఎల్‌వీ సినిమా బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రత్యేకంగా వేసిన మ్యాసీవ్ సెట్ లో ఫైట్ మాస్టర్ రియల్ సతీష్ సారథ్యంలో భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను చిత్రీకరిస్తున్నారు. ఈ హైఇన్‌టెన్సిటీ యాక్షన్ సీక్వెన్స్ కోసం రియల్ సతీష్ మాస్టర్‌తో పాటు ఫారిన్ స్టంట్ మాస్టర్స్ కూడా వర్క్ చేస్తున్నారు. ఈ యాక్షన్ సీక్వెన్స్ సినిమాలో హైలెట్‌గా ఉండనుంది. 'ది పారడైజ్' సినిమాను పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్నారు. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ 8 భాషలలో 2026 మార్చి 26వ తేదీన ఈ సినిమాను థియేటర్లలో విడుదల చేయనున్నారు.

## నిర్మాతగా.. కిరణ్ అబ్బవరం



షార్ట్ ఫిలింస్ స్థాయి నుంచి హీరోగా తనకొక స్థాయి సంపాదించుకునే వరకు ఎదిగారు కిరణ్ అబ్బవరం. ఈ క్రమంలో ఫిలింమేకింగ్ లో ఆయన ఎన్నో ఇబ్బందులు, కష్టాలు చూశారు. ఎవరి సపోర్ట్ లేకుండా గుర్తింపు తెచ్చుకున్నారు. స్ట్రాంగ్ కంటెంట్, ఇన్నోవేటివ్ మేకింగ్ తో మూవీస్ చేస్తున్నారు. ఒక్క ఛాన్స్ కష్టాలు తెలిసిన హీరో కాబట్టే తనలా ఏ బ్యాక్ గ్రౌండ లేకుండా ఇండస్ట్రీలో పేరు తెచ్చుకోవాలని ఆశపడే ఔత్సాహిక నటీనటుల, సాంకేతిక నిపుణులకు అండగా నిలుస్తానని దిల్ రూబా సినిమా ఈవెంట్స్ లో చెప్పారు కిరణ్ అబ్బవరం. చెప్పినట్లే తన మాట మీద నిలబడుతూ కొత్త వాళ్లతో తన సొంత బ్యానర్ పై మూవీ ప్రొడ్యూస్ చేస్తున్నారాయన.
తన గత సినిమాల్లో కెమెరా అసిస్టెంట్‌గా పనిచేసిన సాయి తేజ్ ను హీరోగా పరిచయం చేస్తూ సినిమా నిర్మిస్తున్నారు కిరణ్ అబ్బవరం. తన మూవీస్ కు ఆన్ లైన్ ఎడిటింగ్ చేసిన టెక్నీషియన్ ముని కి దర్శకుడిగా అవకాశం కల్పిస్తున్నారు.

## 'ఓ భామ.. అయ్యో రామ' ప్రీ రిలీజ్ ఈవెంట్



సుహాస్ హీరోగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓ భామ అయ్యో రామ'. మలయాళంలో జో అనే చిత్రంతో పరిచయమైన నటి మాళవిక మనోజ్ ఈ చిత్రంతో తెలుగులో కథానాయికగా పరిచయమవుతోంది. రామ్ గోధల దర్శకుడు. వీ ఆరట్స్ బ్యానర్‌పై హరీష్ నల్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జూలై 11న చిత్రం ప్రపంచ వ్యాప్తంగా థియేట్రిలక్ రిలీజ్ కానుంది. కాగా ఈ చిత్రం ప్రీరిలీజ్ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు రాకింగ్ స్టార్ మంచు మనోజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకలో మంచు మనోజ్ బిగ్ టికెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంచు మనోజ్ మాట్లాడుతూ 'సుహాస్ ఎటువంటి నేపథ్యం లేకుండా హీరోగా ఎదిగాడు. నేపో కిడ్స్ అయినా సినిమా పరిశ్రమలో కష్టపడాల్సిందే. కష్టపడితేనే విజయం. నేను ఈ విషయాన్ని ఓ నెపో కిడ్‌గా చెబుతున్నా. యూట్యూబ్ నుంచి హీరోగా ఎదిగిన సుహాస్ జర్నీ ఎంతో ఇన్స్పిరేషన్. తమిళంలో విజయ్‌సేతుపతిలా తెలుగులో సుహాస్ కూడా అలాంటి స్టారే.. అన్ని తరహా సినిమాలను చేస్తాడు. ఇండస్ట్రీలో సక్సెస్ కావడం కష్టమే. కాని కష్టపడితే సక్సెస్ సాధిస్తాం. ఈ సినిమా విజయం సాధించి నిర్మాతలకు, దర్శకుడికి బ్రేక్ నివ్వాలన్నారు. హీరో సుహాస్ మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం టీమ్ అంతా ఎంతో కష్టపడ్డారు. అందరూ ఈ సినిమా చూసిన తరువాత మాళవిక ప్రేమలో పడిపోతారు. అలీ, అనిత, పృథ్వీ లాంటి సీనియర్ ఆర్టిస్టలతో నటించడం ఎంతో హ్యాపీగా ఉంది. ప్రతి అబ్బాయి సక్సెస్‌ఫుల్ లైఫ్‌లో తల్లి, భార్యలు ఇద్దరూ ఎంతో కీలకంగా ఉంటారు.



# స్థానికం REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్



## దివ్యాంగులకు మోటార్ సైకిళ్లు పంపిణీ

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సంక్షేమ శాఖ మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా లోని అర్హులైన దివ్యాంగులకు రెండు మోటార్ వెహికిల్స్‌ను కొడిశలకుంటలోని బానోత్ యాకూబ్, నర్సాపూర్ గ్రామానికి చెందిన శ్రీహరిలకు మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, గ్రంథాయల సంస్థ చైర్మన్ రవిచందర్‌లతో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి టి రవి, సిడిపిఓ శిరీష, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారుల, లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఇంగ్లీష్‌పై పట్టు సాధించాలి

మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** ప్రైమరీ స్కూల్ నుండే విద్యార్థులు ఇంగ్లీష్‌పై పట్టు సాధించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ములుగు జిల్లా విద్యా శాఖ, దిశా ఫౌండేషన్, ఇఎల్‌ఎఫ్ ఇంగ్లీష్ సౌజన్యంతో రెండవ దశలో జిల్లాలోని 50 ప్రాథమిక పాఠశాలల్లో లర్న్ టు రీడ్ 90 రోజుల విద్యా కార్యక్రమాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్‌లతో కలిసి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమం, విద్యార్థులు ఇంగ్లీష్‌లో మాట్లాడడం, ఆంగ్ల నైపుణ్యాల సాధన కోసం ములుగు జిల్లాలో విద్యాశాఖ, దిశా ఫౌండేషన్ వారి సౌజన్యంతో ఇంగ్లీష్ బోధన కోసం చేపట్టిన కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాలని అన్నారు. దిశా స్వచ్ఛంద సంస్థ వారి సేవలను, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి దశలో ఉపాధ్యాయులు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆశించిన ఫలితాలు సాధించినందుకు ఈ సంవత్సరం కూడా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తూ మరో 50 పాఠశాలల్లో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు సహకరించి దిశా ఫౌండేషన్ సహకారంతో బోధించి పిల్లలకు ఆంగ్లభాషపై పట్టు సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ అర్షం రాజు, సెక్టోరల్ అధికారులు రమాదేవి, గుళ్ళపెల్లి సాంబయ్య, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఐశ్వర్య, మంజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి స్వాధీనం

నలుగురు నిందితుల అరెస్ట్ : సిఐ శ్రీనివాస్ గౌడ్ వెల్లడి



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైల్లో గంజాయి తరలిస్తున్న నలుగురిని ఆర్పిఎఫ్, డ్రగ్ కంట్రోల్ బృందం అదుపులోకి తీసుకొని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన బుధవారం వరంగల్ రైల్వే స్టేషన్ లో జరిగింది. వివరాల్లోకి వెళితే వరంగల్ ఆర్పిఎఫ్ సిఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన కథనం ప్రకారం. ట్రైన్ నెంబర్. 11020 భువనేశ్వర్ నుంచి ముంబై వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో డ్రగ్ కంట్రోల్ బృందం సీఐ సతీష్, ఎస్సై పూర్ణచందర్, ఆర్పిఎఫ్ ఏఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బందితో కలిసి విస్తృతంగా తనిఖీలు చేపట్టాము. ఈ తనిఖీలో మహారాష్ట్ర డైసర్ కు చెందిన కూలీ ఎండి అష్రఫ్ షేక్ (40), డోంగ్రి శాంతినగర్ కు చెందిన రహీం బాబన్ పటేల్ (30), ఉత్తర ప్రదేశ్, ప్రయాగరాజ్ జిల్లాకు చెందిన రాజు ఠాకూర్ (24), మహారాష్ట్ర రత్నగిరి దైసార్ కు చెందిన ప్రవీణ్ శ్యామ్ తవుడే (39) అనుమానాస్పదంగా కనిపించారు. వీరి వద్దనున్న బ్యాగులను తనిఖీ చేయగా అందులో 8.7 కిలోల ఎండు గంజాయి లభించింది. వెంటనే గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులను అదుపులోకి తీసుకొని ఆర్.పి.ఎఫ్ పోలీస్ స్టేషన్కు తరలించారు. నిందితుల వివరాలను సేకరించి డ్రగ్ కంట్రోల్ బృందానికి అప్పగించినట్లు ఆర్పిఎఫ్ సిఐ తెలిపారు. రైళ్లల్లో గాని లేదా రైల్వే ప్రాంగణాల్లో అనుమానిత వ్యక్తులు తారసపడ్డ లేదా మాదకద్రవ్యాల రవాణా చేస్తున్నట్లు తెలిసిన వెంటనే రైల్వే అధికారులు కానీ పోలీసులకు గాని సమాచారం ఇవ్వాలని ప్రయాణికులను ఆయన కోరారు.

## వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని పునరుద్ధరించాలి

హనుమకొండలో ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల ధర్నా

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన కార్మిక నల్ల చట్టాలను ఎత్తివేయాలని, దేశంలో వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని పునరుద్ధరించాలని ఐజెయు జాతీయ నాయకులు దాసరి క్రిష్ణారెడ్డి, టియుడబ్ల్యుజె రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు డిమాండ్ చేశారు. బుధవారం దేశవ్యాప్తం గా కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపునకు టియుడబ్ల్యుజె (ఐజెయు) నాయకులు సంపూర్ణ మద్దతు తెలుపుతూ హనుమకొండలో జాతీయ కార్మిక సంఘాలు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక ఏకశిలా పార్క్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు చేరుకున్న అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి క్రిష్ణారెడ్డి, గాడిపెల్లి మధు మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, వేతన చెల్లింపుల చట్టాలతో పాటు 44 చట్టాలను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా కార్మిక సంఘాలు చేస్తున్న ఆందోళనకు మద్దతు ఇస్తున్నట్లు తెలియజేశారు. ఈ ర్యాలీ, ధర్నాలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రధాన కా ర్యదర్శి తోట సుధాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు, ప్రెస్‌క్లబ్ సహాయ కార్యదర్శి డాక్టర్ విష్ణు వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

### సార్వత్రిక సమ్మెకు టిడబ్ల్యుజెఎఫ్ సంఘీభావం

దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపునకు సంఘీభావంగా హనుమకొండ ఏకశిలా పార్కు నుండి హనుమకొండ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించినట్లు హనుమకొండ జిల్లా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) జిల్లా అధ్యక్షులు టీవీ రాజు, ప్రధాన కార్యదర్శి అంతడుపుల శ్రీనివాస్ తెలిపారు. ఈ ర్యాలీ, ధర్నా కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దామెర రాజేందర్, కోశాధికారి ఇసంపల్లి రమేష్, సంయుక్త కార్యదర్శి ఈర్ల తిలక్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి దాసరి విజయ్ కుమార్, కార్యవర్గ సభ్యులు శంకర్‌తదితరులు పాల్గొన్నారు.




# కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి

● అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి ● సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పంజాల రమేష్




**ప్రజాపక్షం/ నర్సంపేట :** నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పంజాల రమేష్, ఎఐఎఫ్‌టియు న్యూ రాష్ట్ర అధ్యక్షుడు మోడం మల్లేశం, బిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఇసంపెల్లి బాబు, ఎఐటియుసి జిల్లా డిప్యూటీ కార్యదర్శి గుంపెల్లి మునీశ్వర్, హమాలి యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొల్లూరి లక్ష్మీ నారాయణలు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా నర్సంపేట పట్టణంలో అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ రోడ్డు కూడలి నుండి జయలక్ష్మి సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బుధవారం అనంతరం ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో త్యాగాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను కార్పొరేట్ శక్తులకు బడా పెట్టుబడిదారులకు ఉపయోగపడే విధంగా కార్మిక చట్టాల సవరణ చేయడం సరికాదని, రోజుకు ఎనిమిది గంటల పని విధానానికి స్వస్తి పలికి 10 గంటలు పని చేయాలని చెప్పడం కార్మిక వర్గాన్ని శ్రమదోపిడి కి గురి చేయడమని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని రైతులపై బలవంతంగా రుద్దుతున్న నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పాలడుగుల రమేష్, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లలిత, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గడ్డం సమ్మయ్య, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు హనుమకొండ శ్రీధర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి బాలకృష్ణ, సిఐటియూ పట్టణ కార్యదర్శి రాజు, మున్సిపల్ యూనియన్ యశోద, ఆశా యూనియన్ సుజాత, ఎఐఎఫ్‌టియు నాయకులు జనార్ధన్, రమేష్, ఎఐటియుసి నాయకులు గోవర్ధనచారి, ఎడ్ల నాగులు, కొత్తగట్టు నరసింహం, కిషోర్, కనక మల్లు, సిపిఐ కార్యవర్గ సభ్యుడు అక్కపెల్లి రమేష్, ఐఎఫ్‌టియు నాయకులు సుమన్, మొగిలి, బాలకృష్ణ, మల్లయ్య, స్వరూప, పివైఎల్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, టియుసిఐ జిల్లా కార్యదర్శి అడ్డూరి రాజు, జిల్లా నాయకులు కట్టన్న తదితరులు పాల్గొన్నారు.




## హమాలీ కార్మికులకు పార్లమెంట్‌లో సమగ్ర సంక్షేమ చట్టం చేయండి

ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షుడు పనాస ప్రసాద్

**ప్రజాపక్షం/ వరంగల్ :** హమాలీ కార్మికుల సంక్షేమం కోసం పార్లమెంటులో సమగ్ర సంక్షేమ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు పనాస ప్రసాద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా వరంగల్‌లోని పాత రామా టాకీస్ నుండి పాత బీట్ బజార్ మీదుగా వరంగల్ చౌరస్తా వరకు బుధవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్న ఇంతవరకు హమాలీల అభివృద్ధి కోసం పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సహించరానిదన్నారు. కేవలం తమ రెక్కల కష్టంతో అనేక రకాల ఇబ్బందుల తో జీవితాలను కొనసాగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అన్ని రకాల హమాలీల అభివృద్ధి కోసం సమగ్ర సంక్షేమ బోర్డును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టం చేసి అమలు చేయాలని, లేదంటే హమాలీ కార్మికులందరిని ఐక్యం చేసి రానున్న రోజుల్లో ఉద్యమాలను ఉధృతం చేస్తామని పాలకులను హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ మాట్లాడుతూ ఇప్పటివరకు హమాలీ కార్మికులకు, ఎలాంటి కార్మిక చట్టాలు లేవని, హమాలీల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని విడనాడి హమాలీల అభివృద్ధి కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనలో ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి ఎండి యాకూబ్, నాయకులు శంకర్, గొల్లపల్లి రమేష్, కోల రాజ్ కుమార్, రమేష్, సోమయ్య, నగేష్, దేవేందర్, రాజేష్, సుధాకర్, రవి, తదితరులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ లబ్ధిదారులు వెంటనే ఇండ్ల నిర్మాణం ప్రారంభించాలి

క్షేత్ర స్థాయి పరిశీలనలో జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్

**ప్రజాపక్షం జనగామ ప్రతినిధి :** ఇందిర మ్మ మంజూరు పత్రాలు తీసుకున్న లబ్ధిదారులు వెంటనే ఇంటి నిర్మాణాలు చేపట్టాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. ఇసుక, కంకర లోడింగ్‌కు అదనపు చార్జీల పేరుతో అదనంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం స్టేషన్ ఘనపూర్ మండలంలోని చాగల్లు గ్రామంలో హౌసింగ్ పిడి మాతృనాయక్‌తో కలిసి ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఇసుక, కంకర, సిమెంట్ ఎక్కడి నుండి తెస్తున్నారే విషయాన్ని లబ్ధిదారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక, కంకర, స్టీల్ పేరుతో లబ్ధిదారుల నుండి అదనంగా డ బ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇంటి నిర్మాణానికి సరిపడగా ఇసుక స్టేషన్‌ఘనపూర్‌లోని కొత్తపల్లి, తాటికొండ రీచులలో సంవృద్ధిగా ఉం దని, ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందన్నారు. ఇసుక లోడింగ్ రవాణా మాత్రమే లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుందనారు. ఈ విషయంలోఏ లబ్ధిదారుల నుండి అదనంగా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దశల వారిగా పూర్తి చేసుకున్న నిర్మాణాలకు ప్ర తి సోమవారం లబ్ధిదారుల ఖాతాలో నగ దు జమ చేయడం జరుగుతుందన్నారు. ఇసుకను లబ్ధిదారులకు వేగంగా అందించేందుకు కూపన్స్ విధానమలు అమలు పరుస్తున్నామని మరింతం వేగం చేసేందుకు మొబైల్ ద్వారా కూడా కూపన్ ఇచ్చే వెసులుబాటు కల్పిస్తామన్నారు. అనంతరం మున్సిపాల్టీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగం అయ్యేలా సిబ్బందిని నియమించి ఎప్పటికి అప్పుడు పర్యవేక్షించాలని, మున్సిపాల్టీ ఆదాయం సమకూర్చే ట్రేడ్ లైసెన్స్, అడ్వటైజ్‌మెంటడ్ హోర్డింగ్ రేంఎట్, ప్రాపర్టీ ట్యాక్స్, హాస్పటల్, రెస్టారెంట్ తదితర కమర్షియల్ రెంట్ వాటర్ ట్యాక్ లక్ష్యానికి తగ్గట్టు వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి మాతృనాయక్, కమీషనర్, తహాశీల్దార్, ఎంపిడిఓ పాల్గొన్నారు. అనంతరం స్టేషన్‌ఘనపూర్ మండలంలోని హైస్కూల్‌ను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ బుధవారం సందర్శించారు. 9,10 తరగతుల విద్యార్థులలో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. యూనిఫామ్స్, నోట్ బుక్స్ అందరికి వచ్చాయా, భోజనం బాగుందా, చదువులు ఎలా ఉంది అని అడగి తెలుసుకున్నారు. తర్వాత స్టేషన్‌ఘనపూర్ మండలం ఇప్పగూడెం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఓపి రిజిస్టర్ పరిశీలిస్తూ ప్రతి రోజు ఎంత మంది వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం వంద రోజులు అమలు తీరును పరిశీలించారు. ఎన్‌సిడిలో ఉన్న వారికి మందులు తప్పనిసరిగా ఇవ్వానలి, టిబి రమిత సమాజం కోసం కృషి చేయాలన్నారు.



## అభివృద్ధిని ఓర్వలేకే బిఆర్‌ఎస్ నాయకుల విమర్శలు

- స్మార్ట్ సిటీ నిధులను సద్వినియోగం చేయలేని దుస్థితిలో గత పాలకులు
- వెనక్కి వెళ్లిన స్మార్ట్ సిటీ నిధులను అభివృద్ధి చేస్తున్న ఘనత నాయినిదే
- మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేటర్‌లు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక ప్రతిపక్షపార్టీ కార్పొరేటర్లు అవాకులు, చెవాకులు పేలుతూ, ప్రజలను తప్పదో పట్టిస్తూ బురదల్లే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు మండిపడ్డారు. బుధవారం హనుమకొండలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ బిఆర్‌ఎస్ కార్పొరేటర్లది ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని విమర్శించే స్థాయి కాదని, ఎమ్మెల్యేను విమర్శించడానికి స్థానిక కార్పొరేటర్లు లేరన్నట్టుగా పక్క నియోజకవర్గ కార్పొరేటర్‌లు మాట్లాడటం హాస్యాస్పదం అని అన్నారు. మాజీ ఎమ్మెల్యేను సమర్ధించే స్థానిక నాయకత్వం వారి పార్టీలో లేకపోవడం చాలా దురదృష్ట కరమని తెలిపారు. గత పాలకుల మాదిరి కాకుండా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్ని ప్రాంతాలను, స్థానిక అవసరాలను బట్టి నిధులను కేటాయిస్తున్నారని, పార్టీలకు అతీతంగా పాలన, అభివృద్ధి సాగిస్తున్నారని అన్నారు. బిఆర్‌ఎస్ కార్పొరేటర్లు వారి వార్డులలో కేటాయించిన నిధులకు భహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. గతంలో లేని విధంగా కాంగ్రెస్, బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీల కార్పొరేటర్‌ల వార్డులలో సమానంగా నిధులను కేటాయించారని తెలిపారు. ఇటీవలే జరిగిన కార్పొరేషన్ సమావేశంలో ప్రజా సమస్యలపై స్పందించే సహనం లేని ప్రతిపక్ష కార్పొరేటర్లు బయటకు వెళ్లి మాట్లాడటం సిగ్గుచేటు అని, గత ప్రభుత్వం హయాంలో కేంద్రం నుంచి వచ్చిన స్మార్ట్ సిటీ నిధులను సద్వినియోగం చేయకుండా వెనక్కి పంపిన చరిత్ర మీది అని మండిపడ్డారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి 300 కోట్ల స్మార్ట్ సిటీ నిధులను వెనక్కి తీసుకువచ్చి అమలు చేస్తున్నారని తెలిపారు. బిఆర్‌ఎస్ కార్పొరేటర్ డివిజన్‌లలో గడిచిన 18 నెలల్లో 45వ డివిజన్‌లో రూ.4 కోట్లు, డిప్యూటీ మేయర్ డివిజన్‌లో రూ.2.46కోట్లు, పరకాల నియోజవర్గాని కి చెందిన బిఆర్‌ఎస్ 3 డివిజన్‌లలో రూ.9 కోట్ల నిధులను కేటాయించిన విషయాన్ని ఆధారాలతో మీడియా ముఖంగా తెలిపారు. భద్రకాలి చెరువు, అభివృద్ధి విషయంలో ఈ ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని, ఆన్ లైన్ ద్వారా జరిగే టెండర్ పక్రియలో ఎవరైనా పాల్గొనవచ్చు అని, ఈ విషయం తెలియని మీరు మంత్రి పొంగులేటి బంధువులు పనిచేస్తున్నారని అనడం మీకు పరిజ్ఞానలోపం ఉందని, మాడ విధుల అభివృద్ధిలో జరుగుతున్న పురోగతిపై వస్తున్న ఆదరణ ఓర్వడం లేదని విమర్శించారు.ఈ మీడియా సమావేశంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు సయ్యద్ విజయ శ్రీ రజాలి, జక్కుల రవీందర్ యాదవ్, వేముల శ్రీనివాస్, ఏనుగు మానస రాంప్రసాద్, మామిళ్ల రాజు, నెక్కొండ కవిత కిషన్,గుంటి శ్రీనివాస్, చీకటి శారద ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు

పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి



**ప్రజాపక్షం/పరకాల/ఆత్మకూరు :** పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం పరకాల టౌన్, మండలం, నడికుడ మండలాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పరకాల నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు 4,030 మందికి రూ.27,63,72,700లు అందజేశామన్నారు. ఇందులో కళ్యాణలక్ష్మి ద్వారా 1950 మందికి రూ. 19,52,26,200ల ఆర్థికసాయం, సిఎంఆర్‌ఎఫ్ ద్వారా 1994 మందికి రూ. 6,39,33 వేలు అందజేశామన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామన్నా రు. గత ప్రభుత్వంలో లబ్ధిదారులకు కనీసం సిఎంఆర్‌ఎఫ్ నిధులు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పెండింగ్ వాటిని కూడా మంజూరు చేశామన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. నిరుపేదలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల,నడికుడ మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ప్రజారోగ్యంపై ప్రజా ప్రభుత్వం సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని భూపాలపల్లి మండలం ఆజంనగర్ గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. గ్రామంలో జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు రూ.16 లక్షలతో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్ర భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆర్టికల్ 275(I) నిధులు రూ.14 లక్షలతో ప్రైమరీ హెల్త్ సెంటర్లో నూతనంగా నిర్మించిన బర్త్ వెయిటింగ్ గదిని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి సిఎం గా బాధ్యతలు చేపట్టిన తరువాత మునుపెన్నడూ లేనివిధంగా ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. అదేవిధంగా, ఆసుపత్రులకు నిధుల కేటాయింపులు, నియామకాలపై దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఆసుపత్రిలో రికార్డులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆసుపత్రిలో అన్ని వివరాలను సక్రమంగా రికార్డులో రోజు వారిగా నమోదు చేయాలని డాక్టర్లకు, సిబ్బందికి సూచించారు.

### పంబాపూర్ భీమ్ ఘనపూర్ చెరువు నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే

భూపాలపల్లి మండలం పంబాపూర్ గ్రామంలోని భీమ్ ఘనపూర్ చెరువు నీటిని దిగువన ఉన్న పంట పొలాలకు నీటిపారుదల శాఖ ఈఈ ప్రసాద్ ఇతర అధికారులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భీమ్ గన్పూర్ చెరువు తూము వద్ద ఎమ్మెల్యే టెంకాయ కొట్టి, చెరువులోకి పూలు చల్లారు. అనంతరం తూము గేట్ వాల్వ్‌ను తిప్పి కిందికి నీటిని వదిలారు. అనంతరం పలువురు ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి సన్మానం చేశారు. చెరువులో నుండి నీటిని విడుదల చేయడంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు చల్లూరి మధు, ఆర్టిఏ మెంబర్ సుంకరి రామచంద్రయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు అంబాల శ్రీనివాస్, కొమురయ్య, మాజీ సర్పంచ్ కొత్త వెంకన్న స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## భూ భూరతి పైలెట్ ప్రాజెక్టులో 1,841 దరఖాస్తుల ఆమోదం

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** భూ భారతి ఫైలట్ ప్రాజెక్టులో భాగంగా ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో ఏప్రిల్ 17వ తేదీ నుండి 30వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు 9 రెవెన్యూ గ్రామాలలో నిర్వహించి రైతుల నుండి 4555 ఆర్జీలనున స్వీకరించడమైందని ఆర్‌డిఓ వెంకటేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి దరఖాస్తులను 9 రెవెన్యూ బృందాలను ఏర్పా టు చేసి క్షేత్రస్థాయి రికార్డుల పరిశీలన అనంతరం 1841 దరఖాస్తులను ఆమోదించడం జరిగింది. అంగీకరించబడిన పిటిషన్లలో 1374 పిటిషన్లు సాధాబైనామా పిటిషన్లు, ప్రస్తుతం ఈ సాదాబైనామా ఆర్జీల ప్రక్రియ ప్రస్తుతం రాష్ట్ర ఉన్నత న్యాయస్థాన పరిధిలో ఉందని, ఇవి కాక 513 పిఓటి దరఖాస్తులు, 143 నూతన అసైన్‌మెం ట్ దరఖాస్తుదారులను అర్హులుగా గుర్తించడం జరిగిందని, ఇట్టి విషయంపై తదుపరి ప్రభుత్వ ఆదేశానుసారం చర్య లు తీసుకొనబడునని ఆయన తెలిపారు. ఇట్టి విషయంలో రైతులందరికి ఆ మోదింపబడిన దరఖాస్తులు సాదాబైనామా మినహా అన్ని భూ భారతి పోర్టల్‌లో అప్‌డేట్ చేయబడినవి అని, రైతు లు తమ తమ పిటిషన్ల స్థితిగతులను తెలుసుకోవాలంటే, 9985839187కు ఉదయం 10.30 నుండి సాయం త్రం 5 లోపు ఫోన్ చేయడం ద్వారం లేదా నేరుగా వెంకటాపూర్ తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించి సందేహాలు నివృతి చేసుకోవచ్చని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మౌలిక వసతులకు నివేదికను అందజేయాలి

వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద

**ప్రజాపక్షం / వరంగల్ ప్రతినిధి :** వరంగల్ సూపర్ స్పెషాలిటీ నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసి ఆయా క్లినికల్ విభాగాల్లో వసతుల కేటాయింపునకు సంబంధించిన వివరాలతో కూడిన సూక్ష్మ ప్రణాళిక నివేదికను 15 రోజుల్లో సమర్పించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వైద్య అధికారులను ఆదేశించారు. బుధవారం వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లోని సమావేశపు హాలులో వైద్యాధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమావేశమై నిర్మాణ పనులను, పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీ, రేడియాలజీ, పాథాలజీ, ఫోరెన్సిక్, అనిస్తేషియా, బయో కెమిస్ట్రీ, ఫారెన్సిక్ మెడిసిన్, తదితర క్లినికల్ విభాగాలకు భవనాలలో కేటాయించిన అంతస్తుల వారిగా గదులు, ఇతర విభాగాల ఏ ర్పాటు కొరకు కావలసిన గదులు, సంబంధిత క్లినికల్ విభాగాలకు అవసరమగు మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం సూపర్ స్పెషాలిటీ భవనంలో ప్రాథమికంగా కేటాయించిన ఆసుపత్రిలోని వివిధ అంతస్తులలో వివిధ విభాగాల వైద్యాధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో కలెక్టర్ క్షేత్ర స్థాయిలో అంతస్తుల వారిగా ఆయా క్లినికల్ విభాగాలకు కేటాయించిన గదులను పరిశీలించి సమర్థ వంతంగా నిర్వహించుటకు కావలసిన సదుపాయాల గురించి సూక్ష్మ ప్రణాళిక నివేదికను సమర్పిచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ వివిధ క్లినికల్ విభాగాల కేటాయింపునకు కావలసిన అంశాలను తెలియజేస్తూ సూక్ష్మ ప్రణాళికను సిద్ధం చేసి ఉంచాలని ఆయా శాఖాధిపతులకు సూచించారు. ఎంజిఎం ఆసుపత్రిలో పనిచేస్తున్న వివిధ పరికరాలను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజిఎం సుపరింటెండెంట్ కిశోర్, ఎల్ అండ్ టి అధికారి శరవరన్, జిల్లా ఆర్ అండ్ బి. అధికారి రాజేందర్, టీఎస్ ఎంఐడిసి డీఈ, తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలి

ఎఐటియుసి రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ
సిహెచ్.సీతామహాలక్ష్మి

**ప్రజాపక్షం/కామేపల్లి :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సిహెచ్.సీతామహాలక్ష్మి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం కామేపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐసిడిఎస్ శాశ్వత డిపార్ట్‌మెంట్‌గా అమలు చేయాలన్నారు. కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తుందని విమర్శించారు. అనంతరం ఐసిడిఎస్ సిడిపివో దయామణికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



## అమరుల ఆశయ సాధనకు పునరంకితమవుదాం : బాగం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజల హక్కులు, స్వేచ్ఛ, సంక్షేమం కోసం పోరాడిన అమరుల ఆశయ సాధనకు పునరంకితమవుదామని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. త్యాగాల బాటలో నడిచి పేదల పక్షాన పనిచేసిన ఐలూరి శ్రీనివాసరెడ్డి ధన్యుడు అన్నారు. వైరాలోని మధిర రోడ్డులో ఐలూరి శ్రీనివాసరెడ్డి స్మారక స్తూపాన్ని పునర్ నిర్మించగా బుధవారం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ ఐలూరి శ్రీనివాసరెడ్డి కమ్యూనిస్టు పార్టీలో కార్యకర్తలా పనిచేశారని, యువజన ఉద్యమంలో కూడా మధిర డివిజన్ నాయకునిగా పనిచేశారన్నారు. 30 సంవత్సరాల క్రితం విద్యుత్‌షాక్‌తో మరణించిన శ్రీనివాసరెడ్డి నేటికి ప్రజల మదిలో ఉన్నారన్నారు. ఆయన కుటుంబ సభ్యులు పార్టీకి అంకితమై పనిచేయడం అభినందనీయమని, ముఖ్యంగా శ్రీనివాసరెడ్డి తనయుడు రాకేష్‌రెడ్డి తీరు అభినందనీయమన్నారు. పాలకవర్గాలు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నాయని ఆయన తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడటమే అమరులకు మనమిచ్చే ఘన నివాళి అని హేమంతరావు తెలిపారు. స్తూప ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, మండల కార్యదర్శి యామాల గోపాలరావు, మిట్టపల్లి రాఘవరావు, ముఠా కొండ, గారపాటి అశోక్, యాకూబ్ అలీ, అమరనేని పరశురాములు, రాకేష్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## నూతన మొబైల్ ఓనర్స్ అండ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఎన్నిక

**ప్రజాపక్షం/మధిర రూరల్ :** మధిర పట్టణంలోని మొబైల్ షాప్ ఓనర్స్ అండ్ వర్కర్ల నూతన కమిటీని విఎస్ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగింది. కమిటీ అధ్యక్షునిగా కంచర్ల ఆనంద్‌కుమార్‌ను, ఉపాధ్యక్షులుగా వంశీ, శివారెడ్డి, కార్యదర్శిగా సుమన్, సురేష్, జాయింట్ సెక్రటరీగా చారి, బాజీ, కోశాధికారులుగా హరికృష్ణ, మాణిక్యాలరావు, గౌరవ సలహాదారులుగా సలీం, శ్రీకృష్ణ, రవిలను, కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవటం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు ఆనంద్ మాట్లాడుతూ ప్రతిఒక్క షాప్ ఓనర్, టెక్నిషియన్స్ యూనియన్ అభివృద్ధి కోసం పనిచేయాలని, కస్టమర్లకు మెరుగైన సేవలు అందించాలని, యూనియన్‌లో సభ్యత్వం తీసుకుని యూనియన్‌ను బలోపేతం కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రతిఒక్క టెక్నిషియన్‌కు ఐడెంటిటి కార్డు కూడా ఇవ్వడం జరుగుతుందని, ప్రతిఒక్కరూ యూనియన్ నిబంధనలకు కట్టుబడి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొబైల్ షాప్ ఓనర్స్, వర్కర్లు పాల్గొన్నారు.

## రైలు కిందపడి బిల్ కలెక్టర్ మృతి



**ప్రజాపక్షం/ మధిర :** రైలు కింద పడి బిల్ కలెక్టర్ మృతి చెందిన సంఘటన మధిర రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మధిర మున్సిపాల్టీలో బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న తాండ్ర అనిల్(35) మధిర రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు కింద పడి మృతి చెందాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్థాపానికి గురైన అనిల్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికులు తెలుపుతున్నారు. రైల్వే పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## ఆటోడ్రైవర్లకు ప్రత్యామ్నాయ మార్గం చూపాలి

**ప్రజాపక్షం/పినపాక :** తెలంగాణ రాష్ట్రంలో ఆటో కార్మికుల బతుకులు అగాధమయ్యాయని, పూట గడవని స్థితిలో ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తెలంగాణ జన సమితి పార్టీ పినపాక మండల అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం మండలంలో బయ్యారం క్రాస్ రోడ్‌లో ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్ల బతుకులు వీధినపడ్డాయని, ప్రభుత్వం ఆలోచించి ఆటోడ్రైవర్లకు ప్రత్యామ్నాయ మార్గం ద్వారా వడ్డీ లేని రుణాలు ఇచ్చి జీవనభృతి కల్పించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల పిల్లలకు స్కూల్ ఫీజులు కట్టలేక భార్యల తాళిబొట్లు తాకట్టు పెడుతున్నారని, ప్రభుత్వం ఇలాగే నిర్లక్ష్యం వహిస్తే ఎందరో ఆటో కార్మికుల జీవితాలు రోడ్డున పడే అవకాశం ఉందని, కార్మికులకు ఇక ఆత్మహత్యలు శరణ్యం మని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆటో డ్రైవర్ల సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. త్వరలోనే ఆటో డ్రైవర్లు ఆటో యూనియన్‌తో కలిసి తమ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాముని కలుస్తామని బత్తుల వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

## ఎరువుల కొరత లేదు

జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** రైతుల అవసరాలకు సరిపడా ఎరువుల అందుబాటులో ఉన్నాయని, ఎరువుల కొరత లేదని జిల్లా వ్యవసాయాధికారి డి. పుల్లయ్య తెలిపారు. బుధవారం పట్టణం, మండల పరిధిలోని రామానగరంలో ఉన్న పలు ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎరువుల డీలర్లు ఎంఆర్పికి మించి, ఒక్క రూపాయి కూడా అధిక ధరలకు విక్రయించ రాదని, ఒక ఎరువు కొంటే, మరొకటి కొనాలని రైతులను వత్తిడి చేయ వద్దని, రైతులు అడిగిన ఎరువులు మాత్రమే ఇవ్వాలని డీలర్లు ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎరువుల దుకాణాలు గోదాంలను తనిఖీ చేసి నిల్వల వాటివ్యత్యాసం, ఇన్వాయిస్ లు, ఫామ్ ఓలు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వై. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# పోరాడి హక్కులు సాధించింది కమ్యూనిస్టులే

వైరా మండల మహాసభలో
సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి
దండి సురేష్





**ప్రజాపక్షం/ఖమ్మం :** హక్కుల కోసం పోరాడి సాధించింది కమ్యూనిస్టులేనని కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. అధికారం లేకపోయినా ప్రజలపక్షాన నికరంగా పోరాడి సమస్యల పరిష్కారానికి కృషి చేసేది కమ్యూనిస్టులేనన్నారు. వైరా మండల సిపిఐ 17వ మహాసభ బుధవారం మిట్టపల్లి రాఘవరావు, అమరనేని పరశురాంలు అధ్యక్షవర్గంగా వ్యవహరించగా వైరాలో జరిగింది. సభకు ముఖ్య అతిథిగా హాజరైన సురేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్య అనంతరం ప్రజల కోసం పోరాడిన చరిత్ర సిపిఐ సొంతమన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే ఆంగ్లేయులపై తిరుగుబాటు చేసి సంపూర్ణ స్వాతంత్ర్యానికి కమ్యూనిస్టులు పిలుపు నిచ్చారని ఆయన గుర్తుచేశారు. సిపిఐ జిల్లా మహాసభలు 19, 20 తేదీల్లో మధిరలో జరగనున్నాయని, 600 మంది ప్రతినిధులు మహాసభలకు హాజరుకానున్నారని సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా డేవిడ్ రాజు సిపిఐలో చేరారు.

**మండల కార్యదర్శిగా యామాల గోపాలరావు :** సిపిఐ వైరా మండల కార్యదర్శిగా యామాల గోపాలరావు మరోమారు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ వైరా మండలంలో పార్టీ విస్తృతి కోసం పనిచేయనున్నామన్నారు. పార్టీ కార్యాచరణను అమలు చేస్తామని గోపాలరావు తెలిపారు. మండల సహాయ కార్యదర్శిగా వెంకట నర్సింహారావు (ముఠా కొండ) ఎన్నికయ్యారు.

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన సార్వత్రిక సమ్మె బుధవారం విజయవంతం అయ్యింది. ఇందులో భాగంగా ఎస్‌బిఐ బ్యాంక్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని బంద్ చేయించారు. కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నినాదాలు చేశారు. అలాగే ఏదులాపురం బైపాస్ చౌరస్తా నుండి ఖమ్మం వరకు తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు సుదర్శన్‌రెడ్డి, ఏలూరి భాస్కర్, వెన్నం భాస్కర్, లక్ష్మ ణస్వామి, శ్రీను, ఉపేందర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఉన్నం రంగారావు, యడ్లపల్లి శంకరయ్య, చెరుకుపల్లి భాస్కర్, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, వెంపటి సురేందర్, దండి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

**నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి**



**ప్రజాపక్షం/ములకలపల్లి :** జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం ములకలపల్లి మండల కేంద్రంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మొహమ్మద్ యూసుఫ్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నరాటి రమేష్, ఎఐటియుసి మండల కార్యదర్శి జబ్బర్‌తో కలిసి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ 44 చట్టాలను 29 చట్టాలుగా చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తయారు చేసి కార్మికుల శ్రమను దోచుకోటానికి ప్రయత్నం చేస్తుందని, దీనిలో భాగంగానే నాలుగు లేబర్ కోడ్‌ను తెచ్చిన కార్మికుల శ్రమను దోచుకొనేటకు ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు నారం సునీత, పువాల శోభారాణి, పసుపులేటి శివలక్ష్మి, బయటి మాధవి పార్వతి, కుర్సా సుజాత, నాగమణి, నాగరాణి, మధ్యాహ్న భోజన కార్మికుల నాయకురాలు దాసుల పుష్పావతి, అలుగు శారత, మద్దెల పద్మ, శనగవరపు లలిత, పంచాయితీ కార్మికులు పాల్గొన్నారు.

లాభసాటి వ్యవసాయం

# ప్రభుత్వ ధ్యేయం

సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి
రైతులకు 100 శాతం రాయితీపై కంది, మినుము విత్తనాల పంపిణీ

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** వ్యవసాయాన్ని లాభసాటి చేసి రైతును రాజు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కంకణం కట్టుకుందని సత్తుపల్లి శాసనసభ్యుడు డా.మట్టా రాగమయి దయానంద్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ ఆహార భద్రత పథకం ద్వారా సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి మండలాలకు మంజూరైన 32 ప్యాకెట్స్ విబిఎన్ 8 రకం మినుము, ఎల్.ఆర్.జి 52 రకానికి సంబంధించిన 16 కంది విత్తనాల ప్యాకెట్‌లను 100 శాతం రాయితీపై రైతులకు ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్ పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రుణమాఫీ, రైతుభరోసా, రైతు బీమా లాంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని, కేవలం వరి సాగు కాకుండా అపరాలు, ఆయిల్ పామ్ లాంటి పంటలు సాగు చేసి వ్యవసాయం లో లాభాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా.మట్టా దయానంద్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్, ఎఒలు వై.శ్రీనివాసరావు, పి.రామ్మోహన్, ఎవిఎస్ ప్రసాద్ రాజు, ఎఇఓలు నరేష్, సాయి, వాసంతి తదితరులు పాల్గొన్నారు.



# కల్లూరులో గంజాయి విక్రయదారుల అరెస్టు

**ప్రజాపక్షం/కల్లూరు :** కల్లూరులోని లక్ష్మీపురం వెళ్లే రహదారి సొసైటీ భవనం వెనకాల చెరువు కట్ట వద్ద ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉండడంతో వాహన సైరన్ విని ఒక్కసారిగా కంగారుపడి రెండు బండ్ల మీద పారిపోతుండగా పోలీసు వారు వెంబడించి పట్టుకున్నారు.

అనంతరం వారిని విచారించగా షేక్ హమీద్ కల్లూరు, షేక్ హబీబ్ పాషా (మణుగూరు), మీడియం గోవిందు (మణుగూరు) వారుగా గుర్తించారు. వీరు ముగ్గురు వీరందరూ గంజాయికి అలవాటుపడి గత కొంతకాలంగా ఒరిస్సా రాష్ట్రం మల్కాన్గిరి జిల్లాకు చెందిన చందుగూడ గ్రామానికి వెళ్లి అక్కడ సన్నీ అనే వ్యక్తి వద్ద ఒక కేజి గంజాయి రూ.3,500కు కొనుగోలు చేసి పంచుకొని కొంత మొత్తం వారు తాగడానికి ఉంచుకొని సేవిస్తూ మిగిలినదాన్ని వారిలాగే గంజాయి అలవాటు ఉన్న వారి స్నేహితులకు పరిచయం అయినవారికి చిన్న చిన్న పొట్లాలలో 200 నుంచి 300 వరకు అమ్మేవారిని కల్లూరుకు చెందిన హమీద్ స్నేహితుల్లో గంజాయి తాగే అలవాటు ఉన్న యువకులు ఎంతైనా డబ్బు పెట్టి గంజాయి కొనడానికి సిద్ధంగా ఉండడంతో గంజాయిని పెద్ద మొత్తంలో తెచ్చి అమ్మి



లాభాలు వస్తాయని ఆలోచించి గత పది రోజుల క్రితం మరియు గోవిందులు రెండు మోటార్ సైకిల్స్‌పై ఒరిస్సా రాష్ట్రం నుంచి తెచ్చిన గంజాయి వారు ఇరువురు చెరో కిలో ప్యాకెట్ తీసుకున్నారు.

హమీద్ వాటాగా వచ్చిన దానిని అతడి వద్ద తరచుగా గంజాయి తీసుకువెళ్లి కల్లూరు, పెనుబల్లి, తల్లాడ, మండలాల పరిధిలో పరిచయస్తులైన వ్యక్తులకు అమ్ముతూ వ్యాపారం చేసేవాడు. ఆ వ్యక్తిని అతని వద్ద ఉన్న ద్విచక్ర వాహనాలను అదుపులోకి తీసుకున్నట్లు ఎసిపి రఘు, సిఐ ముత్తు లింగయ్య, ఎస్సై హరిత లు విలేకరుల సమావేశంలో తెలిపారు. యువత గంజాయి బారిన పడకుండా ఉండాలని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని యువతను కోరారు.

## నాయిబ్రాహ్మణుల కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మంరూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ నాయిబ్రహ్మణుల సంక్షేమ సంఘం సమావేశాన్ని వరంగల్ క్రాస్‌రోడ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఖమ్మంరూరల్ మండల అధ్యక్షుడిగా నంద్యాల వీరబ్రహ్మం, ప్రధాన కార్యదర్శిగా వెంకటనారాయణ, ఏదులాపురం మున్సిపాలిటీ అధ్యక్షులుగా నంద్యాల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా మాదారపు సైదులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కే. వెంకటేశ్వర్లు, సురభి సైదులు, సందీప్ పాల్గొన్నారు.

## 10 నుండి 12వ తేదీ వరకు ఎఐసిసి కార్యదర్శి వంశీ చందర్‌రెడ్డి జిల్లా పర్యటన

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్

**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** ఈనెల 10 నుండి 12వ తేదీ వరకు ఆలిండియా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి చల్లా వంశీ చందర్‌రెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ నేడొక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ కమిటీ నుండి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జిగా నియమితులైన సందర్భంగా వంశీ చందర్‌రెడ్డి ఖమ్మంజిల్లాకు రానున్నట్లు ఆయన తెలిపారు. ఆయన పర్యటనలో భాగంగా సంస్థాగత ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలు ప్రధాన ఎజెండాగా సమావేశాలు ఉంటాయని తెలిపారు. 10న మధ్యాహ్నం 12 గంటలకు జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం, రెండు గంటలకు పార్టీ ముఖ్యులతో సమావేశం, మూడు గంటల నుండి అందుబాటులో ఉన్న నియోజకవర్గ ఇంచార్జీలు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా పార్టీశ్రేణులు ప్రణాళికలు సిద్ధం చేసుకుని వంశీ చందర్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఎఐవైఎఫ్ జిల్లా సంయుక్త కార్యదర్శిగా ఖయ్యూం

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** ఎఐవైఎఫ్ జిల్లా సంయుక్త కార్యదర్శిగా కొత్తగూడెం పట్టణంలోని రామవరం ప్రాంతానికి చెందిన ఖయ్యూంను బుధవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత 12 సంవత్సరాలుగా సిపిఐ అనుబంధ సంఘమైన అఖిల భారత యువజన సమాఖ్యలో పనిచేస్తు ఎన్నో ప్రజా యువజన ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారు. రామవరం భగత్సింగ్ శాఖ కార్యదర్శిగా పనిచేసి అంచలంచలుగా సంఘంలో ఎదుగుతూ వస్తున్నారు. జూలూరుపాడులో జరిగిన ఎఐవైఎఫ్ జిల్లా 2వ మహాసభలో జిల్లా సహాయ కార్యదర్శిగా ఎస్‌కె.ఖయ్యూంని ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగింది. ఈ సందర్భంగా ఖయ్యూం మాట్లాడుతూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 2వ మహాసభలో ఎఐవైఎఫ్ జిల్లా సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు జిల్లా కార్యదర్శి ఎస్‌కె, షాబీర్ పాషాలకు ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలిఉల్లా ఖాద్రీ ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర ధన్యవాదాలు తెలియ చేశారు. తనకిచ్చిన బాధ్యతను దృష్టిలో పెట్టుకొని సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులలో సరిపడా

# డాక్టర్లను నియమించాలి

ల్యాబ్ టెక్నీషియన్లు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు
వైద్య శాఖ మంత్రి పర్యవేక్షణ విఫలం
ఫహీమ్ దాదా ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** అఖిలభారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ ఆసుపత్రుల్లో సందర్శించి అక్కడి సమస్యలు తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఫహీమ్ మాట్లాడుతూ, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్నటువంటి నియోజకవర్గాలలో ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శించి అక్కడ ఉన్నటువంటి రోగులను వారి ఇబ్బందులు సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగింది.

జిల్లాలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులు సమస్యల నిలయంగా మారుతున్న వైద్యశాఖ అధికారుల, మంత్రి పర్యవేక్షణ వైఫల్యం తెలుస్తుందని ఆయన అన్నారు. ఆస్పత్రులలో సరిపడ డాక్టర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ సిబ్బంది లేక, సరైన సదుపాయాలు లేక ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తున్న పేద మధ్యతరగతి ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని, కొన్ని ఆస్పత్రులలో చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు మందులు కూడా లేకపోవడం శోచనీయం అన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రజలకు వస్తే వారి పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు. మాతా శిశు ఆసుపత్రిలో 20 నుండి 25 మంది డాక్టర్లు అవసరం ఉండగా కేవలం 5 మంది డాక్టర్లతో చాలీచాలని వైద్యాం అందించడం సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఒక్కసారి కూడా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వైద్యం శాఖ మంత్రి సందర్శించిన దాఖలాలే లేవని అన్నారు. సమస్యలు తెలుసుకుని పరిష్కరించకపోవడం బాధాకరమని ఆయన చెప్పారు.

తక్షణమే ప్రభుత్వం స్పందించి జిల్లాలో సరిపడా డాక్టర్లను, నర్సులను, ల్యాబ్ టెక్నీషియన్లను ఏర్పాటు చేయాలని లేని పక్షంలో ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఖయ్యూం, ఉపాధ్యక్షులు, పరిగెల భూపేష్, మోతే కృష్ణ, జిల్లా నాయకులు రణధీర్, జావిద్, రవి, బానోత్ శ్రీను, వెంకట్, వినయ్, సంజయ్, పాల్గొన్నారు.

## జవహర్ నవోదయ విద్యాలయ ఏర్పాట్ల పరిశీలన

పరిశీలిస్తున్న స్తున్న ఎం.వెంకటేశ్వరాచారి
నవోదయ విద్యాలయం ప్రారంభానికి ముందస్తు సంసిద్ధత ఏర్పాట్లు

**ప్రజాపక్షం/కరకగూడెం :** కరకగూడెం మండలంలో తాత్కాలికంగా ఏర్పాటు చేయబడుచున్న జవహర్ నవోదయ విద్యాలయ ఏర్పాట్లను బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర చారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం కరకగూడెంలో జవహర్ నవోదయ విద్యాలయాన్ని ప్రారంభిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం దీనికి సంబంధించిన అన్నిరకాల ఏర్పాట్లు పూర్తయ్యాయని, వేరు వేరు ప్రదేశాల నుండి ఈ విద్యాలయంలో విద్యార్థులు ప్రవేశం పొందుతారు కావున, నవోదయ విద్యాలయం ద్వారా దేశంలోనే అత్యంత నాణ్యమైన విద్యను భద్రాద్రి జిల్లా విద్యార్థినీ విద్యార్థులకు అందుబాటులోకి రావడం మన జిల్లా అదృష్టమని అన్నారు. జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటుకు జరుగుతున్న వసతులను పరిశీలించి జులై 14వ తేదీన జవహర్ నవోదయ విద్యాలయం ప్రారంభించుటకు అన్ని రకాల పనులను పూర్తి చేసి పాఠశాలను సిద్ధంగా ఉంచాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించి యూనిఫామ్ టెక్స్ట్ బుక్స్ నోట్ బుక్స్ సంబంధించిన అంశాలను పిల్లలు నడిగి తెలుసుకున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర చారి, జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్స్ నాగరాజు శేఖర్, సైదులు, కరకగూడెం మండల విద్యాధికారి జి.మంజుల, అశ్వాపురం, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

# ఈ భూములు మీవైతే వదిలేస్తాం

కోర్టు తీర్పుకు కట్టుబడి ఉందాం
అందాక బతకనివ్వండి
ఇకపై ఎవ్వరూ దాడి చేయలేదు
విలేకరుల సమావేశంలో పురుషోత్తపట్నం ప్రజలు

**ప్రజాపక్షం/భద్రాచలం :** పురుషోత్తపట్నంలోని భూములు మీవైతే తప్పకుండా వదిలేస్తామని, కానీ ఇరువర్గాలు కూడా కోర్టు తీర్పుకు కట్టుబడి ఉందామని పురుషోత్తపట్నం గ్రామపెద్ద కె.రామిరెడ్డి అన్నారు. రామాలయం భూముల వివాదంలో మంగళవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకున్న విషయం విదితమే. దీనిపై పలు వార్తలు వెలుగులోనికి రావడంతో బుధవారం పురుషోత్తపట్నం గ్రామంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గ్రామస్తులు ఎవ్వరూ ఇకపై దాడి చేయలేదని, ఆమె ప్రైవేటు సైన్యాన్ని వేసుకుని వచ్చి ఇక్కడ దౌర్జన్యం చేశారని, ఈ ఘటనలో ఇంటిని నిర్మించుకున్న పున్నమ్మ అనే మహిళ స్పృహ తప్పి పడిపోవడంతో ఆమెకు ఏమైనా ఐతే తన ఉద్యోగం పోతుందని భయాందోళనకు గురైన ఇఒ కావాలని కిందపడినట్లు చేసినట్లు తమకు అనుమానాలు ఉన్నాయని అన్నారు. మూడు తరాలుగా ఇక్కడే జీవనం సాగిస్తున్నామని, తమ పూర్వికులు ఇది దండకారణ్యంగా ఉన్న రోజుల్లో ముదిగొండ నుండి రజాకర్ల ఇబ్బందులు తట్టుకోలేక ఇక్కడి వచ్చారని, ఆ నాటి నుండి నేటి వరకు భూములను చదునుచేసి తీర్చిదిద్దామని అన్నారు. భూములపై కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని చెబుతున్నా ఇక్కడికి వచ్చి ఎందుకు గలాటా చేయాలని, ఈ తీర్పును అనుసరించి పోలీస్ ఫిర్యాదు చేస్తే బాగుండేదిగా అన్నారు. భూములు ఎక్కడికీపోలేదని, ఇక్కడే ఉన్నాయని, తమ వల్ల భూముల విలువు పెరిగిందని అన్నారు. 1968వ సంవత్సరం నుండి కౌలు కట్టించుకుంటూనే ఉన్నారని, వాటికి సంబంధించి రశీదులు కూడా తమ వద్ద ఉన్నాయని, గత కొంత కాలం క్రింత



ఒకేసారి నాలుగైదేళ్లకు సరిపడా కట్టించుకున్నారని, దానిని పక్కనపెట్టి ఇప్పుడు రాద్ధాతం చేస్తే మంచిది కాదన్నారు. ఇప్పటికైనా కోర్టు తీర్పువచ్చే వరకు ఆగాలని, ఆ తీర్పు తమకు అనుకూలంగా వస్తే భూములను తప్పకుండా అప్పగిస్తామని, అప్పటిదాగా తమను బతకనివ్వాలన్నారు. అనంతరం సర్పంచ్ ఆదినారాయణ, ఎంపిటిసి రామిరెడ్డి, వెంకట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కదంతొక్కిన కార్మికలోకం

## సార్వత్రిక సమ్మె సంపూర్ణం, ప్రశాంతం


ఖమ్మం


భూపాలపల్లి...


నిర్మల్...


కొత్తగూడెం...


మేడ్చల్...


జగిత్యాల...


వరంగల్...


నల్లగొండ...


రాజన్న సిరిసిల్ల...


తొర్రూర్...


కామారెడ్డి...


షాబాద్...


జనగామ..

**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక, రైతు సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి పిలుపు మేరకు బుధవారం జరిగిన సార్వత్రిక సమ్మె ఉమ్మడి ఖమ్మంజిల్లాలో సంపూర్ణంగా, ప్రశాంతంగా జరిగింది. బంద్ సందర్భంగా సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్, సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ, ఎఐటియుసి, సిఐటియు, ఐఎన్‌టియుసి, టియుసిఐ, బిఆర్‌టియు తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అగ్రభాగాన సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మినారాయణ, తోట రామాంజనేయులు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, టియుసిఐ నాయకులు కె.రామయ్య నేతృత్వం వహించారు.

**మంచిర్యాల :** 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని మంచిర్యాలలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మేకల దాసు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భోపాల్, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి టి శ్రీనివాస్, టియుసిఐ జిల్లా కార్యదర్శి దేవరాజ్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఖలీందర్ అలీఖాన్, ముస్కె సమ్మయ్య, మిట్టపల్లి పౌలు, దాగం మల్లేష్, రేగుంట చంద్రశేఖర్, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి తోకల సరస్వతి, రామ, సురేఖ, అరుణ, కుసుమ పాల్గొన్నారు.

**హనుమకొండ :** కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు అయ్యేంత వరకు ఉద్యమాలు ఆగవని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి, ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి హంస రెడ్డి, సిపిఐ(ఎంఎల్) జిల్లా నాయకులు గంగుల దయాకర్, ఆర్‌ఎస్‌పీ జిల్లా నాయకులు కౌడగాని శివాజీ అన్నారు. హనుమకొండ జిల్లా కేంద్రంలో సార్వత్రిక సమ్మెకు మద్దతుగా వామపక్ష పార్టీల కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించి అనంతరం కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అదరి శ్రీనివాస్, ఎన్ఎ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కర్రె లక్ష్మణ్, జక్కు రాజ్ గౌడ్, నాయకులు బత్తిని సదానందం, నేదునూరి వెంకట్రాజం, కొట్టేపాక రవి, నేదునూరి రాజమౌళి, మునిగాల బిక్షపతి, వేల్పుల సారంగపాణి, ధర్మల రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్ అర్బన్ :** జాతీయ సార్వత్రిక సమ్మె పిలుపుమేరకు నిజామాబాద్ జిల్లా జెఎసి ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ ఆడిటోరియం వద్ద సభ జరిపి, ధర్నా చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జిల్లా సహాయ కార్యదర్శి అనిల్, సిఐటియు జిల్లాకార్యదర్శి నూర్జహాన్, టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఎం.నరేందర్, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు మల్లికార్జున్ మాట్లాడారు. సమ్మెలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్రాములు, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య పాల్గొన్నారు.

**పెద్దపల్లి:** కార్మిక చట్టాలను కొనసాగించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం సింగరేణి వ్యాప్తంగా సింగరేణి కార్మికులు, ఉద్యోగులు, సింగరేణి కాంట్రాక్టు కార్మికులు దేశవ్యాప్త సార్వత్రికసమ్మెలో పాల్గొనారని సింగరేణి గుర్తింపు సంఘం ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. సార్వత్రిక సమ్మె సందర్భంగా గోదావరిఖని ప్రధాన చౌరస్తా వద్ద జేఏసీ సంఘాల ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించిన అనంతరం ఆ యన తుమ్మల రాజారెడ్డి, మిర్యాల రాజిరెడ్డి, పి.ధర్మపురి, కట్ట విశ్వనాథంతో కలిసి మాట్లాడారు.

**సూర్యాపేట:** కార్మిక హక్కులను కాలరాస్తున్న నరేంద్రమోడి ప్రభుత్వానికి గద్దె దించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఎఐటియుసి జిల్లా ఆఫీస్ నుండి కొత్త బస్టాండ్ వరకు ఆశావర్కర్లు, బిల్డింగ్‌వర్కర్స్‌యూనియన్, రిక్షా కార్మికులు, సివిల్ హమాలీ యూనియన్, కార్మికులు, యువజన సంఘం నాయకులు, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నిరసన ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఎఐటియుసి ప్రాంతీయ అధ్యక్షులు దంతాల రాంబాబు, ప్రాంతీయ కార్యదర్శి నిమ్మల ప్రభాకర్, నాయకులు పెండ్ర కృష్ణ, దీకొండ శ్రీనివాస్, శ్రీకాంత్, బూర సైదులు, పున్నం రమేష్, దీకొండ రవి, వాడపల్లి వెంకన్న, ఆశావర్కర్లు కవిత, అరుణ, హస్సేన్, గోవర్ధనమ్మ, రాధ, సైదమ్మ పాల్గొన్నారు.

**వరంగల్ :** కార్మిక వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోవాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా ఆల్ ట్రేడ్ యూనియన్స్ కార్మిక రైతు సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ రైల్వే స్టేషన్ నుండి వరంగల్ చౌరస్తా వరకు మహా ర్యాలీని నిర్వహించారు. ర్యాలీకి సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ రంగయ్య, న్యూడెమోక్రసీ పార్టీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు, రైతు సంఘం నాయకులు సోమిడి శ్రీనివాస్, సుధమల్ల భాస్కర్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షులు ఎండి యాకుబ్, సహాయ కార్యదర్శి గుండె బద్రి సుంచు జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

**కరీంనగర్ :** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె కరీంనగర్ జిల్లాలో విజయవంతమైంది. జిల్లా కేంద్రంలో తెలంగాణ చౌరస్తా నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సమ్మెలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి సమ్మయ్య, జిల్లా అధ్యక్షుడు బుచ్చన్న యాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ కార్పోరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి రామ్మోహన్ రావు, వామన్ రావు, బ్యాంకింగ్ నాయకులు వెల్లంది దామోదర్, నిఖిల్, మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ రాష్ట్ర అధ్యక్షుడు చీకోటి శ్రీధర్, మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగామ రాజమల్లు, హరిత బయో ప్రొడక్ట్స్ కంపెనీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మడిపల్లి మహేందర్, హమాలీ యూనియన్ అధ్యక్షుడు సతీష్, రైల్వేహమాలీ కొత్తె లక్ష్మయ్య, దాసరి ప్రభాకర్, సివిల్ సప్లై హమాలీ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజేందర్, ఆర్టీసీ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు పోశయ్య, మధ్యాహ్న భోజనం వర్కర్స్ యూనియన్ నాయకులు బుర్ర మంజుల, ఆటో యూనియన్ నాయకులు రాజేందర్, సంపత్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, ఎల్లయ్య తదితరులున్నారు.

**ఆదిలాబాద్ :** కార్మిక చట్టాలను కొనసాగించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు సమ్మె ఆదిలాబాద్ జిల్లాలో విజయవంతం అయింది. సమ్మెలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్, నాయకులు దేవేంధర్, రాజు, కాంతరావు తదితరులు పాల్గొన్నారు.

**జయశంకర్ భూపాలపల్లి :** కేంద్రంలో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆదాని, అంబానీలకు దేశ సంపదను బడా పెట్టుబడిదారులకు దోచి పెట్టేందుకే నాలుగు నల్ల లేబర్ కోడ్ లను తెచ్చిందని జాతీయ సంఘాల జెఎసి నాయకులు కొరిమి రాజ్ కుమార్, మధుకర్ రెడ్డి, బడితల సమ్మయ్య, కంపేటి రాజయ్య లు ఆరోపించారు. కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన దేశవ్యాప్త సమ్మె భూపాలపల్లి జిల్లాకేంద్రంలో విజయవంతంగా ముగిసింది. భూపాలపల్లి ఏరియాలోని అన్ని మైన్స్, డిపార్ట్మెంట్లు, ఏరియా హాస్పిటల్, వర్క్ షాప్‌లలో సమ్మె విజయవంతంగా కొనసాగింది. జెఎసి సంఘాల నాయకుల ఆధ్వర్యంలో జిఎం కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాతంగి రామచందర్, గురిజేపల్లి సుధాకర్ రెడ్డి, గంగ సరపు శ్రీనివాస్ మధు గాని విజేందర్, ఆసిఫ్ పాషా, జోగబుచ్చయ్య, బందు సాయిలు, కాంట్రాక్ట్ కార్మికుల ఇంచార్జ్ నూకల చంద్రమౌళి, సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, జిల్లా సమితి నాయకులు క్యాతరాజ్ సతీష్, కొమిరి సుగుణ, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, మండల కార్యదర్శి కుదుదల వెంకటేష్, వెలిశెట్టి రాజయ్య పాల్గొన్నారు.

**నల్లగొండ :** కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టిన సమ్మెతో కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని వెంటనే కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, సిఐటియూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు అంబటి సోమన్న డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక, రైతు సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి పిలుపు మేరకు బుధవారం నల్లగొండ జిల్లా వ్యాప్తంగా కార్మికులు ఉద్యోగులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు కేఎస్‌రెడ్డి, ఐఎన్‌టియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి మొయినుద్దీన్, బిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు గుర్రం వెంకటరెడ్డి, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి బొమ్మిడి నగేష్, దండంపల్లి సత్తయ్య, ఎఐటియుసి జిల్లా కోశాధికారి దొనకొండ వెంకటేశ్వర్లు, పి.వెంకటరావు, ఉట్కూరు రమేష్ దర్, సుంకిశాల వెంకన్న, బొంగరాల ఈశ్వర్, అలీముద్దీన్, మిట్టపల్లి నందం శ్యామ్‌సుందర్ వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేసి, 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆర్డీవో కార్యాలయం నుండి గాంధీ చౌరస్తా మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, అధ్యక్షుడు అజ్జ వేణు, సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు పంతం రవి, మీసం లక్ష్మణ్, సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ, రామయ్య ఐఎన్టీయూసీ గొట్టె రుక్మిణి, గోనెల్లప్ప,ఆకుల రాములు,జిందం ప్రసాద్, సోమిశెట్టి దశరథం, వంగల శ్రీనివాస్ సతీశ్ పాల్గొన్నారు.

**నిర్మల్ టౌన్ :** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో భగత్ సింగ్ భవన్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ ఆచారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్ట రాజన్న మాట్లాడారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ చారి, నిర్మల్ జిల్లా కార్యదర్శి బొజ్జా రమేష్, అధ్యక్షుడు పద్మకుమారి, నాయకులు ఎస్.లక్ష్మీ, వి.మహేందర్, కిరణ్, గంగామని, కిషన్, పోశెట్టి, రాజన్న, రాజు, భూమేష్, రమేష్ కార్మికులు పాల్గొన్నారు.

**తొర్రూరు :** సార్వత్రిక సమ్మెలో భాగంగా పట్టణ కేంద్రంలో కార్మికులు ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్ మానవహారం నిర్వహించారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఓమ బిక్షపతి, సిఐటియు జిల్లా నాయకులు బొల్లం అశోక్, ముంజంపల్లి వీరన్న, రిటైర్డ్ ఉద్యోగ సంఘాల నాయకులు వెంకటాచారి, ఎఐకెఎస్ జిల్లా సహాయకార్యదర్శి ఉడుగుల లింగన్న, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రామచంద్రు పాల్గొన్నారు.


తాండూరు..

**పిట్లం :** దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఎఐటీయుసి ఆధ్వర్యంలో బుధవారం కామారెడ్డి జిల్లా పిట్లంలో సార్వత్రిక ఒకరోజు సమ్మె నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు బుర్రెం బాలరాజ్ మాట్లాడారు. అనంతరం బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ కిరణ్మయికు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ దుబాస్ రాములు, శంకర్ పాల్గొన్నారు.

**కొత్తగూడెం టౌన్ :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా హక్కులను కాలరాస్తూ పాలనా సాగిస్తోందని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు గౌని నాగేశ్వరరావు అన్నారు. కేంద్రప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేఖ విధానాలు, కార్మికచట్టాల సవరణ, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర కార్మిక, ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లు, ఫడరేషన్ల ఇచ్చిన పిలుపులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటీ రంగ సంస్థల కార్మికులు, ఉద్యోగులు బుధవారం స్వచ్ఛందంగా సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నారు. సమ్మె సందర్భంగా పట్టణంలోని ఓల్డ్ డిపో సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ అమరవీరుల స్తూపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ, ఎఐటియుసి నాయకులు నరాటి ప్రసాద్, చంద్ర నరేంద్రకుమార్, కంచర్ల జమలయ్య, వంగ వెంకట్,గెద్దాడ నగేష్, వాసిరెడ్డి మురళి, భూక్యా శ్రీనివాస్, రమణమూర్తి పాల్గొన్నారు.

**మేడ్చల్ :** మేడ్చల్ జిల్లాలో బుధవారం దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె నేపథ్యంలో కార్మిక లోకం కదలింది. జీడిమెట్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఎఐటియుసి, సిఐటియుసి, టియుసిల బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసూఫ్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, సిఐటియు జిల్లా అధ్యక్షులు అశోక్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కె.స్వామి. సిఐటియు మండల కార్యదర్శి కె.లక్ష్మణ్, ఎఐటియుసి నేతలు నరసింహరెడ్డి, సాయిలు, సదానంద్, బక్కరి మల్లేష్, శ్రీనివాస్, సుంకిరెడ్డి, మహేందర్, కనకయ్య, చంద్రకాంత్, భీమేష్,జార్గ్ పాల్గొన్నారు. మల్లాపూర్‌లో ఎఐటియుసి, సిపిఐ, ఎఐవైఎఫ్, ఎఐఎస్‌ఎఫ్‌ల ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, సిపిఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి.సత్యప్రసాద్, ఎఐటియుసి నేతలు గిరిబాబు, గడ్డం ప్రతాప్, రమేష్, నర్సింహారావు, సిపిఐ నేతలు రమణయ్య, రాము, శేఖర్, అజీమ్, పాషా, సమీర్, రాజు పాల్గొన్నారు.

**షాబాద్ :** రైతులను, కార్మికులను మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. బుధవారం సార్వత్రిక సమ్మెలో భాగంగా చేవెళ్ల మండల కేంద్రంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో హైదరాబాద్ – బీజపూర్ జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి ప్రభలింగం, కౌన్సిల్ సభ్యులు సుధాకర్, సుభాన్ రెడ్డ, కార్యదర్శులు, సత్తి రెడ్డి, శ్రీనివాస్, సుధీర్, శ్రీశైలం, మక్బుల్, అంజయ్య, వడ్ల మంజుల, మీనాక్షి, గోపాల్ రెడ్డి, ప్రభాకర్, యాదగిరి, లలిత పాల్గొన్నారు.

**జనగామ :** జనగామలో కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఎఐటియుసి, సిఐటియు, బిఆర్‌టియు ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో కార్మికుల పెద్ద ఎత్తున మహా ప్రదర్శన నిర్వహించారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యరద్శి ఆకుల శ్రీనివాస్, సిఐటియు జిల్లా అధ్యక్షులు రాపర్తి రాజు, బిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు వేముల నర్సింగం అధ్యక్షత వహించగా ఎఐటియుసి గౌరవాధ్యక్షులు, జనగామ మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు చామకకూర యాకుబ్, మరికుక్కల సాయిలు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చందు పాల్గొన్నారు.

**జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లాలో కార్మిక, ఉద్యోగవర్గం ర్యాలీ నిర్వహించారు. ఎఐటియుసి నాయకులు ఎం.డి.ముక్రం, సూతరి రాములు, సిపిఐ జగిత్యాల జిల్లా కార్యదర్శి వెన్న సూరెష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల సురేష్ పాల్గొన్నారు.

**తాండూర్ :** ఎఐటియుసి ఆధ్వర్యంలో నిర్వహించిన సార్వత్రిక సమ్మెలో మున్సిపాల్ కార్మికులు జిల్లా నాయకులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎఐటియుసి జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి పండిత్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రవీందర్, నాయకులు గోపాల్, మనీర్, సిపిఐ పివిల్ జనరల్ సెక్రెటరి దస్తప్ప, మీనాజుద్దీన్, అశోక్, నర్సిములు, అబ్దుల్లా, వేంకటప్ప, దేవి, విజయలక్ష్మి , పెన్నా దస్తప్ప పాల్గొన్నారు.

**కొత్తగూడెం సింగరేణిలో...** కార్మిక సంఘాల జెఎసి పిలుపు మేరకు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఎఐటియుసి, ఐఎన్టీయూసీ, సీఐటీయూ, టీబీజీకేఎస్, ఇఫ్టు నాయకులు పాల్గొని ప్రసంగించారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ తరపున యూనియన్ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, కార్పొరేట్ బ్రాంచ్ కార్యదశి ఎస్.వి. రమణ మూర్తి, ఎఐటియుసి, సిపిఐ పక్షాన సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబిర్ పాషా, కె.జమలయ్య తదితరులు పాల్గొన్నారు.


సూర్యాపేట...


కొత్తగూడెం సింగరేణి...


కరీంనగర్...


ఆదిలాబాద్...


మంచిర్యాల...


హన్మకొండ..


నిజామాబాద్...


పెద్దపల్లి...

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com